జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

ఆదిలాబాద్, హైదరాబాద్ | మంగళవారం 30 జూన్ 2026 | సంపుటి: 19 | సంచిక: 115 | పేజీలు: 12 | వెల: రూ.3 | RNI No : TELTEL/2008/24799

పరాభవ నామ సంవత్సరం , జ్యేష్ఠ మాసము , తిథి: పూర్ణిమ - 05:29:01 వరకు నక్షత్రంపూర్వాషాఢ - నిండా రాత్రి వరకు కరణంబవ - 05:29:01 వరకు, బాలవ - 18:36:09 వరకు పక్షంశుక్ల యోగంబ్రహ్మ - 15:18:20 వరకు

Published from ADILABAD, RANGAREDDY (HYDERABAD), NIZAMABAD, WARANGAL http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

## పశ్చిమాసియా ఉద్రిక్తలపై తాత్కాలిక చర్యలు

**నేడు దోహా వేదికగా అమెరికా, ఇరాన్‌ల మధ్య చర్చలు**

న్యూఢిల్లీ,జూన్29(ప్రజాజ్యోతి): పశ్చిమాసియాలో ఇటీవల మళ్లీ చెలరేగిన ఉద్రిక్తతలకు తాత్కాలికంగా విరామం లభించనుంది. అమెరికా, ఇరాన్ కీలక నిర్ణయం తీసుకున్నాయి. చర్చలు జరుగుతున్న ప్రస్తుత తరుణంలో పరస్పర దాడులను నిలిపివేయాలని ఒక ఒప్పందానికి వచ్చాయి. అలాగే మంగళవారం ఇరు

మిగతా1 2లో..

## 'ఉద్యోగుల ఆరోగ్య పథకం'నిధిపై ఉత్తర్వులు

ఉద్యోగుల మూల వేతనం నుంచి కోత

హైదరాబాద్,జూన్29(ప్రజాజ్యోతి): తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు , వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య రక్షణ కోసం అమలవుతున్న 'ఉద్యోగుల ఆరోగ్య పథకం'నిధి సమకూర్పుపై రాష్ట్ర ఆర్థిక శాఖ సరికొత్త ఉత్తర్వులను జారీ చేసింది.

మిగతా 2లో..



## గ్రామీణాభివృద్ధి పథకాల్లో తెలంగాణ

# వెనుకబాటు

గ్రామాల అభివృద్ధే వికసిత్ భారత్‌కు పునాది కావాలి

పీఎంజీఏసీవై రహదారుల పనులు వేగవంతం కావాలి

కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ కీలక వ్యాఖ్యలు

న్యూఢిల్లీ,జూన్29(ప్రజాజ్యోతి): గ్రామీణ పథకాల అమలులో తెలంగాణ వెనుకబడి ఉందని కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆయా పథకాల అమలును పరిశీలించినప్పుడు ఇది కనిపించిందన్నారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్రంపై ఆయన వ్యాఖ్యలు చేశారు. సోమవారం న్యూఢిల్లీలో గ్రామీణాభివృద్ధి పథకాల అమలుపై మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశానికి 27 రాష్ట్రాల గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రులు హాజరయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రం గురించి ఆయన మాట్లాడుతూ.. పీఎంజీఏసీవై రహదారుల పనులు వేగవంతం కావాలని చెప్పారు. పెండింగ్ రహదారి పనులు పూర్తి చేయాలని సూచించారు. పీఎం ఆవాస్ సర్వే త్వరగా పూర్తి చేయాలని తెలంగాణ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రితోపాటు ఉన్నతాధికారులను ఆదేశించారు. గ్రామీణాభివృద్ధి శాఖలో ఖాళీలు

మిగతా 12లో..

## కేంద్రం సహకరిస్తేనే రాష్ట్రాల అభివృద్ధి సాధ్యం

- వీబీ జీ రామ్ జీ పథకంపై అభ్యంతరాలున్నాయ్
- పాత విధానంలోనే 75 శాతం కాంపోనెంటట్ కొనసాగించాలి
- 60:40 నిధుల విధానంపై తెలంగాణకు తీవ్ర అభ్యంతరాలు
- గ్రామీణాభివృద్ధిశాఖ సమావేశంలో సీతకక్క స్పష్టీకరణ



న్యూఢిల్లీ,జూన్29(ప్రజాజ్యోతి): కేంద్ర ప్రభుత్వం గ్రామీణాభివృద్ధి పథకాలకు సంబంధించి తీసుకువస్తున్న సరికొత్త నిధుల విధానాలపై తెలంగాణ ప్రభుత్వం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. వీబీ జీ రామ్ జీ పథకంపై అభ్యంతరాలను కేంద్రానికి మంత్రి సీతక్క తెలియజేశారు. సోమవారం ఢిల్లీలో జాతీయ గ్రామీణాభివృద్ధి సదస్సుకు సీతక్క హాజరయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ గ్రామీణాభివృద్ధి పథకాల అమలును జాతీయ సదస్సులో కేంద్రానికి వివరించారు. జులై 2న వీబీ జీ రామ్ జీపై తెలంగాణ కేబినెట్ తుది నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. వీబీ జీ రామ్ జీ పథకం

మిగతా 12లో..



## ముఖం చాటేసిన

# నైరుతి

### దేశవ్యాప్తంగా వర్షాల కోసం ఎదురుచూపు

### ఏరువాక సాగక రైతన్న ఆందోళన

**దేశంలో నైరుతి రుతుపవనాలు జూన్ 4న కేరళ తీరాన్ని తాకినప్పటికీ, దేశంలోని చాలాప్రాంతాలు ఇంకా వర్షాల కోసం వేచి చూస్తున్నాయి. గత 146 ఏండ్ల వాతావరణ చరిత్రలో ఈ జూన్ నెల అత్యంత పొడిగా నమోదైన నెలల్లో ఒకటిగా నిలిచిందని వాతావరణ నిపుణులు పేర్కొన్నారు. మొత్తంగా దేశంలో నైరుతి రుతుపవనాలు మళ్లీ ముఖం చాటేశాయి. జూన్ 4 నుంచి 28 మధ్య సాధారణంగా 141.4 ఎంఎం వర్షం కురువాల్సి ఉండగా, ఈసారి 77.1 ఎంఎం వర్షపాతమే నమోదైంది.**

న్యూఢిల్లీ,జూన్29(ప్రజాజ్యోతి): దేశంలో నైరుతి రుతుపవనాలు జూన్ 4న కేరళ తీరాన్ని తాకినప్పటికీ, దేశంలోని చాలాప్రాంతాలు ఇంకా వర్షాల కోసం వేచి చూస్తున్నాయి. గత 146 ఏండ్ల వాతావరణ చరిత్రలో ఈ జూన్ నెల అత్యంత పొడిగా నమోదైన నెలల్లో ఒకటిగా నిలిచిందని వాతావరణ నిపుణులు పేర్కొన్నారు. మొత్తంగా దేశంలో నైరుతి రుతుపవనాలు మళ్లీ ముఖం చాటేశాయి. జూన్ 4 నుంచి 28 మధ్య సాధారణంగా 141.4 ఎంఎం వర్షం కురువాల్సి ఉండగా, ఈసారి 77.1 ఎంఎం వర్షపాతమే నమోదైంది. కదిలే మేఘాలు ఈశాన్య రాష్ట్రాలు, బంగ్లాదేశ్ సరిహద్దు ప్రాంతాలు, దక్షిణ-మధ్య అరేబియా సముద్రానికే పరిమితమయ్యాయి. భారత వాతావరణ శాఖ విడుదల చేసిన వర్షపాతం పటం రుతుపవనాల అస్థిర ప్రభావాన్ని తెలియజేస్తున్నది.

మిగతా 12లో..

## జీవితం అంటే వందమీటర్ల

# పరుగుపందెం కాదు

ఓపిక, నిలకడ శక్తితో చేపట్టిన పనులు పూర్తిచేయాలి

వీబీఐటీలో వికసిత్ భారత్ స్టూడెంట్స్ కాంక్లేవ్‌లో నితిన్ నబీ

వర్చువల్‌గా పలు జిల్లాల కార్యాలయాలు ప్రారంభం

తెలంగాణలో బిజెపి అధికారానికి ఎంతో దూరం లేదని వ్యాఖ్య






హైదరాబాద్,జూన్29(ప్రజాజ్యోతి): జీవితం వంద మీటర్ల పరుగుపందెం కాదని.. మన ఓపికకు పరీక్ష అని భాజపా జాతీయాధ్యక్షుడు నితిన్ నబీన్ అన్నారు. మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ వీబీఐటీ క్యాంపస్‌లో వికసిత్ భారత్ స్టూడెంట్స్ కాంక్లేవ్‌లో ఆయన పాల్గొన్నారు. భాజపా యువ మోర్చా ఆధ్వర్యంలో దీనిని నిర్వహించారు. రాజకీయాల్లో ఎలాంటి సవాళ్లు ఎదుర్కొన్నారని ఓ విద్యార్థి అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. చిన్న వయసులోనే అనుకోకుండా

మిగతా 2లో..

## అయోధ్య రామాలయ నిధుల దుర్వినియోగం

- అత్యవసర విచారణకు సుప్రీం తిరస్కరణ
- అంత తొందరెందుకని పిటిషన్‌కు ధర్మాసనం ప్రశ్న
- 8మంది నిందులకు 14రోజుల రిమాండ్

న్యూఢిల్లీ,జూన్29(ప్రజాజ్యోతి): అయోధ్య రామాలయంలో విరాళాల దుర్వినియోగం వ్యవహారం సుప్రీం కోర్టుకు చేరింది. ఈ ఆరోపణలపై నిష్పాక్షిక విచారణ జరిపించాలని కోరుతూ అత్యున్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలైంది. సీబీఐ నేతృత్వంలోని ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేయాలని పిటిషనర్ కోరారు. కోర్టు పర్యవేక్షణలో, నిర్ణీత కాలవ్యవధిలో దర్యాప్తు జరిగేలా ఆదేశాలు ఇవ్వాలని అభ్యర్థించారు. అయితే ఈ పిటిషన్ అత్యవసర విచారణకు సుప్రీం

మిగతా 2లో..

## మరోసారి రాజ్యసభ ప్రతిపక్ష నేతగా ఖర్గే

**ప్రమాణ స్వీకారం చేయించిన ఉపరాష్ట్రపతి**

న్యూఢిల్లీ,జూన్29(ప్రజాజ్యోతి): రాజ్యసభకు తిరిగి ఎన్నికైన కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రతిపక్ష నేతగా మళ్లీ గుర్తింపు పొందారు. ఆయన పదవీకాలం ఈనెల 25తో ముగియనుండగా ఇటీవల జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో తిరిగి ఎన్నికయ్యారు. దీంతో రాజ్యసభ ఛైర్మన్ రాధాకృష్ణన్ ఖర్గేను ప్రతిపక్ష నేతగా గుర్తించారు.

మిగతా 12లో..



## నేటి నుంచి రైతుభరోసా

# నిధుల విడుదల

- 2 ఎకరాల వరకు రైతుభరోసా నిధుల జమ
- తొలివిడతలో 41.37 లక్షల మందికి లబ్ధి
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల వెల్లడి



హైదరాబాద్,జూన్29(ప్రజాజ్యోతి): రైతుభరోసా నిధుల విడుదలపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కీలక ప్రకటన చేశారు. నేటి నుంచి రైతుల ఖాతాల్లో నిధుల జమ చేస్తామని తెలిపారు. అర్హులైన అన్నదాతలకు పెట్టుబడి సాయంగా దశలవారీగా నిధులు విడుదల చేస్తామని చెప్పారు. మొత్తంగా 10 రోజుల్లో అందరికీ నిధులు జమచేస్తామన్నారు. రైతు భరోసా నిధుల విడుదల కోసం రైతు ఆశీర్వాద సభకు బదులుగా హైదరాబాద్ శిల్పకళా వేదికలో 'రైతు భరోసా పంపిణీ సదస్సు'గా నిర్వహించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు.

మిగతా 12లో..

## జీడబ్ల్యూఎంసీపై కమలం జెండా లక్ష్యం

**బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్**

**బూత్ స్థాయి కార్యకర్తలతో విజయమే ధ్యేయమని బీజేపీ నేతల పిలుపు..**

**కేంద్ర నిధులు, అభివృద్ధి పనులే ప్రజల్లోకి తీసుకెళ్లాలి**

హనుమకొండ జిల్లా ప్రతినిధి, జూన్ 29, (ప్రజా జ్యోతి): గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ) ఎన్నికల్లో బీజేపీ విజయమే లక్ష్యంగా పనిచేయాలని పార్టీ శ్రేణులకు ఆ పార్టీ జాతీయ, రాష్ట్ర నాయకులు పిలుపునిచ్చారు. వరంగల్‌లో నిర్వహించిన బూత్ అధ్యక్షుల సమావేశం, గిరిజన నేతల సమ్మేళనంలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్, కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్‌రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు పాల్గొని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ వరంగల్‌లో బీజేపీ మేయర్‌ను గెలిపించడమే పార్టీ ప్రధాన లక్ష్యమన్నారు. బీజేపీ మేయర్ ఎన్నికైతేనే కేంద్రం నుంచి మరిన్ని నిధులు వస్తాయని, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీల అమలులో విఫలమైందని విమర్శించారు. స్మార్ట్ సిటీ నిధులు, భద్రకాళి బండ్ అభివృద్ధి, కాజీపేట వ్యాగన్ పరిశ్రమ,

మిగతా 2లో..

## రైతు ఆశీర్వాద సభ

# వాయిదా

- రైతు భరోసా పంపిణీ తరువాత రైతు ఆశీర్వాద సభ
- వరుణుడు కూడా కరుణించడం ఆనందదాయకం
- ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క
- భారీ వర్షాలతో సిఎం ఆశీర్వాద సభ రద్దు
- నేడు శిల్పకలా వేదికగా రైతభరోసా నిర్వహణ

ఖమ్మం,జూన్29(ప్రజాజ్యోతి): ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం చేపడుతున్న రైతు సంక్షేమ, ప్రజా కార్యక్రమాలను మెచ్చి వరణ దేవుడు కూడా కరుణించడాని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. భారీ వర్షాల కారణంగా ఈ నెల 30న తలపెట్టిన రైతు ఆశీర్వాద సభను వాయిదా వేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల వల్ల సభా ప్రాంగణం అంతా బురదమయంగా మారిందని ఆయన చెప్పుకొచ్చారు.

మిగతా 2లో..



## తెలంగాణలో పలువురు ఐపీఎస్‌ల బదిలీ

**ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం**

**భారీగా అటవీ అధికారుల బదిలీలు**

**అరణ్య భవన్‌కు వీఎస్ఎన్‌వి ప్రసాద్**




హైదరాబాద్,జూన్29(ప్రజాజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర పోలీసు శాఖలో ఐపీఎస్, ఎస్‌పీఎస్ అధికారుల బదిలీలు, పోస్టింగులు చేపట్టింది. ఈ మేరకు జీఓ ఆర్.టి. నెం.931ను జారీ చేసింది. పలువురు అధికారులకు కొత్త బాధ్యతలు అప్పగించగా, మరికొందరికి అదనపు బాధ్యతలు కేటాయించింది. రామగుండం పోలీస్ కమిషనర్‌గా కొనసాగుతున్న అంబర్ కిశోర్ ఝాకు డీఐజీ, జోన్-1 (కాళేశ్వరం) అదనపు బాధ్యతలు అప్పగించారు. హైదరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ డి. జోయెల్ డేవిస్‌కు డీఐజీ, జోన్-5 (యాదాద్రి) బాధ్యతలు కూడా అప్పగించారు. వరంగల్ పోలీస్

మిగతా 2లో..

# సంపాదకీయం

## మళ్లీ మొదటికొచ్చిన పశ్చిమసియా !

ట్రంప్ ప్రపంచానికి పట్టిన పీడలాగా తయారయ్యాడు. అటు దేశ ప్రజలకు, ఇటు ప్రపంచ ప్రజలకు ఎప్పుడీ పీడ విరగడ అవుతుందా అని ఎదురు చూస్తున్నారు. శాంతి చర్చల అనంతరం ఒప్పందం చేసుకున్న తరవాత కూడా ఇరాన్‌పై మళ్లీ దాడులు చేయడంతో పశ్చిమాసియాను మళ్లీ యుద్ధమేఘాలు కమ్ముకుంటున్నాయి. ట్రంప్ చేస్తున్న ప్రకటనలకు, చర్యలకు పొంతన లేకుండ ఆపోయింది. దీంతో మళ్లీ యుద్ధం వస్తుందా అన్న భయంలో అనేక దేశాలు ఆందోళన చెందుతున్నాయి. ఇకపోతే ఇటలీవల చేసుకున్న ఒప్పందాన్ని కూడా ట్రంప్ ఖాతరు చేయలేదు. దీంతో అమెరికా, ఇరాన్ మధ్య అవగాహన ఒప్పందానికి పురిట్లోనే గండిపడింది. శనివారం మొదలైన పరస్పర దాడులు ఆదివారం మరింత ఉధృతం కావడంతో మళ్లీ పరిస్థితి మొదటికి వచ్చిందా అన్న ఆందోళన కలుగుతోంది. దాడులు ఆపకుంటే ఇరాన్‌ను భూమ్మీదే లేకుండా చేస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరోమారు హెచ్చరించగా... తమ జోలికి వస్తే అమెరికాకు నరకం చూపిస్తామంటూ ఇరాన్ కూడా అంతేదీటుగా స్పందించింది. దీనితో పరిస్థితి మళ్లీ మొదటికి వస్తుందేమోనన్న ఆందోళన వ్యక్తమవుతోంది. హోర్ముజ్ జలసంధిలో తమ మార్గదర్శకాలకు విరుద్ధంగా ప్రయాణిస్తోందంటూ ఎవర్ లఫ్లీ అనే వాణిజ్య నౌకపై ఇరాన్ డ్రోన్ దాడి చేయడంతో ఉద్రిక్తత మొదలైంది. అవగాహన ఒప్పందాన్ని ఇరాన్ ఉల్లంఘిస్తోందంటూ.. శనివారం హోర్ముజ్ జలసంధికి సమీపంలో ఇరాన్‌లోని లక్ష్యాలపై అమెరికా యుద్ధ విమానాలతో దాడులు చేసింది. దీనితో గల్ఫ్‌లోని అమెరికా స్థావరాలపైకి ఇరాన్ డ్రోన్లు క్షిపణులను ప్రయోగించింది. అమెరికా దాడులపై ఇరాన్ దీటుగా స్పందించింది. కువైట్, బహ్రెయిన్‌లలోని అమెరికా స్థావరాలపై డ్రోన్లు, క్షిపణులతో విరుచుకుపడింది. కువైట్‌లోని అలీ అల్ సలేం వైమానిక స్థావరం, బహ్రెయిన్ పోర్ట్ సల్మాన్ వద్ద ఉన్న అమెరికా ఐదో నావికాదళ స్థావరం సహా ఎనిమిది కీలక సైనిక కేంద్రాలను ధ్వంసం చేశామని ఇరాన్ రెవెల్యూషనరీ గార్డ్స్ (ఐఆర్‌జీసీ) పేర్కొంది. అమెరికా చేసే ఎలాంటి దాడులకైనా మా స్పందన అత్యంత విధ్వంసకరంగా ఉంటుందని హెచ్చరించింది. కాగా, తమ దేశంవైపు వస్తున్న క్షిపణులు, డ్రోన్లను గగనతల రక్షణ వ్యవస్థలతో విజయవంతంగా అడ్డుకుంటున్నామని కువైట్ ప్రకటించింది. అయితే హోర్ముజ్ జలసంధిలో పనామా జెండాతో ప్రయాణిస్తున్న భారీ చమురు ట్యాంకర్ నౌక 'కికు'పై శనివారం రాత్రి దాడి జరిగింది. ఇది ఇరాన్ పనేనంటూ అమెరికా సెంట్రల్ కమాండ్ ఆదివారం తెల్లవారుజామున పర్షియన్ గల్ఫ్‌లోని ఇరాన్ దీవి 'ఖెష్మ్'పై, హోర్ముజ్ జలసంధి సమీపతీరంలోని సిరిక్, బందర్ ఈ లెంగే నగరాల్లో 10 ప్రాంతాలపై భారీస్థాయిలో దాడులు చేసింది. ఇరాన్ నిఘా, కమ్యూనికేషన్ వ్యవస్థలు, గగనతల రక్షణ వ్యవస్థలు, డ్రోన్లు, సముద్ర మందుపాతరల నిల్వ కేంద్రాలను ధ్వంసం చేసినట్టు ప్రకటించింది. ఈ దాడులకు సంబంధించి 38 సెకన్ల వీడియోను విడుదల చేసింది. పరస్పర దాడు లు కొనసాగుతున్నా హోర్ముజ్ జలసంధి మీదుగా నౌకల రాకపోకలు కొనసాగుతున్నాయని.. అమెరికా నౌకాదళం పూర్తి అప్రమత్తత ఉందని పేర్కొంది. అమెరికా, ఇరాన్ చర్చలకు మధ్యవర్తిగా ఉన్న పాకిస్థాన్.. తాజా ఉద్రిక్తతలను తగ్గించేందుకు ప్ర యత్నాలు మొదలుపెట్టింది. దీనిపై పాక్ విదేశాంగ మంత్రి ఇషాక్ దార్ ఇరుదేశాల ప్రతినిధులను సంప్రదించారు. కాల్పుల విరమణ, అవగాహన ఒప్పందానికి కట్టుబడి ఉండాలని కరారు. ఇక యూరోపియన్ యూనియన్ విదేశాంగ విధానం చీఫ్ కాజా కల్లాస్, బహ్రెయిన్ విదేశాంగ మంత్రి రషీద్ కూడా ఇషాక్‌దార్‌తో మాట్లాడారు. కాగా కువైట్, బహ్రెయిన్‌లపై ఇరాన్ దాడులను గల్ఫ్ దేశాల కూటమి 'గల్ఫ్ కోఆపరేషన్ కౌన్సిల్ (జీసీసీ)' ఖండించింది. వెంటనే దాడులు ఆపాలని విజ్ఞప్తి చేసింది. అమెరికా చేసే ప్రతీ దాడికీ తమ ప్రతిదాడి ఉంటుందని ఐఆర్‌జీసీ హెచ్చరించింది. కాల్పుల విరమణను అమెరికాయే ఉల్లంఘిస్తోందని, ఇది ఇలాగే కొనసాగితే శాంతి ఒప్పందం కోసం జరుగుతున్న దౌత్య ప్రయత్నాలన్నీ నిలిచిపోతాయని స్పష్టం చేసింది. ఈ మేరకు ఐఆర్‌జీసీ నావికాదళ కమాండర్ ప్రకటన చేశారు. గల్ఫ్‌లోని అమెరికా స్థావరాలపై ఇరాన్ దాడులను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీవ్రంగా తప్పుబట్టారు. అవగాహన ఒప్పందాన్ని ఇరాన్ ఉల్లంఘిస్తోందని మండిపడ్డారు. ఇరాన్ మళ్లీ కాల్పు ల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించడంతో మా సైన్యం దాడులు చేయాల్సి వచ్చింది. ఇరాన్ ఎప్పటికీ పాఠం నేర్చుకునేలా కనిపించడంలేదు. మా సహనానికి హద్దు అంటూ ఉంటుంది. అది దాటితే మేం సైన్యంతోనే పని పూర్తి చేయాల్సి వస్తుంది. అదే జరిగితే ఇక ఇరాన్ అనే దేశమే ఉండదని ట్రూత్ సోషల్‌లో పేర్కొన్నారు.విదేశాల నుంచి భారత్‌కు సరుకు రవాణా చేస్తున్న ఏడు కార్గో నౌకలు గత మూడు రోజుల్లో హోర్ముజ్ జలసంధిని దాటాయి. వీటిలో 65 వేల టన్నుల రసాయన ఎరువులు తీసుకొస్తున్న రెండు నౌకలు శనివారం ఈ మార్గం గుండా వచ్చాయి. అంతకుముందు రోజు లక్ష టన్నులకు పైగా ముడి చమురుతో 'దేశ్ సురక్ష' ట్యాంకర్, 18,732 టన్నుల సరుకుతో 'ప్రభు పార్వతి' నౌక ఇదే మార్గం గుండా భారత్‌కు వచ్చాయి. ఇవిగాక మరో రెండు విదేశీ నౌకలు ఇదే మార్గంలో ప్రయాణించాయి. హోర్ముజ్ ద్వారా భారత్‌కు రావాల్సిన మరో 15కు పైగా నౌకలు తాజా ఉద్రిక్తతల నేపథ్యంలో పర్షియన్ గల్ఫ్‌లో వేచి ఉన్నాయి. వీటిలో భారతీయ జెండా గల 10 నౌకలు ఉన్నాయి. వాటిలో నాలుగు ఎరువులను, మరొకటి ఇంధనాన్ని తీసుకురానున్నాయి. ఇప్పుడు ఉద్రిక్తతల కారణంగా పరిస్థితి ఎలా ఉంటుందో అన్న ఆందోళన కలుగుతోంది.

# జీవితం అంటే వందమీటర్ల పరుగుపందెం కాదు



మొదటిపేజీ తరువాయి..

రాజకీయాల్లోకి వచ్చాను. రాజకీయాల్లోకి వచ్చాక నా భవిష్యత్తుపై గందరగోళంలో పడ్డాను. ఏ పని చేసినా నాదైన ముద్ర ఉండాలని గట్టిగా అనుకున్నాను. అప్పగించిన పనిని నిబద్ధతతో పూర్తి చేయడమే నా బలం. వేగంగా లక్ష్యాలు చేరాలనే ఆరాటంలో నేటి యువత ఉంది. ఏ పనినైనా ఓపిక, నిలకడ, శక్తితో చేసినప్పుడే ఫలితాలు వస్తాయని అన్నారు. ఇదిలావుంటే రంగారెడ్డి జిల్లా రూరల్ భారతీయ జనతా పార్టీ నూతన కార్యాలయాన్ని నితిన్ నబీన్ ఘనంగా ప్రారంభించారు. ఇదే సందర్భంలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు వర్చువల్ విధానం ద్వారా మరో 9 జిల్లాల పార్టీ కార్యాలయాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమం అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో నితిన్ నబీన్ మాట్లాడుతూ.. నాటి నిజాం నిరంకుశ పాలన నుండి తెలంగాణకు విముక్తి కల్పించిన ఉక్కుమనిషి సర్దార్ వల్లభభాయ్ పటేల్‌కు, అలాగే ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో ప్రాణాలు అర్పించిన అమరవీరులకు ఘన నివాళులు అర్పించారు. పార్లమెంట్‌లో నాడే తెలంగాణ వాణిని బలంగా వినిపించిన దివంగత నేత సుష్మా స్వరాజ్ సేవలను కూడా ఆయన ఈ సందర్భంగా స్మరించుకున్నారు. గతంలో దేశవ్యాప్తంగా బీజేపీ కేవలం రెండు లోక్‌సభ స్థానాలు గెలిచినప్పుడు.. అందులో ఒకటి తెలంగాణ నుంచేనని నితిన్ నబీన్ గుర్తుచేశారు. ఈ స్థాయికి చేరడానికి ఎంతో మంది పార్టీ కార్యకర్తలు తమ ప్రాణాలను త్యాగం చేశారని కొనియాడారు. తెలంగాణకు లీడర్లు ఎంతో దూరం లేరని, రాబోయే రోజుల్లో రాష్ట్రంలోని ప్రతి మూలలోనూ కమలం వికసించి, భగవాధ్వజం ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలపై బీజేపీ కార్యకర్తలు రోడ్లపైకి వచ్చి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తారని, ప్రజావ్యతిరేక పద్ధతులను అవలంబిస్తున్న ఈ ప్రభుత్వాన్ని గద్దె దించుతారని హెచ్చరించారు. పశ్చిమ బెంగాల్‌లో ఎన్నో ఆటంకాలు ఎదురైనా తీవ్రంగా సంఘర్షణ చేసి ఎలాగైతే విజయం సాధించామో, తెలంగాణలోనూ అదే పునరావృతం అవుతుందన్నారు. బెంగాల్‌లో పార్టీని గెలిపించిన సునీల్ బన్సల్ ఇక్కడే ఉన్నారని, తెలంగాణలో కూడా అంతకన్నా ఎక్కువ కష్టపడి పార్టీని గెలిపించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని కోరారు. ప్రధాని నరేంద్ర మోదీ ఆకాంక్షిస్తున్న 'వికసిత భారత్' లక్ష్యం సంపూర్ణంగా నెరవేరాలి అంటే తెలంగాణలోనూ బీజేపీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని నితిన్ నబీన్ స్పష్టం చేశారు. కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ ఒకే పార్టీ అధికారంలో ఉండే 'డబుల్ ఇంజన్ సర్కార్' వస్తేనే తెలంగాణ అన్ని రంగాల్లో అద్భుతంగా అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల అసలైన కలలు సాకారం కావాలన్నా, ఒక వికసిత తెలంగాణ నిర్మాణం జరగాలన్నా ప్రజలంతా బీజేపీతో కలిసి రావాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో జరగబోయే రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ ఘనవిజయం సాధించబోతోందని ఆయన జోస్యం చెప్పారు. కాగా, సాయంత్రం వేళ నితిన్ నబీన్ పార్టీకి చెందిన బీఎల్‌ఓలు, బూత్ కమిటీ అధ్యక్షులు , ముఖ్య కార్యకర్తలతో సమావేశమై రాబోయే ఎన్నికల వ్యూహాలపై దిశానిర్దేశర చేశారు.

## పశ్చిమాసియా ఉద్రిక్తలపై తాత్కాలిక చర్యలు

మొదటిపేజీ తరువాయి..

దేశాల ప్రతినిధులు ఖతార్‌లోని దోహాలో సమావేశం కానున్నారు. ఈ చర్చల్లో హోర్ముజ్ జలసంధిలో నౌకాయాన భద్రత, వాణిజ్య రవాణా పునరుద్ధరణ, ప్రాంతీయ స్థిరత్వం వంటి అంశాలు ప్రధానంగా చర్చకు వచ్చే అవకాశం ఉంది. హోర్ముజ్‌లో వాణిజ్య నౌకల సురక్షిత ప్రయాణానికి హామీ ఇవ్వడానికి ఇరాన్ సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. మరోవైపు, ఇరాన్ నౌకాశ్రయాలపై అమలులో ఉన్న కొన్ని పరిమితులను సడలించే అంశాన్ని అమెరికా పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఇది పూర్తిస్థాయి శాంతి ఒప్పందం కాదని విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు . ఇరాన్ అణు కార్యక్రమం, ఆర్థిక ఆంక్షలు, హోర్ముజ్ జలసంధిపై భద్రతా అంశాలు వంటి కీలక సమస్యలపై ఇంకా తుది అంగీకారం కుదరాల్సి ఉంది . ఇటీవలి ఉద్రిక్తతల నేపథ్యంలో ఇరు దేశాలు పరస్పర దాడులు చేసుకున్నాయి. 24 గంటల వ్యవధిలోనే, అమెరికా రెండుసార్లు ఇరాన్ సైనిక స్థావరాలు, డ్రోన్ బేస్‌లను లక్ష్యంగా చేసుకుని దాడులు చేసింది. గల్ఫ్ దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలపై ఇరాన్ దాడులు చేసింది. మళ్లీ యుద్ధం మొదలయ్యే అవకాశాలున్నాయనే ఆందోళనలు వ్యక్తమైన నేపథ్యంలో ఇరు దేశాలు కీలక నిర్ణయం తీసుకున్నాయి.

## జీడబ్ల్యూఎంసీపై కమలం జెండా లక్ష్యం

మొదటిపేజీ తరువాయి..

మామునూర్ విమానాశ్రయం, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి వంటి అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ వరంగల్ మేయర్ పీఠాన్ని బీజేపీకి అందించాలని కోరారు. మామునూర్ విమానాశ్రయం త్వరలో ప్రారంభమవుతుందని, కాజీపేట రైల్వే



అభివృద్ధితో పారిశ్రామిక అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణను అప్పుల ఊబిలోకి నెట్టిందని ఆరోపించారు. జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ మాట్లాడుతూ 2028 అసెంబ్లీ ఎన్నికలకు జీడబ్ల్యూఎంసీ ఎన్నికలు సెమీఫైనల్స్‌లాంటివని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలులో విఫలమైందని, కేంద్ర సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ చేర్చాలని పార్టీ శ్రేణులకు సూచించారు. గిరిజనుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అధిక నిధులు కేటాయించిందని చెప్పారు. అనంతరం భద్రకాళి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు మాట్లాడుతూ వరంగల్‌కు కేంద్రం వేల కోట్ల రూపాయల నిధులు అందించిందని, జీడబ్ల్యూఎంసీలో బీజేపీ అధికారంలోకి వస్తే నగరాన్ని మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు. బూత్ స్థాయి నుంచే పార్టీని బలోపేతం చేసి గ్రేటర్ వరంగల్‌లో కమలం జెండా ఎగరేయాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

## తెలంగాణ-కొరియా మధ్య పర్యాటక, సాంస్కృతిక సహకారం

**అక్టోబర్ 25న హైదరాబాద్‌లో తెలంగాణ-కొరియా సాంస్కృతిక మహోత్సవం**

**ఇరు సంస్కృతుల వైభవాన్ని ప్రతిబింబించే ప్రత్యేక వేదికగా హైదరాబాద్**

**భారత్‌లో కే-డ్రామాల ఆదరణతో సాంస్కృతిక అనుబంధం మరింత బలోపేతం**

**కళా-సాంస్కృతిక భాగస్వామ్యానికి ప్రాధాన్యం: మంత్రి జూపల్లి**

హైదరాబాద్,జూన్ 29: ఈ ఏడాది అక్టోబర్ 25న హైదరాబాద్‌లో తెలంగాణ-కొరియా సాంస్కృతిక మహోత్సవం నిర్వహించాలని తెలంగాణ - కొరియన్ కల్చరల్ సెంటర్ లు సంయుక్తంగా సూత్రప్రాయ అంగీకారానికి వచ్చాయి. తెలంగాణ-కొరియా మధ్య పర్యాటక, సాంస్కృతిక రంగాల్లో సహకారాన్ని మరింత విస్తరించేందుకు ఇరు పక్షాలు చర్చించాయి. భారత్‌లోని కొరియన్ కల్చరల్ సెంటర్ డైరెక్టర్, భారతదేశంలోని కొరియా రాయబార కార్యాలయం కల్చర్ అండ్ ప్రెస్ కౌన్సిలర్ హ్వాంగ్ ఇల్యాంగ్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం సోమవారం పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును డా.బీఆర్. అంబేద్కర్ సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ తెలంగాణ గొప్ప చారిత్రక వారసత్వం, వైవిధ్యభరితమైన సంస్కృతి, సంప్రదాయ కళారూపాలు, ప్రపంచ స్థాయి పర్యాటక కేంద్రాలతో ప్రత్యేక గుర్తింపు పొందిందన్నారు. ప్రతిపాదిత తెలంగాణ-కొరియా సాంస్కృతిక మహోత్సవం ద్వారా ఇరు ప్రాంతాల కళలు, సంగీతం, నృత్యం, వంటకాలు, సంప్రదాయాలను ఒకే వేదికపై



ఆవిష్కరించే అవకాశం లభిస్తుందని, పర్యాటకాభివృద్ధితో పాటు ప్రజల మధ్య సత్సంబంధాలు మరింత పెరుగుతాయని తెలిపారు. భారత్‌లో, ముఖ్యంగా యువతలో కొరియన్ కే-డ్రామాలు, కొరియన్ వినోద కార్యక్రమాలకు ఓటీటీ వేదికల ద్వారా విశేష ఆదరణ లభిస్తోందని మంత్రి పేర్కొన్నారు. ఈ సాంస్కృతిక అనుబంధం తెలంగాణ-కొరియా మధ్య పర్యాటక రంగాన్ని మరింత ప్రోత్సహించడంతో పాటు కళలు, సాంస్కృతిక మార్పిడి కార్యక్రమాలు, సృజనాత్మక భాగస్వామ్యాలకు కొత్త అవకాశాలను కల్పిస్తుందని అన్నారు. పర్యాటకం, సంస్కృతి, వారసత్వ పరిరక్షణ, సృజనాత్మక పరిశ్రమల రంగాల్లో కొరియాతో భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు. సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ, వారసత్వ పరిరక్షణ, పర్యాటక ప్రోత్సాహం తదితర అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. సమావేశంలో కిమ్ కాంగ్‌హున్ (హెడ్ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్, ఐఅఅఎ), ఇమ్ హ్విజే (హెడ్ ఆఫ్ పబ్లిక్ రిలేషన్స్, ఐఅఅఎ), తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు కొరియా కాన్సుల్ జనరల్ సురేష్ చుక్కపల్లి పాల్గొన్నారు.

## 'ఉద్యోగుల ఆరోగ్య పథకం'నిధిపై ఉత్తర్వులు

మొదటిపేజీ తరువాయి..

జీవో 79 ప్రకారం ఇకపై ప్రతి ఉద్యోగి మూల వేతనం లేదా పెన్షనర్ల మూల పింఛను నుండి ప్రతి నెలా 1.5 శాతం మొత్తాన్ని ఈ ఈహెచ్‌ఎస్ హెల్త్ ఫండ్‌కు విరాళంగా కట్ చేయనున్నారు. మే 2026 నెలకు సంబంధించిన జీతాలు, పెన్షన్ల నుంచే ఈ కోత ప్రక్రియ ప్రారంభం కానుంది. ఈ నిధుల కోత విధానంలో ఉద్యోగులపై అదనపు భారం పడకుండా, ఎక్కడా డబుల్ కటింగ్ జరగకుండా ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలను ఇచ్చింది. భార్యాభర్తలు ఇద్దరూ కూడా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులుగా పనిచేస్తున్నప్పుడు, లేదా వారిలో ఒకరు ప్రభుత్వ ఉద్యోగిగా ఉండి మరొకరు ప్రభుత్వ పెన్షనర్‌గా ఉన్నప్పుడు కేవలం ఒక్కరి జీతం నుండి మాత్రమే ఈ మొత్తాన్ని మినహాయిస్తారు. అలాగే ఒకే వ్యక్తి ప్రభుత్వ సర్వీస్ పెన్షన్ , ఫ్యామిలీ పెన్షన్.. ఇలా రెండు పింఛన్లు పొందుతున్నప్పుడు కూడా ఒకే ఒక కోతకు నిబంధనలను పరిమితం చేశారు. ఇలాంటి సందర్భాలలో డ్రాయింగ్ అండ్ డిస్బర్సింగ్ అధికారులు ఉద్యోగుల వివరాలను ఐఎఫ్‌ఎంఐఎస్-హెచ్‌ఆర్‌ఎమ్‌ఎస్ సాఫ్ట్‌వేర్ సిస్టమ్‌లో పక్కాగా నమోదు చేసి, పొరపాటున కూడా రెండోసారి కటింగ్ అవ్వకుండా చూసుకోవాలని ఆదేశించారు. ఒకవేళ ఇప్పటికే ఎవరికైనా ఇలా అదనంగా డబ్బులు కట్ అయి ఉంటే, ఆ మొత్తాన్ని తిరిగి రీఫండ్ చేస్తామని ప్రభుత్వం భరోసా ఇచ్చింది. ఉద్యోగుల ఆరోగ్య పథకాన్ని మరింత సమర్థవంతంగా నడిపించేందుకు గానూ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి చైర్‌పర్సన్‌గా ఒక ప్రత్యేక బోర్డ్ ఆఫ్ ట్రస్టీలతో కూడిన 'న్యూ ఎంప్లాయ్ హెల్త్ కేర్ ట్రస్ట్' ని ప్రభుత్వం పునర్వ్యవస్థీకరించింది. ఈ బోర్డులో ప్రభుత్వ ఉన్నతాధికారులతో పాటు ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సంఘాల ప్రతినిధులు కూడా సభ్యులుగా ఉంటారు. ఉద్యోగులు, పెన్షనర్లు ఇచ్చే 1.5 శాతం వాటా నిధికి సమానంగా రాష్ట్ర ప్రభుత్వం కూడా తన వంతు మ్యాచింగ్ గ్రాంట్‌ను ఈ హెల్త్ కేర్ ట్రస్ట్‌కు జమ చేయనుంది. సేకరించిన నిధులన్నింటినీ ప్రత్యేక అకౌంట్ హెడ్ ద్వారా మెడికల్ అవసరాల నిమిత్తం భద్రపరుస్తారు.

## తెలంగాణలో పలువురు ఐపీఎస్‌ల బదిలీ

మొదటిపేజీ తరువాయి..

కమిషనర్‌గా ఉన్న సున్‌ప్రీత్ సింగ్‌ను సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్‌గా బదిలీ చేస్తూ, డీఐజీ జోన్-3 (రాజన్న) అదనపు బాధ్యతలు ఇచ్చారు. హైదరాబాద్ నార్త్ రేంజ్ (లా అండ్ ఆర్డర్) జాయింట్ కమిషనర్‌గా ఉన్న ఎన్. శ్వేతను వరంగల్ పోలీస్ కమిషనర్‌గా నియమిస్తూ, డీఐజీ జోన్-4 (భద్రాద్రి) బాధ్యతలు కూడా అప్పగించారు. ఇంటెలిజెన్స్ సీఐ సెల్ డీఐజీగా కొనసాగుతున్న ఆర్. భాస్కరన్‌కు జోన్-2 (బాసర) డీఐజీ అదనపు బాధ్యతలు కేటాయించారు. స్పెషల్ బ్రాంచ్ జాయింట్ కమిషనర్ ఎస్.ఎం. విజయ్ కుమార్‌కు హైదరాబాద్ నార్త్ రేంజ్ జాయింట్ కమిషనర్ (లా అండ్ ఆర్డర్) అదనపు బాధ్యతలు అప్పగించారు. ఏసీబీ జాయింట్ డైరెక్టర్‌గా ఉన్న చి. సింధు శర్మను ఇంటెలిజెన్స్ సీఐ సెల్ ఎస్పీగా బదిలీ చేసి, ఎస్ఐబీ ఎస్పీ బాధ్యతలు కూడా అప్పగించారు. ఎస్ఐబీ ఎస్పీగా ఉన్న వై. సాయి శేఖర్‌ను సికింద్రాబాద్ రైల్వే పోలీస్ ఎస్పీగా బదిలీ చేశారు. హైదరాబాద్ డీసీపీ (ఎస్ఎం అండ్ ఐటీ)గా ఉన్న చెన్నూరి రూపేష్, ఏసీబీ జాయింట్ డైరెక్టర్ చి. ప్రవీణ్ కుమార్లను సీఐడీ ఎస్పీలుగా నియమించారు. పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న ఆర్. వెంకటేశ్వర్లును హైదరాబాద్ సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్ డీసీపీగా నియమించారు. వనపర్తి అదనపు ఎస్పీ (అడ్మిన్)గా ఉన్న రాజేష్ మీనాను వికారాబాద్ అదనపు ఎస్పీ (అడ్మిన్)గా బదిలీ చేశారు. వికారాబాద్ అదనపు ఎస్పీ (అడ్మిన్)గా ఉన్న బి. రాములు నాయక్‌ను ఆ బాధ్యతల నుంచి రిలీవ్ చేసి, డీజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

రాష్ట్రంలో పలువురు ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ అధికారులను బదిలీ చేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు ఉత్తర్వులను జారీ చేశారు. బదిలీ అయిన అధికారులు అందరూ తక్షణమే తమ పాత విధులను వదిలి, కొత్తగా కేటాయించిన స్థానాల్లో బాధ్యతలు స్వీకరించాలని ఆ ఆదేశాల్లో స్పష్టం చేశారు. ప్రస్తుతం పోస్టింగ్ కోసం నిరీక్షిస్తున్న వి.ఎస్.ఎన్.వి. ప్రసాద్ అరణ్య భవన్‌లో కీలక బాధ్యతలు అప్పగించింది . హైదరాబాద్‌లోని ప్రిన్సిపల్ చీఫ్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ కార్యాలయంలో ఆయనను కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ గా నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. రాష్ట్రంలోని పలు జిల్లాలకు కొత్త అటవీ అధికారులను కేటాయిస్తూ ప్రభుత్వం బదిలీల జాబితాను విడుదల చేసింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అటవీ అధికారిగా ఉన్న జి. కిష్ట గౌడ్, జయశంకర్ భూపాలపల్లి జిల్లా అటవీ అధికారిగా బదిలీ కాగా, ఆయన స్థానంలో నిజామాబాద్ జిల్లా అటవీ అధికారి సిద్దార్థ్ విక్రమ్ సింగ్, ఎఈ÷ూ ను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అటవీ అధికారిగా నియమించారు. అలాగే మహబూబ్‌నగర్ జిల్లా అటవీ అధికారి శివ్ ఆశిష్ సింగ్, ఎఈ÷ూ ను రంగారెడ్డి జిల్లా అటవీ అధికారిగా బదిలీ చేయగా, జయశంకర్ భూపాలపల్లి జిల్లా అటవీ అధికారిగా ఉన్న ఎం. నవీన్ రెడ్డి, ఎఈ÷ూను మహబూబ్‌నగర్ జిల్లా అటవీ అధికారిగా నియమించారు. మరోవైపు ఆదిలాబాద్ జిల్లా అటవీ అధికారి ప్రశాంత్ బాజీరావు పాటిల్, ఎఈ÷ూ ను నిజామాబాద్ జిల్లా అటవీ అధికారిగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

## రైతు ఆశీర్వాద సభ వాయిదా

మొదటిపేజీ తరువాయి..

ఈ కారణం వల్ల రైతులకి ప్రజలకి కాంగ్రెస్ కార్యకర్తలకి ఎవరికి ఎలాంటి ఇబ్బందులు రాకూడదన్న ఉద్దేశంతోనే సభ నిర్వహణలో మార్పులు చేసినట్లు ఆయన చెప్పుకుచ్చారు. ఖమ్మం జిల్లా చింతకాని మండలం జగన్నాథపురం గ్రామంలో తలపెట్టిన రైతు ఆశీర్వాద సభ ప్రాంతాన్ని సోమవారం మధ్యాహ్నం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తో కలిసి పరిశీలన చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. లక్షలాది మంది రైతుల సమక్షంలో ముఖ్యమంత్రి, కేబినెట్ మంత్రులందరి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించాలని భావించినట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం వాతావరణ పరిస్థితుల్లో ఇక్కడ సభ నిర్వహించడం అందరికీ ఇబ్బందికరంగా ఉంటుందని అన్నారు. తొలిరోజు ప్రారంభ సభగా అనుకున్న ఈ కార్యక్రమాన్ని, ఇప్పుడు రైతు భరోసా పంపిణీ పూర్తి అయిన తర్వాత మరింత ఉత్సాహంగా 'రైతు ఆశీర్వాద సభ' పేరుతో ముగింపు వేడుకగా నిర్వహిస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. వర్షాలు తగ్గిన తరువాత వాతావరణ శాఖ నివేదికలను అనుసరించి ముఖ్యమంత్రి, కేబినెట్ ఈ నిర్ణయం తీసుకుంటుందని ఆయన చెప్పారు. సభ నిర్వహణ తేదీలపై ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ... జిల్లా అధికార యంత్రాంగం ఇప్పటికే వాతావరణ శాఖ నుంచి వారం రోజుల ముందస్తు అంచనాలను తీసుకుంటుందని ఆయన అన్నారు. జులై నెల 3, 4 తేదీల వరకు వర్షాలు ఉన్నట్లు నివేదికలు చెబుతున్నాయన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూసేందుకు మరో వారం రోజుల వాతావరణ సమాచారాన్ని సేకరించాలని ఆదేశించాం. వాతావరణ పరిస్థితిని బట్టి ఈ సభను వచ్చే 6, 7 లేదా 8వ తేదీల్లో నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. ఈ భారీ బహిరంగ సభను విజయవంతం చేసేందుకు స్థానిక మంత్రులు, ప్రజాప్రతినిధులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారని డిప్యూటీ సీఎం తెలిపారు. వ్యవసాయ శాఖ మంత్రి, రెవెన్యూ శాఖ మంత్రి, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ రాగమయిలతో పాటు జిల్లాలోని శాసనసభ్యులంతా సమన్వయంతో ముందుకు సాగుతున్నారని పేర్కొన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ఉన్న మిగతా ఎమ్మెల్యేలు, ప్రజలు, రైతాంగ సోదరులు ఈ సభకు తరలిరావడానికి భారీ ఉత్సాహాన్ని చూపిస్తున్నారని, ప్రజలు ఊహించని రీతిలో ఈ సభ అత్యంత విజయవంతం కాబోతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

ఖమ్మం జిల్లా మధిరలో మంగళవారం జరగాల్సిన రైతు ఆశీర్వాద సభ రద్దయ్యింది. వర్షాల కారణంగా సభ నిర్వహించే పరిస్థితి లేకపోవడంతో మధిరలో జరగాల్సిన సీఎం రేవంత్ రెడ్డి సభలో మార్పులు చేశారు. ఈ కార్యక్రమాన్ని మంగళవారం సాయంత్రం హైదరాబాద్ శిల్పకళా వేదికకు మార్చారు. సాయంత్రం ఈ వేదికలో రైతుభరోసా పంపిణీ సదస్సు నిర్వహించనున్నారు. ఇక్కడి నుంచే ముఖ్యమంత్రి.. రైతుభరోసా నిధులను విడుదల చేయనున్నారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లు చేయాలని మంత్రులు, అధికారులను సీఎం ఆదేశించారు. మధిర నియోజకవర్గం చింతకాని మండలం జగన్నాథపురంలో మంగళవారం రైతు ఆశీర్వాద సభ జరగాల్సి ఉంది. ఈ సభకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరై.. రైతుభరోసా నిధులను విడుదల చేయాలని నిర్ణయించారు. దీనికి సంబంధించి పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సభా ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించారు. దాదాపు లక్ష మందితో సభ నిర్వహించాలని లక్ష్యంగా పెట్టుకుని... అందుకు తగ్గట్టుగా జగన్నాథపురంలో ఏర్పాట్లు చేశారు. అయితే, రెండు రోజులుగా కురుస్తున్న భారీగా వర్షాలకు సభా ప్రాంగణంలో పెద్దఎత్తున వరద నీరు చేరుకుంది. దీంతో సభ నిర్వహించేందుకు అవకాశం లేదని మంత్రులు, సీఎంవో కార్యాలయానికి జిల్లా అధికారులు తెలియజేశారు. దీంతో ప్రభుత్వం మధిరలో సభను రద్దు చేసి.. సభా వేదికను హైదరాబాద్‌కు మార్చింది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి రైతులు తమ తమ రైతు వేదికల నుంచి ఈ సమావేశంలో పాల్గొననున్నారు.



## అయోధ్య రామాలయ నిధుల దుర్వినియోగం

మొదటిపేజీ తరువాయి..

నిరాకరించింది. అయోధ్య రామమందిర విరాళాల నిధుల దుర్వినియోగం జరిగిందంటూ దాఖలైన పిటిషన్‌పై తక్షణ విచారణ చేపట్టేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ఈ వ్యవహారంపై సీబీఐతో స్వతంత్ర దర్యాప్తు జరిపించాలని కోరుతూ పిటిషనర్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అయితే ఈ కేసులో వెంటనే విచారణ చేపట్టాల్సిన అత్యవసర పరిస్థితులు లేవని జస్టిస్ ఎం.ఎం. సుందరేశ్, జస్టిస్ షీల్ నాగు ధర్మాసనం స్పష్టం చేసింది. అయితే, పిటిషనర్ తరఫు న్యాయవాది వాదిస్తూ, రామమందిర విరాళాల నిధుల వినియోగంలో అవకతవకలు జరిగాయని, ఈ వ్యవహారంపై సీబీఐతో స్వతంత్ర విచారణ జరిపించాలని కోర్టును కోరారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు అనుమానాలకు తావిస్తోందని, అందుకే స్వతంత్ర దర్యాప్తు అవసరమని ఆయన వాదించారు. ఇక, కేసు ఆలస్యమైతే ఎలక్ట్రానిక్ ఆధారాలు చెరిపివేసే అవకాశం ఉందని పిటిషనర్ తరఫు న్యాయవాది ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన కోర్టు, మెన్షన్ స్లిప్ సర్క్యులేట్ చేయాలని సూచించింది. అయితే ఈ కేసులో వెంటనే విచారణ చేపట్టాల్సిన అత్యవసర పరిస్థితులు లేవని జస్టిస్ ఎం.ఎం. సుందరేశ్, జస్టిస్ షీల్ నాగు ధర్మాసనం స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు తిరిగి ప్రారంభమైన వెంటనే ఈ కేసును లిస్ట్ చేసి విచారణ చేపడతామని జస్టిస్ ఎం.ఎం. సుందరేశ్ నేతృత్వంలోని ధర్మాసనం తెలిపింది. ప్రస్తుతం ఈ అంశంపై అత్యవసర విచారణ అవసరం లేదని స్పష్టం చేసింది. ఈలోపే మిన్ను విరిగి మీద పడదు.. అంత తొందరెందుక'ని పిటిషనర్‌ను ప్రశ్నించింది. మరోవైపు, ఈ కేసులో నిందితుల పక్షాన ఎవరూ వాదించొద్దని ÷జాబాద్ బార్ అసోసియేషన్ నిర్ణయించింది. 'ఈ కేసులో నిందితుల తరఫున ఎవరూ వాదించరు. ఒకవేళ ఎవరైనా అలా చేస్తే.. క్రమశిక్షణా చర్యలు ఎదుర్కోవలసి వస్తుంది. వారికి రూ.5లక్షలు జరిమానా విధిస్తాం' అని అసోసియేషన్ అధ్యక్షుడు కలికా ప్రసాద్ మిశ్రా మీడియాకు వెల్లడించారు. 2005లో కూడా అక్కడి న్యాయవాదులు ఇలాంటి నిర్ణయమే తీసుకున్నారు.

## ఎమ్మెల్యే అనిల్ జాదవ్ చొరవ

### – దర్బాతాండలో తీరిన నీటి కష్టాలు



**నేరడిగొండ, జూన్ 29 (ప్రజా జ్యోతి):** మండలంలోని దర్బాతాండ గ్రామంలో సుదీర్ఘకాలంగా వేధిస్తున్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. గ్రామంలో నీటి ఎద్దడి తీవ్రంగా ఉందనే విషయాన్ని స్థానిక గ్రామస్తులు ఎమ్మెల్యే అనిల్ జాదవ్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే, అధికారులతో మాట్లాడి యుద్ధప్రాతిపదికన గ్రామంలో కొత్త బోరు బావిని వేయించారు. దీంతో తమ నీటి కష్టాలు తీరడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.తమ సమస్యను వెంటనే పరిష్కరించినందుకు గాను, గ్రామస్తులంతా కలిసి ఎమ్మెల్యే అనిల్ జాదవ్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. తమకు అడగగానే నీటి వసతి కల్పించిన ఎమ్మెల్యేకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటామని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కవ్వాల్ టైగర్ జోన్‌లో జంగిల్ సఫారీకి బ్రేక్

### – జూలై 1 నుండి సెప్టెంబర్ 30 వరకు సేవలు నిలిపివేత



**జన్నారం,జూన్ 29 (ప్రజాజ్యోతి) :** వర్షాకాలం సందర్భంగా కవ్వాల్ టైగర్ జోన్‌లో మూడు నెలల పాటు అనగా 1.07.2026 నుండి 30.09. 2026 వరకు జంగిల్ సఫారీ సేవలను పూర్తిగా నిలిపివేస్తున్నట్లు ఎఫ్డిఓ రామ్మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడా వర్షాకాలంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. భారత ప్రభుత్వ పర్యావరణ, అటవీ మరియు వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ మరియు నేషనల్ టైగర్ కన్జర్వేషన్ అథారిటీ మార్గదర్శకాల మేరకు దేశంలోని అన్ని టైగర్ రిజర్వ్‌లను వర్షాకాలంలో తాత్కాలికంగా మూసివేయాలని ఆదేశాలు జారీ చేశారు.వర్షాకాలంలో అడవి జంతువుల సంతానోత్పత్తి, సహజ ఆవాసాల పరిరక్షణ, పర్యావరణ సమతుల్యత మరియు సందర్శకుల భద్రత దృష్ట్యా ఈ చర్య తీసుకున్నట్లు అటవీ శాఖ పేర్కొంది.అందువల్ల పర్యాటకులు, ప్రకృతి ప్రేమికులు మరియు సందర్శకులు 1.07.2026 నుండి 30.09.2026 వరకు కవ్వాల్ టైగర్ రిజర్వ్‌లో జంగిల్ సఫారీ సేవలు అందుబాటులో ఉండవని గమనించి, తమ పర్యటనలను అందుకు అనుగుణంగా ప్రణాళిక చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలందరూ అటవీ శాఖకు సహకరించి వన్యప్రాణుల సంరక్షణకు తోడ్పడాలని ఎఫ్డిఓ రామ్మోహన్ కోరారు.

## భూమికి హద్దులు నిర్ణయించాలంటూ మహిళా రైతు ఆవేదన

### – ఎంసీ ఫీజు కట్టినా సర్వే చేయని సర్వేయర్




**జన్నారం,జూన్ 29 (ప్రజాజ్యోతి) :** జన్నారం మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన దర్శనాల లలిత అనే రైతు మహిళకు చెందిన ఒక ఎకరం నాలుగు గుంటల భూమికి హద్దులు నిర్ణయించాలని పలుమార్లు తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి వేడుకున్నా ఫలితం లేదంటూ సోమవారం తహసీల్దార్ ఆఫీస్ ముందు ఆవేదన వ్యక్తం చేశారు. 81 సర్వే నంబర్‌లో ఒక ఎకరం నాలుగు గుంటల భూమి ఉన్నదని, కానీ మోక మీద ఒక ఎకరం మాత్రమే ఉన్నదని ఆమె తెలిపారు.దీనికి హద్దులు నిర్ణయించాలని 2024, 2025, 2026 సంవత్సరాల్లో ఎంసీ ఫీజు చెల్లించినట్లు ఆమె వెల్లడించారు.కాగా సర్వేయర్ దినేష్ 11 జూన్ 2026న వచ్చి హద్దులు చూపెట్టకుండా మధ్యలోనే వెళ్లిపోయారు. దీంతో ఎమ్మెల్యే బొజ్జు పటేల్‌ను కలిసి తమకు న్యాయం చేయాలని ఆమె వేడుకున్నారు.ఆయన తహసీల్దార్ కార్యాలయానికి ఫోన్ చేసి చెబుతానని,తిరిగి అక్కడికి వెళ్లాలని సూచించారని ఆమె చెప్పారు.అయితే ఎమ్మెల్యే నుండి ఫోన్ రాలేదని తహసీల్దార్ చెబుతూ హద్దులు నిర్ణయించడంలో జాప్యం చేస్తున్నారని ఆమె ఆరోపించారు.ఇప్పటికైనా తన పొలానికి హద్దులు నిర్ణయించి న్యాయం చేయాలని రెవెన్యూ అధికారులను ఆమె వేడుకున్నారు.

## రూ.10 లక్షల ఆదాయం.. అయినా సౌకర్యాల్లేవు: బీజేపీ నేతల ఆగ్రహం



**ఆసిఫాబాద్ జూన్ 29 ప్రజా జ్యోతి :** కొమురంభీం ఆసిఫాబాద్ వాంకిడి, మండల కేంద్రంలో ప్రతి గురువారం నిర్వహించే వరసంత ద్వారా ఏటా సుమారు రూ.10 లక్షల ఆదాయం వస్తున్నప్పటికీ కనీస సౌకర్యాలు కల్పించడం లేదని బీజేపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఈ సమస్యలపై ఎంపీడీఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దుర్గం ప్రశాంత్ మాట్లాడుతూ, వరసంతకు వెళ్లే సీసీ రోడ్డుకు ఇరువైపులా గ్రావెల్ లేకపోవడంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వరసంతలో షెడ్లు, మరుగుదొడ్లు, అంతర్గత రహదారులు, తాగునీరు, పారిశుధ్యం వంటి మౌలిక వసతులు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో గ్రామసభలో, సర్పంచ్, సెక్రటరీ దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదన్నారు. బుధవారం సాయంత్రంలోపు సమస్యలు పరిష్కరించకపోతే వరసంత వ్యాపారులు కాంట్రాక్టర్‌కు రుసుము చెల్లించవద్దని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు నరేష్, ఎస్సీ మోర్చ అధ్యక్షుడు వనేష్, శివ, రాజు, శ్రీరామ్, విశాల్, ప్రణీత్ పాల్గొన్నారు.

# భరత్ చంద్ర హైస్కూల్‌లో అక్రమంగా ఉర్దూ భాష విధింపు.. తక్షణమే చర్యలు తీసుకోవాలి





**ABVP డిమాండ్ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న యాజమాన్యంవిద్యార్థులపై బలవంతంగా భాషను రుద్దడం విద్యా చట్టాల ఉల్లంఘనేజిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించిన ABVP నాయకులు**

**మామడ జూన్ 30 (ప్రజా జ్యోతి) :** ఈ సందర్భంగా ఏబీవీపీ ఇందూర్ విభాగ్ కన్వీనర్ కైరి శశిధర్ మాట్లాడుతు.. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని కోటార్మూర్ ప్రాంతంలో గల "భరత్ చంద్ర హైస్కూల్" యాజమాన్యం మరియు ప్రిన్సిపాల్ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) తీవ్రంగా ఖండిస్తుంది అన్నారు పాఠశాలలో ఇంగ్లీష్ మీడియం చదువుతున్న విద్యార్థులపై, వారి తల్లిదండ్రుల ముందస్తు అనుమతి లేకుండా బలవంతంగా ఉర్దూ భాషను రుద్దుతున్నారని మండిపడింది. విద్యాశాఖ అనుమతించిన అధికారిక సిలబస్ మరియు లాంగ్వేజ్ పాలసీకి (ఝఅస్త్రఋస్త్రవ ాశీశ్రీఱషం) పూర్తిగా భిన్నంగా భరత్ చంద్ర హైస్కూల్ యాజమాన్యం ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటోందని ఆరోపించారు. ప్రైవేట్ పాఠశాలలు తమ సొంత నిబంధనలతో విద్యార్థులపై ఇష్టానుసారంగా భాషలను రుద్దడం విద్యా చట్టాలను ఉల్లంఘించడమే అవుతుందని స్పష్టం చేశారు. పాఠశాల యాజమాన్యం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనకు మరియు మానసిక ఒత్తిడికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సదరు పాఠశాలలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం థర్డ్ లాంగ్వేజ్ (ఠష్ట్రఱతీస ఝఅస్త్రఋస్త్రవ) గా ఏ భాషకు అనుమతి ఉందో విద్యాశాఖ అధికారుల (ణజుూ/ఠీజుూ) ద్వారా తక్షణమే పూర్తి స్థాయి విచారణ జరిపించాలి.విద్యా చట్టాలను ఉల్లంఘించి, విద్యార్థులపై మానసిక ఒత్తిడి తెచ్చిన పాఠశాల ప్రిన్సిపాల్ మరియు యాజమాన్యంపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలి.భవిష్యత్తులో జిల్లాలోని ఏ ప్రైవేట్ పాఠశాల కూడా ఇలాంటి ఏకపక్ష నిర్ణయాలు తీసుకోకుండా జిల్లా యంత్రాంగం గట్టి ఆదేశాలు జారీ చేయాలి.విద్యార్థుల భవిష్యత్తును, విద్యా నిబంధనలను కాపాడటానికి జిల్లా కలెక్టర్ గారు ఈ వ్యవహారంపై తక్షణమే స్పందించి, తగిన న్యాయం చేయాలని ఏబీవీపీ డిమాండ్ చేస్తుందన్నారు లేనిపక్షంలో విద్యార్థులు, తల్లిదండ్రులను సమీకరించి పాఠశాల ముందు పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు ఈ కార్యక్రమం లో ప్రవీణ్ కుమార్,చెర్రీ, కుల్వంత్, సౌరాబ్, దీపాన్, సిద్దు, రాజేష్, గుడ్డు, బాలు, శశాంక్, రక్షిత తదితరులు పాల్గొన్నారు.

# ఓటు ప్రాధాన్యతను గుర్తించాలి!

## యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు





**నేరడిగొండ, జూన్ 29 (ప్రజాజ్యోతి) :** ఓటు హక్కు అనేది ప్రజాస్వామ్యంలో అత్యంత కీలకమైనదని, దానిని కోల్పోతే రేషన్ కార్డ్, పింఛన్ మరియు ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాలను కూడా కోల్పోయే ప్రమాదం ఉందని బోథ్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బద్దం పోత రెడ్డి హెచ్చరించారు. నేరడిగొండ మండలంలోని తేజాపూర్ గ్రామంలో గల 268వ పోలింగ్ బూత్‌లో నాల్గవ రోజు నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతి ఓటరు తమ ఓటు యొక్క ప్రాధాన్యతను గుర్తించాలని పిలుపునిచ్చారు. గ్రామాల్లో ఓటర్ల నమోదు, సవరణల ప్రక్రియ పారదర్శకంగా సాగాలని ఆకాంక్షించారు. ప్రత్యేక సమగ్ర ప్రక్రియలో భాగంగా ప్రతి బీఎల్ఓ (బివిఎల్ఓ) ప్రతి ఇంటిని మూడు సార్లు సందర్శిస్తారని, కాబట్టి ఓటర్లందరూ తమ సరైన, ఖచ్చితమైన వివరాలను అందిస్తూ బీఎల్ఓలకు పూర్తి స్థాయిలో సహకరించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో బీఎల్ఓ కమలాకర్ రెడ్డి, బీఎల్ఏ-2 గజ్జెల అశోక్, తేజాపూర్ కాలనీ వార్డు మెంబర్ భీమ్రావుతో పాటు స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో ఓటర్లు పాల్గొన్నారు.

# అభివృద్ధి బాటలో ఈదులవాడ గ్రామపంచాయతీ





**ఆసిఫాబాద్ జూన్ 29 ప్రజా జ్యోతి :**

ఆసిఫాబాద్ మండలంలోని ఈదులవాడ గ్రామపంచాయతీ పరిధిలో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని గ్రామ ప్రజాప్రతినిధులు తెలిపారు. గ్రామంలో సీసీ రోడ్లు, పారిశుద్ధ్య చర్యలు, మౌలిక వసతుల కల్పనతో పాటు ప్రజలకు అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలను ప్రాధాన్యంగా చేపడుతున్నామని పేర్కొన్నారు. ప్రజల సహకారంతో గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని, రానున్న రోజుల్లో మరిన్ని పనులు చేపడతామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో సర్పంచ్ చిలుకూరి కళ్యాణి సతీష్, ఉపసర్పంచ్ మరిశెట్టి ప్రేమ్‌సాగర్, వార్డు సభ్యుడు చారందాస్, తన్నీర్ శ్రీధర్, సీనియర్ నాయకుడు నాయికిని సతీష్, యువ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# మరమ్మతులకు నోచుకోని మరుగుదొడ్లు..








**– ఊడిపడుతున్న పెచ్చులు..**
**– మరమ్మతులు చేపట్టాలని ప్రజల విజ్ఞప్తి**

**మందమర్రి,జూన్ 29 (ప్రజాజ్యోతి) :** ప్రజల సౌకర్యార్థం సింగరేణి అధ్వర్యంలో కొన్నే ఏళ్ల క్రితం నిర్మించిన సులభ్ కాంప్లెక్స్ లు మరమ్మతులు లేక శిథిలావస్థ దశకు చేరుకున్నాయి. పట్టణంలోని సినిమా హాల్ ఏరియా అర్బన్ హెల్త్ సెంటర్ ఎదురుగా ఉన్న మరుగుదొడ్ల భవనం దెబ్బతినడంతో పాటు పైకప్పు నుంచి పెచ్చులు పడి పలువురు గాయపడిన ఘటనలు ఉన్నాయి. స్థానిక మహిళలు మాట్లాడుతూ ప్రజలకు, ఆసుపత్రికి వచ్చే వారికి అత్యవసర సమయంలో ఎంతగానో ఉపయోగపడుతున్న ఈ సులబ్ కాంప్లెక్స్ లో కనీస సదుపాయాలు లేవని సిబ్బంది పర్యవేక్షణ లేకపోవడంతో భవనం పైకప్పు భాగాల్లో సిమెంట్ పెచ్చులు రాలిపోయి ఇనుము రాడ్లు బయటకు కనిపిస్తున్నాయి అని, కనీసం మరుగుదొడ్లకు తలుపులు లేవని అన్నారు. కాంప్లెక్స్ చుట్టూ పెరిగిన చెట్ల పొదలు కారణంగా వస్తున్న పాములు, విష కీటకాల కారణంగా ప్రాణాలు అరచేతిలో పెట్టుకున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత సింగరేణి, మున్సిపల్ అధికారులు, సిబ్బంది జోక్యం చేసుకుని అవసరమైన చర్యలు తీసుకోవాలని వేడుకున్నారు.

# విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు పంపిణీ

**జన్నారం, జూన్ 29 (ప్రజాజ్యోతి) :** నేషనల్ హ్యూమన్ రైట్స్ యాంటీ కరప్షన్ అండ్ యాంటీ క్రైమ్ బ్యూరో ఆఫ్ ఇండియా సెంట్రల్ ప్రెసిడెంట్ ముత్యం రఘు ఆధ్వర్యంలో సోమవారం రోజున జన్నారం మండలంలోని టి డబ్ల్యూ పి ఎస్ పాఠశాల విద్యార్థులకు ప్లేట్లు మరియు గ్లాసులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఒక లక్ష్యం తో ముందుకు సాగాలని,మంచిగా చదువుకొని భవిష్యత్తు లో మంచి స్థాయిలో ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ హెడ్మాస్టర్ శివరాజం మరియు ఉపాధ్యాయులు గంగా సింగ్,బిక్కు, పరమేశ్వర్, గంగాధర్, కమలాకర్, అనిల్ మరియు ఆర్టిఐ సంఘ సభ్యులు సాయికుమార్, అభినయ్ విద్యార్థులు పాల్గొన్నారు.




## రైతులకు అండగా సహకార సంఘాలు

### – పాక్స్ చైర్మన్ మందుల రమేష్



**నేరడిగొండ, జూన్ 29 (ప్రజాజ్యోతి) :** మండలంలోని కుమారి సహకార సంఘం ఆధ్వర్యంలో సహకార వారోత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. 'సహకారముతో సమృద్ధి' స్వర్ణోత్సవ సంవత్సరాల అంశాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన ఈ ప్రత్యేక కార్యక్రమానికి సహకార సంఘం అధ్యక్షులు ముందుల రమేష్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన సహకార పతాకాన్ని ఎగురవేసి, అనంతరం హాజరైన వారందరితో సహకార ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు ముందుల రమేష్ మాట్లాడుతూ.. గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు సహకార సంఘము వెన్నెముక లాంటిదని, ఈ రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. రైతుల సంక్షేమానికి సహకార సంఘాలు ఎల్లప్పుడూ అండగా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్లు, సీఈఓలు రామోజి ప్రవీణ్, వొర్స రాజేందర్, గ్రామస్తులు సామ లక్ష్మారెడ్డి, బి.తులసీ దాస్, వివిఎన్ రాజేశ్వర్, బి.రమణయ్య, డి.గంగయ్య, వి.ప్రమోద్, వివిఎన్ రాజు, బి.ప్రణయ్, రఘువీర్, బి.అడెల్లు, స్థానిక రైతులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్‌తో ఆవు మృతి



**లోకేశ్వరం జూన్ 29 (ప్రజాజ్యోతి) :** మండలంలోని అబ్దుల్లాపూర్ గ్రామంలో ఆదివారం తెల్లవారుజామున విద్యుత్ షాక్ తగిలి ఆవు మృతి చెందినట్లు యజమాని తోట భూమన్న తెలిపారు సంఘటన స్థలాన్ని పరిశీలించిన ప్రజా జ్యోతి ప్రతినిధి వారి వివరాలు సేకరించి ఆవు విలువ సుమారు 40 వేల వరకు ఉంటుందని ఆయన పేర్కొన్నారు ఆవు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

## కడ్తాల్ అయ్యప్ప ఆలయ అభివృద్ధి కోసం విరాళం



**సోన్, జూన్ 29 (ప్రజా జ్యోతి) :** మండల కేంద్రంలోని కడ్తాల్ గ్రామంలోని చారిత్రాత్మకమైన కొలువై ఉన్న ధర్మశాస్త్ర అయ్యప్ప ఆలయం మనందరికీ అత్యంత పవిత్రమైనది. సనాతన ధర్మ సాంప్రదాయాలను ఆధ్యాత్మిక పరిమళాలను కాపాడే ఈ పుణ్య క్షేత్రాన్ని మరింత సుందరంగా తీర్చిదిద్దాలని, అభివృద్ధి కోసం భక్తులు విరాళాలు అందజేశారు. తానూరు మండలం బోసి గ్రామానికి చెందిన సాగరిక నాగనాథ్ గురు స్వామి దంపతులు 11 వేల రూపాయలు విరాళంగా ఆలయ గురుస్వామి నర్సారెడ్డికి సోమవారం ఆలయ ప్రాంగణంలో అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి వారికి ఆశీర్వచనాలు, తీర్థప్రసాదాలు అందించడం జరిగింది.

## ఆడబిడ్డలకు అండగా కల్యాణలక్ష్మి

### ఎమ్మెల్యే కోవ లక్ష్మి



**ఆసిఫాబాద్ జూన్ 29 ప్రజా జ్యోతి :** పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు కల్యాణలక్ష్మి పథకం ఆర్థిక భరోసా ఇస్తోందని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో 80 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆడబిడ్డల సంక్షేమం కోసం ప్రతిష్టాత్మకంగా ఈ పథకాన్ని తీసుకొచ్చారని గుర్తుచేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులందరూ వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ మెంగ్రే ఆకాష్, వైస్ ఛైర్మన్ అహ్మద్, సింగిల్ విండో ఛైర్మన్ అలీ భాయ్, కౌన్సిలర్లు సలాం, నాగుబాయి, బీఆర్ఎస్ నాయకులు, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# ప్రతి ఇంటికి ఫారాలు అందించి అవగాహన కల్పించాలి

- బీఎల్ఓలకు కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశం

వనపర్తి ప్రతినిధి, జూన్ 29 (ప్రజాజ్యోతి): ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా ప్రతి బూత్ లెవల్ అధికారి (బీఎల్ఓ) బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ప్రజలకు ఎన్యూమరేషన్ ఫారాల నింపే విధానంపై పూర్తి అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. సోమవారం



వనపర్తి పట్టణంలోని 23వ వార్డులో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీని కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా బీఎల్ఓల పనితీరును తనిఖీ చేసిన ఆయన, ప్రతి ఇంటికి వెళ్లి ఫారాలను అందజేయడంతో పాటు వాటిని ఎలా సక్రమంగా పూరించాలో ఓటర్లకు స్పష్టంగా వివరించాలని ఆదేశించారు. ఓటర్ల సందేహాలను ఓర్పుతో నివృత్తి చేయడంతో పాటు అవసరమైన పత్రాలపై అవగాహన కల్పించాలని సూచించారు. ఎన్యూమరేషన్ ప్రక్రియను పారదర్శకంగా, నిర్దేశిత గడువులో పూర్తి చేసి, అర్హులైన ప్రతి ఓటరికి ఫారం అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఓటరు జాబితా ఖచ్చితత్వానికి ప్రత్యేక సవరణ ప్రక్రియ ఎంతో కీలకమని పేర్కొన్న కలెక్టర్, అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు. ఈ తనిఖీలో ఆర్డీవో సుబ్రహ్మణ్యం, తహసీల్దార్ రమేష్ రెడ్డి, బీఎల్ఓలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ప్రజావాణిలో 15 ఫిర్యాదులు-సత్వర పరిష్కారానికి చర్యలు:జిల్లా ఎస్పీ టి.శ్రీనివాసరావు

గద్వాల జూన్ 29(ప్రజా జ్యోతి ప్రతినిధి): జోగులాంబ గద్వాల జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ మండలాల నుంచి వచ్చిన 15 ఫిర్యాదులను జిల్లా ఎస్పీ టి.శ్రీనివాసరావు స్వీకరించారు.బాధితులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్న ఆయన, ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత పోలీసు స్టేషన్ల అధికారులతో వెంటనే సంప్రదించి చట్టపరమైన చర్యలు వేగవంతం చేయాలని ఆదేశించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ,ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవడం పోలీసు శాఖ ప్రధాన



బాధ్యత అని అన్నారు.ప్రజావాణి ద్వారా అందిన ప్రతి ఫిర్యాదును నిష్పక్షపాతంగా విచారించి బాధితులకు సకాలంలో న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, మంగళవారం నుంచి శనివారం వరకు అన్ని పని దినాల్లో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. ఎక్కడైనా న్యాయం జరగలేదని భావించే ప్రజలు జిల్లా పోలీసు కార్యాలయంలో నేరుగా తమ సమస్యలను తెలియజేయవచ్చని సూచించారు.భూ వివాదాలు,ఆస్తి తగాదాలు, కుటుంబ కలహాలు తదితర అంశాల్లో చట్టపరమైన పరిష్కారానికే ప్రాధాన్యం ఇస్తున్నామని,ప్రజావాణి ద్వారా అందిన ఫిర్యాదుల పరిష్కారాన్ని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ పారదర్శకమైన,వేగవంతమైన పోలీసు సేవలు అందిస్తున్నామని ఎస్పీ తెలిపారు.సోమవారం అందిన ఫిర్యాదుల్లో తండ్రిని పిల్లలు పట్టించుకోవడం లేదంటూ ఒకటి,పత్తి పంట పీకిన ఘటనకు సంబంధించి ఒకటి,గొడవలకు సంబంధించిన మూడు, భూ వివాదాలకు సంబంధించిన ఆరు,పొలంలో అక్రమంగా పైప్‌లైన్ వేసిన ఘటనకు సంబంధించిన ఒకటి,ఇతర సమస్యలకు సంబంధించిన మూడు ఫిర్యాదులు ఉన్నాయి.మొత్తం 15 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు.

## అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనలో గణాంకాల పాత్ర కీలకం

జాతీయ గణాంక దినోత్సవం ఘనంగా నిర్వహించిన జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి కార్యాలయం

మహబూబ్‌నగర్, జూన్ 29 (ప్రజా జ్యోతి బ్యూరో): అభివృద్ధి ప్రణాళికల రూపకల్పన, ప్రభుత్వ విధానాల అమలు, ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలలో ఖచ్చితమైన గణాంకాల పాత్ర అత్యంత కీలకమని జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి రవీందర్ పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి కార్యాలయంలో సోమవారం జాతీయ గణాంక పితామహుడు ప్రొఫెసర్ పి.సి. మహలనోబిస్ జయంతిని పురస్కరించుకుని జాతీయ గణాంక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహలనోబిస్ చిత్రపటానికి రవీందర్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఈ ఏడాది "పరిపాలనలో డేటా సామర్థ్యాన్ని వెలికితీయడం" అనే అంశంతో జాతీయ గణాంక దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భారతదేశంలో గణాంక శాస్త్ర అభివృద్ధికి ప్రొఫెసర్ పి.సి. మహలనోబిస్ చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. దేశ ఆర్థిక ప్రణాళికల రూపకల్పన, నమూనా సర్వేలు, గణాంక వ్యవస్థ బలోపేతంలో ఆయన చేసిన విశేష కృషిని స్మరించుకుంటూ ప్రతి సంవత్సరం జూన్ 29న జాతీయ గణాంక దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, విధాన నిర్ణయాలు, అభివృద్ధి కార్యక్రమాల ప్రణాళికలో విశ్వసనీయమైన గణాంక సమాచారం ఎంతో ఉపయోగపడుతుందని, అందుకే ఖచ్చితమైన డేటా సేకరణపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని ఆయన పేర్కొన్నారు. సమాచార పౌర సంబంధాల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ పి. శ్రీనివాస్ మాట్లాడుతూ, డా. పి.సి. మహలనోబిస్ గణాంక శాస్త్ర అభివృద్ధికి విశేష సేవలందించారని తెలిపారు. అభివృద్ధి కార్యక్రమాల అమలులో గణాంక అధికారుల పాత్ర కీలకమని, నాణ్యమైన సమాచారాన్ని ప్రభుత్వానికి అందించే బాధ్యతను గణాంక సిబ్బంది సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గణాంక అధికారి నర్సింహులు, డిప్యూటీ గణాంక అధికారి రాజేష్, సహాయ గణాంక అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొని ప్రొఫెసర్ పి.సి. మహలనోబిస్ సేవలను స్మరించుకున్నారు.



# ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం వద్దు:కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

గద్వాల జూన్ 29(ప్రజా జ్యోతి ప్రతినిధి): ప్రజావాణి ద్వారా ప్రజల నుంచి అందిన ఫిర్యాదుల పరిష్కారంలో అధికారులు అలసత్వం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా





షేక్ హెచ్చరించారు.సోమవారం ఐడీఓసీ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు మధుమోహన్,నర్సింగరావులతో కలిసి కలెక్టర్ ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు.ఈ వారం మొత్తం 29 ఫిర్యాదులు అందాయని తెలిపారు.జిల్లా,మండల స్థాయిలో అందుతున్న ప్రజావాణి అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.ప్రజావాణి పోర్టల్‌లో నమోదయ్యే ఫిర్యాదులను రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు కూడా పర్యవేక్షిస్తున్నారని పేర్కొన్నారు.వివిధ శాఖల్లో పెద్ద ఎత్తున అర్జీలు పెండింగ్‌లో ఉండడంపై అసంతృప్తి వ్యక్తం చేసిన కలెక్టర్,ప్రతి బుధవారం శాఖల అధికారులు తమ సిబ్బందితో సమీక్ష నిర్వహించి ఫిర్యాదుల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు.వచ్చే సోమవారం లోగా పెండింగ్‌లో ఉన్న అన్ని అర్జీలను పరిష్కరించాలని,నిర్లక్ష్యం ప్రదర్శించే అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తామని హెచ్చరించారు.సంబంధిత శాఖల జిల్లా అధికారులు ప్రజావాణి పోర్టల్‌లో లాగిన్ అయి తమకు సంబంధించిన ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు.ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా క్షేత్రస్థాయిలో ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీని మండల ప్రత్యేక అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.బూత్ లెవల్ అధికారుల పనితీరును కూడా ఎప్పటికప్పుడు సమీక్షించాలని చెప్పారు.విద్యాలయాలు,వసతి గృహాలు,అంగన్‌వాడీ కేంద్రాలను సంబంధిత అధికారులు తరచూ సందర్శించి అక్కడి కార్యకలాపాలు సక్రమంగా జరిగేలా చూడాలని ఆదేశించారు.విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.జిల్లా వ్యాప్తంగా ప్రతి మండలంలో మూడు ప్రీ-ప్రైమరీ తరగతులు ప్రారంభిస్తున్న నేపథ్యంలో అక్కడి సిబ్బంది పనితీరును కూడా పర్యవేక్షించాలని తెలిపారు.ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్మాణం, మరమ్మత్తు పనులు సకాలంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని,విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు,నోట్‌బుక్స్ ఇప్పటికే పంపిణీ చేసినట్లు తెలిపారు.యూనిఫాంల కుట్టింపు పనులను వేగవంతం చేసి వీలైనంత త్వరగా విద్యార్థులకు అందజేయాలని అధికారులను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు మధుమోహన్, నర్సింగరావు,కలెక్టరేట్ ఏవో భూపాల్ రెడ్డి,ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు మనోజ్ కుమార్ రెడ్డి, రాజ్ కుమార్,వివిధ శాఖల జిల్లా అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

## పెండింగ్ కేసుల సత్వర పరిష్కారానికి సమన్వయంతో పనిచేద్దాం

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి బాకరాజు శ్రీనివాసరావు

వనపర్తి ప్రతినిధి, జూన్ 29 (ప్రజాజ్యోతి): పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించేందుకు న్యాయవ్యవస్థ, పోలీసు శాఖ, జిల్లా యంత్రాంగం పరస్పర సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బాకరాజు శ్రీనివాసరావు అన్నారు. వనపర్తి జిల్లా నూతన ప్రధాన జిల్లా న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించిన బాకరాజు శ్రీనివాసరావును జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, జిల్లా ఎస్పీ సునీతా రెడ్డి సోమవారం కోర్టు కార్యాలయంలోని ఆయన ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలో పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించేందుకు న్యాయవ్యవస్థ, పోలీసు శాఖ, జిల్లా యంత్రాంగం పరస్పర సమన్వయంతో పనిచేయాల్సిన అవసరంపై చర్చించారు. ముఖ్యంగా మహిళలు, చిన్నారులకు సంబంధించిన పోక్సో కేసుల విచారణను వేగవంతం చేసి, బాధితులకు సకాలంలో న్యాయం అందేలా ప్రత్యేక దృష్టి



సారించాలని నిర్ణయించారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజలకు సమర్థవంతమైన న్యాయ సేవలు అందించేందుకు అన్ని శాఖలు సమిష్టిగా కృషి చేయాలని సమావేశంలో అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు, పోలీసు ఉన్నతాధికారులు, బార్ కౌన్సిల్ అధ్యక్షుడు కిరణ్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.a

## అప్పిరెడ్డిపల్లిలో ఘనంగా ఇందిరమ్మ గృహప్రవేశం

ఇందిరమ్మ గృహ ప్రవేశాన్ని ప్రారంభిస్తున్న బొక్క నారాయణమ్మ



నారాయణపేట ప్రతినిధి జూన్ 29 (ప్రజా జ్యోతి) నారాయణపేట మండలంలోనిఅప్పిరెడ్డిపల్లిలో లబ్ధిదారురాలు బొక్కలక్షి ఇందిరమ్మ గృహప్రవేశంసర్పంచ్ పోలీసువెంకటరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ వెంకటరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం పేద ప్రజల సొంతింటి కల నెరవేర్చేందుకు కృషి చేస్తుందన్నారు. ఇందిరమ్మ ఇల్లు మంజూరైన లబ్దిదారులు పనులు పూర్తి చేస్తే ప్రభుత్వం విడుదలవారీగా రూ. 5 లక్షలు లబ్దిదారుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తుందన్నారు. ఇందిరమ్మ పథకం పేద ప్రజల సొంతింటి కల నెరవేర్చుకునేందుకు ఎంతగానో దోహదపడుతుందనిఅన్నారు. అర్హులైన పేదవారికి ప్రభుత్వం మంజూరు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తానన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు బొక్క నారాయణమ్మ అవసరం శ్రీనివాస్ గాలదేవం ద్రప్ప కార్యదర్శి విజయలక్ష్మి ,ఉపసర్పంచ్ అంజిలమ్మ,హన్మంతు, కాశీనాథ్ పాల్గొన్నారు

## దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించే వరకు ఉద్యమం కొనసాగుతుంది

అలంపూర్ డివిజన్ (ప్రజాజ్యోతి) జూన్ 29: దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని



డిమాండ్ చేస్తూ జోగులాంబ గద్వాల జిల్లా పాస్టర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం అలంపూర్ నియోజకవర్గంలో చేపట్టిన బైక్ ర్యాలీకి ఎంఆర్పీఎస్,ఎంఎస్పీ ఎంఈఎఫ్ జిల్లా నాయకులు సంఘీభావం ప్రకటించారు.అలంపూర్ చౌరస్తాలో ర్యాలీకి స్వాగతం పలికి తమ మద్దతును తెలియజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ,1950 రాష్ట్రపతి ఉత్తర్వుల కారణంగా దళిత క్రైస్తవులురాజ్యాంగ బద్ధంగా లభించాల్సిన ఎస్సీ హక్కులకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మతం మారితే కులం మారదనే సూత్రాన్ని దృష్టిలో ఉంచుకొని, దళిత క్రైస్తవులకు కూడా ఎస్సీ హోదాను కొనసాగించాలని వారు డిమాండ్ చేశారు. ఈ వివక్షపూరిత విధానాన్ని తక్షణమే సవరించి,1950 రాష్ట్రపతి ఉత్తర్వులను రద్దు చేసి దళిత క్రైస్తవులకు న్యాయం చేయాలని కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. దళిత క్రైస్తవుల న్యాయమైన హక్కులు సాధించే వరకు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో పాస్టర్ల అసోసియేషన్ బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు ఆర్.కిషోర్, కొంకల భీమన్న మాదిగ,ఐజ రాజు మాదిగ,ఎంఈఎఫ్ నాయకుడు నాగరాజు మాదిగ,ఎంఆర్పీఎస్ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు ఎలీషా మాదిగ,గట్టు మండల అధ్యక్షుడు బలిగేరా ఏసన్న మాదిగతో పాటు ఎంఆర్పీఎస్,ఎంఎస్పీ, ఎంఈఎఫ్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అమాయకుడిని మోసం చేసిన ప్రభుత్వ ఉద్యోగి

న్యాయం చేయాలని బాధితురాలు వేడుకోలు

నారాయణపేట ప్రతినిధి జూన్ 29 (ప్రజా జ్యోతి) నారాయణపేట జిల్లా మద్దూరు మండలం పర్సాపురం గ్రామానికి చెందిన సుక్కమ్మ కూతురు ఎల్లమ్మ తన కుటుంబానికి చెందిన మూడు ఎకరాల ఇరవై గుంటల (3.12 ఎకరాల) భూమిని అక్రమంగా కబ్జా చేశారని ఆరోపిస్తూ జిల్లా కలెక్టర్‌కు సోమవారం వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా ఎల్లమ్మ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగి నరసింహారెడ్డి అనే వ్యక్తి తమ తండ్రిని బెదిరించి, మాయమాటలు చెప్పి బలవంతంగా దొంగ సంతకాలు చేయించుకుని కుటుంబానికి చెందిన రెండు ఎకరాల భూమిని తన పేరుపై రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఆరోపించారు. అమాయకున్ని చూసి తన దగ్గర నెల జీతానికి పని చేస్తున్న వ్యక్తిని పెన్షన్ ఇప్పిస్తానని చెప్పి తనకు సంబంధించిన భూమి పత్రాలను తీసుకురామని చెప్పి ఆ భూమి పత్రాలపైన తన ముందు సంతకం చేయించుకోకుండా అధికారుల ముందు సంతకం చేయించి నీకు ప్రతినెల ప్రభుత్వం నుండి పెన్షన్ వస్తుందని చెప్పి మాయమాటలతో ఆ వ్యక్తిని ప్రలోభాలు పెట్టి మోసం చేసిన సోమవారం నారాయణపేట జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రజావాణిలో బాధ్యత కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదులో విలేకరుల ముందు పేర్కొన్నారు.అనంతరం అదే భూమిని ఆధారంగా చేసుకుని బ్యాంకులో రుణం కూడా పొందారని తెలిపారు.

ఈ ఘటన వల్ల తమ కుటుంబం తీవ్ర ఆర్థిక, మానసిక ఇబ్బందులు ఎదుర్కొంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. తమ కుటుంబంలో నలుగురు అక్కాచెల్లెళ్లు, ఒక తమ్ముడు ఉన్నారని, కుటుంబానికి జీవనాధారమైన భూమి కూడా కోల్పోవడంతో జీవనం భారంగా మారిందన్నారు.

ఈ వ్యవహారంపై సంబంధిత రెవెన్యూ అధికారులు పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి, భూమి రికార్డులను పరిశీలించి, అక్రమాలు



జరిగి ఉంటే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. తమ కుటుంబానికి చెందిన భూమిని తిరిగి ఇప్పించి న్యాయం చేయాలని జిల్లా అధికారులను వేడుకున్నారు.ఈ ఘటనపై సంబంధిత అధికారులు నిష్పక్షపాత విచారణ చేపట్టి, వాస్తవాలను వెలుగులోకి తీసుకువచ్చి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

## జులై 1 నుంచి వనపర్తిలో ఈ-ఆఫీస్ తప్పనిసరి

- ఈ-ఆఫీస్ ద్వారానే ప్రభుత్వ ఉత్తర ప్రత్యుత్తరాలు
- ఫిజికల్ ఫైళ్లు ఆమోదించబోం: కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి ప్రతినిధి, జూన్ 29 (ప్రజాజ్యోతి): జులై 1 నుంచి వనపర్తి జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఈ-ఆఫీస్ విధానాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల మధ్య జరిగే అన్ని అధికారిక ఉత్తర ప్రత్యుత్తరాలు ఇకపై ఈ-ఆఫీస్ ద్వారానే నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి హాల్లో నిర్వహించిన ఈ-ఆఫీస్ అవగాహన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడారు. అధికారులు, సిబ్బంది ఈ-ఆఫీస్ వినియోగంపై పూర్తి



శిక్షణ పొంది జులై 1 నుంచి విధానాన్ని అమలు చేయాలని సూచించారు. ఫైళ్ల సత్వర పరిష్కారం, పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించడంలో ఈ-ఆఫీస్ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. అలాగే పర్యావరణ పరిరక్షణకు కూడా దోహదపడుతుందన్నారు. ఏ ఫైలు ఏ అధికారి వద్ద పెండింగ్‌లో ఉందో, ఎన్ని రోజులుగా పెండింగ్‌లో ఉందో ఈ-ఆఫీస్ ద్వారా సులభంగా తెలుసుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. జిల్లాలోని అన్ని శాఖల అధికారులు, సిబ్బంది ఈ-ఆఫీస్ విధానాన్ని పూర్తిగా అవగాహన చేసుకుని అమలు చేయాలని సూచించారు. జులై 1 తర్వాత తన వద్దకు భౌతిక (ఫిజికల్) రూపంలో వచ్చే ఫైళ్లను ఆమోదించబోమని కలెక్టర్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఎన్. ఖీమ్యా నాయక్, వినోద్ కుమార్‌తో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## భూ తగాదాలకు కోర్టే సరైన వేదిక

- చట్టాన్ని ఎవరు చేతుల్లోకి తీసుకోవద్దు

వనపర్తి, జూన్ 29 (ప్రజాజ్యోతి): భూ వివాదాలకు సంబంధించిన సమస్యలను సంబంధిత న్యాయస్థానాల ద్వారానే పరిష్కరించుకోవాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే పరిస్థితులు తలెత్తితే వెంటనే పోలీసులను ఆశ్రయించాలని జిల్లా ఎస్పీ సునిత రెడ్డి, ఐపీఎస్ సూచించారు. ప్రజలకు న్యాయం, భద్రత, విశ్వాసం కల్పించడమే పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమని ఆమె పేర్కొన్నారు. వనపర్తి జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 22 మంది ఫిర్యాదుదా



రుల నుంచి అదనపు ఎస్పీ సునిత రెడ్డి నేరుగా వినతులు స్వీకరించారు. అందిన ప్రతి ఫిర్యాదును పరిశీలించి, సంబంధిత పోలీస్‌స్టేషన్ అధికారులకు వెంటనే చర్యలు తీసుకుని బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, భూ వివాదాలకు సంబంధించిన ఫిర్యాదులు అధికంగా సివిల్ స్వభావం కలిగి ఉంటాయని, అలాంటి వివాదాలకు కోర్టు ద్వారానే శాశ్వతమైన, చట్టబద్ధమైన పరిష్కారం లభిస్తుందని తెలిపారు. ఎవరూ చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోకుండా, ఏవైనా వివాదాలు లేదా శాంతిభద్రతలకు సంబంధించిన సమస్యలు తలెత్తితే వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు. ప్రజావాణిలో స్వీకరించిన 22 ఫిర్యాదుల్లో 16 భూ తగాదాలకు, ఒకటి భార్యాభర్తల వివాదానికి, ఐదు పరస్పర గొడవలకు సంబంధించినవిగా అధికారులు తెలిపారు.

## ల్యాబ్ టెక్నీషియన్ లకు న్యాయం చెయ్యాలి

గద్వాల (ప్రజా జ్యోతి) జూన్ 29: తొలగించిన కాంట్రాక్ట్,ఔట్ సోర్సింగ్ ల్యాబ్ టెక్నీషియన్ లను వెంటనే విధుల్లోకి తిరిగి తీసుకోవాలని సామాజిక విప్లవ కారుడు డాక్టర్ ప్రేమ్ కుమార్ అన్నారు. రెగ్యులర్ ల్యాబ్ టెక్నీషియన్ వచ్చాక కాంట్రాక్ట్,ఔట్ సోర్సింగ్ ల్యాబ్ టెక్నీషియన్ లను తొలగించడం



అన్యాయం అని,కాంట్రాక్ట్,ఔట్ సోర్సింగ్ ల్యాబ్ టెక్నీషియన్ లు కరోనా వ్యాధి వచ్చిన విపత్కర పరిస్థితుల్లో వారి ప్రాణాలకు తెగించి తమ విధులు నిర్వర్తించారని. అలాంటి వారిని ఇప్పుడు తొలగించడం చాలా బాధ కరమైన విషయం అని. తొలగించిన ల్యాబ్ టెక్నీషియన్ లు తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురి అవుతున్నారని అంతే కాక వారి కుటుంబాలు రోడ్డున పడ్డ పరిస్థితి వచ్చిందని.ఎట్టి పరిస్థితుల్లో తొలగించిన ల్యాబ్ టెక్నీషియన్ లను తీసుకోవాలని సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం అందజేసిన సామాజిక విప్లవ కారుడు డాక్టర్ ప్రేమ్ కుమార్.

## జీడబ్ల్యూఎంసీ నూతన కమిషనర్‌కు జిల్లా కలెక్టర్ శుభాకాంక్షలు..



హనుమకొండ జిల్లా ప్రతినిధి జూన్ 29 (ప్రజాజ్యోతి) : గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ) నూతన కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన టి. వెంకన్న సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టర్, జీడబ్ల్యూఎంసీ ప్రత్యేకాధికారి చాహత్ బాజ్‌పాయ్‌ను హనుమకొండ కలెక్టరేట్‌లో మర్యాదపూర్వ కంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన కమిషనర్‌కు పూలమొక్కను అందజేసి జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నగర అభివృద్ధి, ప్రజలకు నాణ్యమైన మున్సిపల్ సేవల అందజేత, పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, ఇతర అభివృద్ధి కార్యక్రమాలపై ఇరువురు చర్చించారు.

## కల్లెడ ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా బాలసభ కార్యక్రమం



పర్వతగిరి, జూన్ 29 (ప్రజా జ్యోతి) : పర్వతగిరి మండలం కల్లెడ గ్రామ ప్రభుత్వ పాఠశాలలో ఈరోజు బాలసభ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సర్పంచ్ తక్కలపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ, నేటి బాలలే రేపటి పౌరులు అని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులు ఉండటంతో పాటు, ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకం, ఉచిత యూనిఫార్ములు, పాఠ్యపుస్తకాలు అందిస్తున్నదని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. విద్యార్థుల్లో చదువుపై ఆసక్తి, ఉత్సాహాన్ని పెంపొందించేందుకు పెన్నులు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నిరంజన్, ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ ప్రజా, కార్యదర్శి బుస శ్రీనివాస్, ముంజలకుంట తండా కార్యదర్శి స్వర్ణ, వార్డు సభ్యులు చిరుత రమా, నక్క రాములు, పిట్టల రాధిక, దొమ్మటి రాజు, గ్రామ పెద్దలు, యువకులు పిట్టల రాజు, ఫీల్డ్ అసిస్టెంట్ సాయిలు, మధు తదితరులు పాల్గొన్నారు.

## సర్ నమోదు ప్రక్రియను ఆకస్మికంగా తనిఖీ చేసిన తహసీల్దార్ లక్ష్మీరాజయ్య



భూపాలపల్లి టౌన్, ప్రజా జ్యోతి, జూన్ 29 : భూపాలపల్లి పట్టణంలోని జవహర్ నగర్, కృష్ణ కాలనీలలో కొనసాగుతున్న ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ నమోదు ప్రక్రియను తహసీల్దార్ లక్ష్మీరాజయ్య సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా బూత్ లెవల్ అధికారులకుపలు సూచనలు చేశారు. ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీని వేగవంతం చేయాలని, ఆన్‌లైన్ డేటా ఎంట్రీ శాతం తక్కువగా ఉన్నందున ఎప్పటికప్పుడు వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు.అలాగే సర్ ప్రక్రియలో ఎలాంటి నిర్లక్ష్యం ప్రదర్శించకుండా ప్రతి ఇంటికి వెళ్లి ప్రతి ఓటరును వ్యక్తిగతంగా కలిసి నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. ఓటర్లకు అవసరమైన అవగాహన కల్పిస్తూ నిర్ణీత గడువులోగా ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయాలని తెలిపారు.ఆయన వెంట సూపర్వైజర్లు, బి.ఎల్.ఓ లు పాల్గొన్నారు.

## ప్రజలు ఎలాంటి పైరవీలు లేకుండా పోలీసులను ఆశ్రయించాలి

### మహాదేవపూర్ ఎస్సై సాంబమూర్తి




భూపాలపల్లి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ జూన్ 29 (ప్రజా జ్యోతి) : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ పోలీస్ స్టేషన్ లో సోమవారం రోజు ఎస్సై సాంబమూర్తి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రజలు ఎలాంటి పైరవీలు లేకుండా నిర్భయంగా పోలీసులను ఆశ్రయించాలని శాంతి భద్రతల విషయంలో ఎలాంటి రాజీ ఉండదని మాదకద్రవ్యాలపై పోలీసుల ఉక్కు పాదం ఉంటుందని ఎవరైనా మాదకద్రవ్యాలు సేవించిన అమ్మిన చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని అన్నారు. గ్రామంలో ఏ సమస్య ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని ఎస్సై సాంబమూర్తి పేర్కొన్నారు.

## అంతర్జాతీయ స్థాయిలో వెల్ది మోడల్ స్కూల్ ఉపాధ్యాయుడు కందగట్ల గణేష్‌కు ద్విగుణ గౌరవ పురస్కారాలు



రఘునాథపల్లి, జూన్ 29 (ప్రజాజ్యోతి) : రఘునాథపల్లి మండలంలోని వెల్ది తెలంగాణ మోడల్ స్కూల్, ఆంగ్ల ఉపాధ్యాయుడు కందగట్ల గణేష్ అంతర్జాతీయ స్థాయిలో రెండు ప్రతిష్ఠాత్మక గౌరవ పురస్కారాలను అందుకొని పాఠశాలకు విశిష్ట గుర్తింపు తీసుకువచ్చారు. దక్షిణాఫ్రికాకు చెందిన గ్లోబల్ రాయల్ కింగ్‌డమ్ -- పిలర్స్ ఆఫ్ పీస్ ఇంటర్నేషనల్సంస్థ ప్రపంచ శాంతి, మానవతా విలువలు, కుటుంబ వ్యవస్థ బలోపేతానికి చేసిన విశిష్ట సేవలను గుర్తించి గణేష్‌కు "గౌరవ ప్రశంసా పత్రం"ను ప్రదానం చేసింది. ఆయన సమాజ సేవా దృక్పథం, మానవతా విలువల పరిరక్షణలో చూపిన అంకితభావానికి ఈ గౌరవం లభించింది. అదేవిధంగా నైజీరియాకు చెందిన అంతర్జాతీయ విద్యా సంస్థ ఎ వాక్ త్రూ ఎడ్యుకేషన్ -- గ్లోబల్ ఇంటెలెక్చువల్ ఎక్స్ఛేంజ్ విద్యారంగంలో ఆయన చూపిన నిరంతర కృషి, విశిష్ట ప్రతిభ, అంకితభావాన్ని గుర్తించి "త్రైమాసిక అత్యుత్తమ ప్రతిభా పురస్కారం" ను ప్రదానం చేసింది. ప్రపంచ విద్యా సమాజంలో ఆయన అందించిన సేవలకు ఈ పురస్కారం ప్రత్యేక గుర్తింపుగా నిలిచింది. ఈ సందర్భంగా వెల్ది తెలంగాణ మోడల్ స్కూల్,ప్రిన్సిపాల్ పాలకుర్తి శ్రీధర్ కందగట్ల గణేష్‌ను అభినందించారు. అంతర్జాతీయ వేదికలపై పాఠశాలకు కీర్తి ప్రతిష్ఠలు తీసుకురావడం ప్రతి ఉపాధ్యాయునికి స్ఫూర్తిదాయకమని ఆయన పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఇదే సేవా స్ఫూర్తితో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ మరిన్ని జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలను అందుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జయశ్రీ, గాజర్ల రుద్రమదేవి, పార్వతి, సౌజన్యప్రియ, కట్ట రాజు, షహానా సుల్తానా, దారం శ్రీను, వినీల, తుమ్మ రవి, శశికుమారి, మాలతి, వసంత మాధురి, లలిత, బాలరాజు, మరపాక రాజయ్య మరియు గుగులోత్ బాలరాజు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. అనంతరం ఉపాధ్యాయులు, సిబ్బంది కందగట్ల గణేష్‌కు శుభాకాంక్షలు తెలియజేసి ఘనంగా సత్కరించారు. ఆయన సాధించిన ఈ రెండు అంతర్జాతీయ గౌరవాలు పాఠశాలకు, రఘునాథపల్లి మండలానికి, జనగామ జిల్లాకు గర్వకారణమని కొనియాడారు.

# మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

### ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడించిన సీఐటీయూ..






పరకాల, జూన్ 29 (ప్రజాజ్యోతి) : మున్సిపల్ కార్మికులను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించి, అప్పటి వరకు నెలకు రూ.26 వేల కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నగర పంచాయతీ కార్యాలయం నుంచి బస్టాండ్, పోచమ్మ గుడి, అంబేద్కర్ సెంటర్ మీదుగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే జోక్యం చేసుకుని ముఖ్యమంత్రితో మాట్లాడి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి బొట్ల చక్రపాణి, ఎస్ఎఫ్ఐ నాయకుడు బొచ్చు కళ్యాణ్, సీఐటీయూ నాయకుడు మడికొండ ప్రమోద్ కుమార్ కోరారు. మున్సిపల్ కార్మికులు ఏళ్ల తరబడి ప్రజా సేవలో కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ ప్రభుత్వం వారి సమస్యలను పట్టించుకోవడం లేదని నాయకులు విమర్శించారు. శాశ్వత పనుల్లో పనిచేస్తున్న కార్మికులను పర్మినెంట్ చేయాలని, అప్పటి వరకు రూ.26 వేల కనీస వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. విధుల్లో మరణించిన లేదా పదవీ విరమణ పొందిన కార్మికుల కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం కల్పించాలని, అర్హత కలిగిన వారికి పదోన్నతులు ఇవ్వాలని, ఇందిరమ్మ ఇళ్ల పథకంలో మున్సిపల్ కార్మికులకు తొలి ప్రాధాన్యం కల్పించాలని కోరారు. డిమాండ్లు పరిష్కరించకపోతే దశలవారీగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఎమ్మెల్యే తరఫున టౌన్ అధ్యక్షుడు ఒంటేరు శ్రావణ్ కుమార్, కౌన్సిలర్ కోయిడ శ్రీనివాస్, సమన్వయ కమిటీ సభ్యుడు మెరుగు శ్రీశైలం కార్మికుల వినతిపత్రాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు, సీఐటీయూ నాయకులు, జవాన్లు, కరెంట్, వాటర్ సెక్షన్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఎరువుల వ్యాపారంలో అవకతవకలా..? ఉన్నతాధికారుల విచారణకు రైతుల డిమాండ్..!

### రైతుల ప్రయోజనాలు గాలికొదిలారా..? పర్వతగిరి వ్యవసాయ శాఖపై విమర్శలు..!







పర్వతగిరి, జూన్ 29 (ప్రజాజ్యోతి) : వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంలో వ్యవసాయ రంగానికి కీలకమైన ఫెర్టిలైజర్ దుకాణాల నిర్వహణపై రైతుల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. మండలవ్యాప్తంగా దాదాపు 30కి పైగా ఎరువులు, విత్తనాలు, పురుగుమందుల దుకాణాలు కొనసాగుతున్నప్పటికీ, వాటిలో కొన్ని నిబంధనలకు విరుద్ధంగా కార్యకలాపాలు సాగిస్తున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రైతులకు బిల్లులు ఇవ్వకపోవడం, ఎరువుల ధరలను స్పష్టంగా ప్రదర్శించకపోవడం, స్టాక్ వివరాలు నమోదు చేయకపోవడం, అనుమతులకు మించి వ్యాపారం నిర్వహించడం, కొన్ని సందర్భాల్లో రైతులకు అవసరమైన ఎరువులను కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. అలాగే విత్తనాలు, పురుగుమందుల విక్రయాల్లో కూడా నిబంధనలు పాటించడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఇలాంటి పరిస్థితులు నెలకొన్నప్పటికీ మండల వ్యవసాయ శాఖ నుంచి ఆశించిన స్థాయిలో తనిఖీలు జరగడం లేదని రైతులు వాపోతున్నారు. ఫిర్యాదులు వచ్చినా సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలనలు చేపట్టకపోవడం, నిబంధనలు ఉల్లంఘిస్తున్న దుకాణాలపై చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ముఖ్యంగా మండల వ్యవసాయ అధికారి వ్యవహార శైలిపై రైతుల్లో ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. నిబంధనలు పాటిస్తున్న దుకాణాలు ఒకవైపు ఉంటే, వాటిని ఉల్లంఘిస్తున్న దుకాణాలు మరోవైపు ఉన్నా వ్యవసాయ శాఖ ఎందుకు మౌనం పాటిస్తోంది?, తనిఖీలు ఎందుకు జరగడం లేదు?, రైతుల ఫిర్యాదులను ఎందుకు పట్టించుకోవడం లేదు? అనే ప్రశ్నలు మండల వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. ప్రస్తుతం వర్షాకాల సాగు సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రైతులు పెద్దఎత్తున ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేస్తున్నారు. ఈ సమయంలో అక్రమాలు జరిగితే నేరుగా రైతులే నష్టపోయే పరిస్థితి ఉంటుంది. అందువల్ల జిల్లా వ్యవసాయ అధికారి, వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి మండలంలోని అన్ని ఫెర్టిలైజర్ దుకాణాలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న దుకాణాలపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు సరసమైన ధరలకు అందేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. రైతుల ప్రయోజనాలను కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని, ఇప్పటికైనా స్పందించి చర్యలు తీసుకోవాలని రైతులు వేడుకుంటున్నారు.

# జమలాపురంలో రూ.30 లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపన







- ప్రతి గ్రామానికి ప్రత్యేక నిధులతో అభివృద్ధి
- ఓటర్ల జాబితా పరిశీలనలో పార్టీ శ్రేణులు చురుకుగా పాల్గొనాలి ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

పర్వతగిరి, జూన్ 29 (ప్రజాజ్యోతి) : పర్వతగిరి మండలం జమలాపురం గ్రామంలో సోమవారం వర్ధన్నపేట ఎమ్మెల్యే కె ఆర్ నాగరాజు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. రూ.20 లక్షల వ్యయంతో నూతన గ్రామ పంచాయతీ భవనం, రూ.10 లక్షలతో మహిళా కమ్యూనిటీ హాలు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో అనేక గ్రామాలు అభివృద్ధికి దూరమయ్యాయని విమర్శించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి గ్రామానికి ప్రత్యేక నిధులు కేటాయిస్తూ మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తోందన్నారు. అనంతరం సర్ ప్రక్రియపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఇంటింటికి వెళ్లి ఓటర్ల జాబితాలను పరిశీలిస్తూ అర్హులైన ప్రతి ఓటరు పేరు నమోదు అయ్యేలా పార్టీ శ్రేణులు, బూత్ లెవెల్ ఏజెంట్లు కృషి చేయాలని సూచించారు.

ఓటు హక్కు పరిరక్షణ గ్రామ స్థాయి నుంచే ప్రారంభం కావాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జున్ను కనకయ్య, వరంగల్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు ఆయుబ్ , మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, మాజీ జడ్పీటీసీ సింగులాల్, సీనియర్ నాయకులు అనిల్‌రావు, వివిధ గ్రామాల సర్పంచ్ లు, పార్టీ కార్యకర్తలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాల రహిత జిల్లాగా మార్చడమే అందరి లక్ష్యం కావాలి

### జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ









భూపాలపల్లి జిల్లా షాప్ రిపోర్టర్ జూన్ 29 (ప్రజాజ్యోతి) : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో భూపాలపల్లి పట్టణంలో డా. బి.ఆర్. అంబేద్కర్ క్రీడా ప్రాంగణం నుండి డా. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వరకు నషా ముక్త్ భారత్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుతో కలిసి జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు.?ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ నేటి యువత డ్రగ్స్ వంటి వ్యసనాలకు అలవాటైతే వారి ఉజ్వలమైన జీవితాలు పూర్తిగా నాశనమవుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో మాదకద్రవ్యాల నిర్మూలన కోసం పోలీస్, ఎక్సైజ్ శాఖలు సమన్వయంతో పకడ్బందీగా పర్యవేక్షణ చేస్తున్నారని తెలిపారు. శాసన సభ్యులు గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ యువత చెడు మార్గంలో నడిచి తల్లిదండ్రులు పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయొద్దని సూచించారు. జిల్లాలో ఎక్కడైనా డ్రగ్స్ విక్రయాలు జరుగుతున్నట్లైతే పోలీసు, ఎక్సైజ్ శాఖలకు సమాచారం ఇవ్వాలని, అట్టి సమాచారం ఇచ్చిన వ్యక్తుల వివరాలు గోప్యత పాటించనున్నట్లు తెలిపారు. ఇతర రాష్ట్రాల నుండి మన జిల్లాలోకి మాదక ద్రవ్యాలు రవాణా జరుగకుండా పటిష్ఠ నియంత్రణ చేయాలని సూచించారు. మత్తు పదార్థాలు విక్రయించే ద్రోహులను తరిమి కొట్టాలని అన్నారు. అనంతరం ఐడిఓసి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మాదక ద్రవ్యాల నియంత్రణపై సంతకం చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, మహిళా సంక్షేమ శాఖ అధికారి మల్లీశ్వరి, ఎక్సైజ్ ఈ ఎస్ కిరణ్, మున్సిపల్ చైర్మన్ బుర్రా కొమురయ్య, మహాదేవపూర్ సీడీపీఓ ఆర్ రాధిక, ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ సిఐ రాజ సమ్మయ్య, ఎస్సై రబ్బాని, కౌన్సిలర్లు, వివిధ శాఖల అధికారులు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యం

### ప్రజాదివాస్‌లో జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్



భూపాలపల్లి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ జూన్ 29 (ప్రజా జ్యోతి) : జయశంకర్ భూపాలపల్లి జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాదివాస్ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి మొత్తం 19 ఫిర్యాదులను స్వీకరించి, వారి సమస్యలను విన్నారు. ప్రతి ఫిర్యాదును సంబంధిత అధికారులతో సమీక్షించి, తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సంబంధిత పోలీస్ స్టేషన్ల సీఐలు, ఎస్ఐలతో నేరుగా మాట్లాడి, ఫిర్యాదులపై వెంటనే స్పందించి, త్వరితగతిన పరిష్కారం చూపేలా దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, ప్రజలు ఎలాంటి పైరవీలు లేదా మూడో వ్యక్తుల ప్రమేయం లేకుండా నిర్భయంగా పోలీసులను ఆశ్రయించాలని సూచించారు.ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజాదివాస్ కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులను స్వీకరించి, సంబంధిత అధికారుల సమన్వయంతో వాటిని త్వరితగతిన పరిష్కరిస్తున్నామని, ప్రజల సమస్యల పరిష్కారానికి జిల్లా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు.

## బూత్ సమ్మేళనానికి భారీగా తరలిన బీజేపీ శ్రేణులు..





పరకాల జూన్ 29 (ప్రజాజ్యోతి) : హనుమకొండ సుబేదారి ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ గ్రౌండ్స్‌లో సోమవారం నిర్వహించిన బీజేపీ బూత్ సమ్మేళనానికి పరకాల పట్టణ బీజేపీ నాయకులు, కార్యకర్తలు భారీ కాన్వాయ్‌తో తరలి వెళ్లారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించిన పట్టణ అధ్యక్షుడు గాజుల నిరంజన్ మాట్లాడుతూ, బూత్ స్థాయి నుంచే పార్టీని బలోపేతం చేయడమే సమ్మేళనం ప్రధాన లక్ష్యమన్నారు. జాతీయ నాయకత్వం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం పార్టీ శ్రేణులకు కొత్త ఉత్సాహాన్ని నింపుతుందన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, క్రమశిక్షణతో వ్యవహరించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుక్కల విజయ్ కుమార్, ఆకుల లావణ్య శ్రీధర్, పిఏసిఎస్ వైస్ చైర్మన్ చందుపట్ల రాజేందర్ రెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి పాలకుర్తి తిరుపతి, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఏ.కె. విశ్వనాథ రెడ్డి చూపిన మార్గంలోనే సంఘం ముందుకు - ప్రవీణ్ రెడ్డి



భీమదేవరపల్లి జూన్ 29 ప్రజా జ్యోతి : ముల్కనూర్ సహకార బ్యాంకు వ్యవస్థాపక అధ్యక్షుడు కీ.శే. ఏ.కె. విశ్వనాథ రెడ్డి వేసిన బలమైన పునాదులపైనే నేడు ముల్కనూరు సహకార గ్రామీణ పరపతి మరియు మార్కెటింగ్ సొసైటీ ఆధునిక సేవలను అందిస్తూ సభ్యులకు సమర్థవంతంగా సేవలందిస్తోందని సంఘ అధ్యక్షుడు ఎ.ప్రవీణ్ రెడ్డి అన్నారు. ఏ.కె.విశ్వనాథ రెడ్డి 40వ వర్ధంతి సందర్భంగా సోమవారం ముల్కనూరు సొసైటీ ఆవరణలో నివాళి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ సీనియర్ సభ్యులు రఘునాయకుల బాల్ రెడ్డి, దొంగల అయిలయ్య ఏ.కె. విశ్వనాథ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అధ్యక్షుడు ఎ.ప్రవీణ్ రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. ఈ సందర్భంగా ప్రవీణ్ రెడ్డి మాట్లాడు తూ, గత 70 సంవత్సరాలుగా ముల్కనూరు సహకార సంఘం సాధించిన ప్రగతి వ్యవస్థాపక అధ్యక్షుడు ఏ.కె. విశ్వనాథ రెడ్డి దూరదృష్టికి నిదర్శనమని అన్నారు. ఆయన వేసిన పునాదుల వల్లే సంఘం ఆధునిక సేవలు అందిస్తూ సభ్యుల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటోందని తెలిపారు. సంఘం అభివృద్ధి, పారదర్శకత, వినూత్న సేవలను పరిశీలించేందుకు వివిధ అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులు సైతం ముల్కనూరు సహకార సంఘాన్ని సందర్శించడం విశిష్ట గుర్తింపని పేర్కొన్నారు. మండలంలో అత్యధిక సంఖ్యలో బహిరంగ బావులు ఏర్పడటానికి సహకార సంఘం ప్రారంభ దశ నుంచే రైతులకు అందించిన వ్యవసాయ రుణాలే ప్రధాన కారణమని తెలిపారు. వాటి ద్వారా రైతుల ఆదాయం పెరగడంతో పాటు వ్యవసాయాభివృద్ధికి బలమైన పునాది ఏర్పడిందన్నారు. సహకార భావనను పరిరక్షిస్తూ సంఘ అభివృద్ధికి ప్రతి సభ్యుడు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జనరల్ మేనేజర్ మారుపాటి రాం రెడ్డి, ఉపాధ్యక్షుడు గజ్జి వీరయ్య, కార్యవర్గ సభ్యులు, సంఘ సభ్యులు, ఉద్యోగులు పాల్గొన్నారు.





## యూరియా బుకింగ్‌కు సిగ్నల్ కష్టాలు.. వాటర్ ట్యాంక్ ఎక్కిన రైతులు

మునగాల, జూన్ 29 ( ప్రజా జ్యోతి ): మునగాల మండలంలోని ఈదులవాగు తండా గ్రామంలో యూరియా బుక్ చేసుకునేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. యూరియా బుకింగ్ కోసం ఆన్‌లైన్ నమోదు తప్పనిసరి కావడంతో, గ్రామంలో సరైన మొబైల్ నెట్‌వర్క్



అందుబాటులో లేక రైతులు వాటర్ ట్యాంక్‌పైకి ఎక్కి ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో నెట్‌వర్క్ సమస్య కారణంగా నేలపై ఉండి ఆన్‌లైన్ బుకింగ్ చేయడం సాధ్యం కాకపోవడంతో, కొంతమంది రైతులు ప్రాణాలను పణంగా పెట్టి ఎత్తైన వాటర్ ట్యాంక్‌పైకి ఎక్కి మొబైల్ సిగ్నల్ కోసం ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. యూరియా సకాలంలో అందకపోతే పంటలు దెబ్బతినే ప్రమాదం ఉందని, అందువల్ల తప్పనిసరి పరిస్థితుల్లో ఇలా చేయాల్సి వస్తోందని రైతులు వాపోయారు. సంబంధిత అధికారులు స్పందించి గ్రామంలో నెట్‌వర్క్ సమస్యను పరిష్కరించడంతో పాటు యూరియా బుకింగ్ ప్రక్రియను సులభతరం చేయాలని రైతులు కోరుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ సేవలు అందుబాటులోకి వచ్చినప్పటికీ, నెట్‌వర్క్ సౌకర్యాల లేమి రైతులకు ఇబ్బందులు కలిగిస్తోందని వారు ఆందోళన వ్యక్తం చేశారు.

## ట్రాన్స్‌ఫార్మర్‌పై కూలిన స్థంభం.. అధికారుల చొరవతో వెంటనే పునరుద్ధరణ

మునగాల, జూన్ 29 ( ప్రజా జ్యోతి ): మునగాల మండల కేంద్రంలో ఆదివారం రాత్రి వీచిన బలమైన గాలులు, దుమారాల ప్రభావంతో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో గ్రామ వీధులకు నీటి సరఫరా చేసే మోటర్లకు విద్యుత్ అందించే ట్రాన్స్‌ఫార్మర్ పక్కన ఉన్న విద్యుత్ స్థంభం విరిగి ట్రాన్స్‌ఫార్మర్‌పై పడింది. దీంతో ట్రాన్స్‌ఫార్మర్ దెబ్బతిని పనిచేయకుండా పోవడంతో గ్రామంలో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడే పరిస్థితి నెలకొంది. ఈ విషయాన్ని గుర్తించిన గ్రామపంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్ వెంటనే విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ) దృష్టికి తీసుకెళ్లారు. సమాచారం అందుకున్న ఏఈ తక్షణమే





స్పందించి విద్యుత్ శాఖ సిబ్బందిని సంఘటనా స్థలానికి పంపించారు. దెబ్బతిన్న స్థంభాన్ని తొలగించి, దాని స్థానంలో కొత్త విద్యుత్ స్థంభాన్ని ఏర్పాటు చేయడంతో పాటు ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టారు. అధికారుల సత్వర చర్యలతో సమస్యను త్వరితగతిన పరిష్కరించి నీటి సరఫరా వ్యవస్థను పునరుద్ధరించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా వెంటనే స్పందించి చర్యలు తీసుకున్న గ్రామపంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, విద్యుత్ శాఖ ఏఈ, సిబ్బందిని స్థానికులు అభినందించారు. గ్రామ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అధికారులు చూపిన చొరవ ప్రశంసనీయమని గ్రామస్తులు పేర్కొన్నారు.

## ఖమ్మం, హనుమకొండ బస్సు సర్వీసులను పునరుద్ధరించాలి

తుంగతుర్తి, జూన్ 29,(ప్రజా జ్యోతి): తుంగతుర్తి నియోజకవర్గం కేంద్రం నుండి గతంలో నడిచినటువంటి ఖమ్మం– హనుమకొండ బస్సులను పునరుద్ధరించి ప్రయాణికులకు రవాణా సౌకర్యం కల్పించాలని తుంగతుర్తి సర్పంచ్ మల్లెపాక సాయిబాబు సూర్యపేట డిపో మేనేజర్ సునీత ను కోరారు. ఈ మేరకు సోమవారం మేనేజర్ ను కలిసి వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గ కేంద్రం నుండి వైద్య సేవల కోసం ఎక్కువగా ఖమ్మం, వరంగల్, హనుమకొండ వెళ్తుంటారు కాబట్టి ఈ రెండు బస్సులను పునరుద్ధరించాలని కోరారు.



## గ్రామ అభివృద్దే లక్ష్యం: సర్పంచి వంగాల స్రవంతి

చింతపల్లి జూన్ 29(ప్రజాజ్యోతి) దేశానికి పట్టుకొమ్మలైన పల్లెలను అభివృద్ధి పథంలో నడిపేందుకు సర్పంచుకు కీలకపాత్ర పోషిస్తున్నారు.ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ ముందుకు సాగుతున్నారు.అభివృద్ధిలో భాగంగా చింతపల్లి మండలం హోమంతాలపల్లి గ్రామపంచాయతీలో సోమవారం సర్పంచి వంగాల స్రవంతి గ్రామస్తులతో కలిసి పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటడంతో పాటు ఇంటింటికి హరితహారం మొక్కలను పంపిణీ చేశారు.అనంతరం గ్రామంలోని 10 లక్షల వ్యయంతో మహిళ సమైక్య భవనానికి భూమిపూజ చేశారు.గ్రామంలో దీర్ఘకాలికంగా పేరుకుపోయిన సమస్యలతో పాటు మౌలిక వసతులపై దృష్టి సాధిస్తామన్నారు.గ్రామంలో ఎలాంటి సమస్యలు ఉన్న తన దృష్టికి తేవాలని సర్పంచి వంగాల స్రవంతి రమేష్ గ్రామస్తులను కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచి వంగాల స్రవంతి రమేష్,ఉప సర్పంచి మంజుల, పాఠశాల ఉపాధ్యాయులు,పంచాయతీ కార్యదర్శి ప్రియాంక,పలువురు వార్డు సభ్యులు,ఫీల్డ్ అసిస్టెంట్ మహేందర్,గ్రామస్తులు పాల్గొన్నారు.



## ఘనంగా శ్రీ మహాలక్ష్మి అమ్మవారి విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్టా మహోత్సవం

మిర్యాలగూడ, జూన్ 29,( ప్రజాజ్యోతి ): కరుణ గల తల్లి... సిరి మా లచ్చమ్మ తల్లీ... ప్రజలందరిని సుఖశాంతులతో కరుణించా



లంటూ కరములు మోడ్చి వేడుకున్నాడు మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ( బిఎల్ఆర్ ). సోమవారం మిర్యాలగూడ పట్టణంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీలో నూతనంగా నిర్మించిన శ్రీ మహాలక్ష్మీ దేవాలయంలో విగ్రహ ప్రతిష్ట, ధ్వజస్తంభ ప్రతిష్టా కార్యక్రమంలో అత్యంత భక్తిశ్రద్ధలతో వేడుకగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే బిఎల్ఆర్ ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



అనంతరం వేలాదిగా తరలివచ్చిన భక్తులతో కలిసి ధ్వజస్తంభ ప్రతిష్ట మహోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలకు ఆలయాలు ప్రతీకలని అన్నారు. మానవుల్లో ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించి, సక్రమమైన మార్గంలో ధర్మబద్ధంగా నడిచేందుకు దేవాలయాలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. శ్రీ మహాలక్ష్మి అమ్మవారి కటాక్షంతో ప్రజలందరూ ఆయురారోగ్య ఐశ్వర్యాలతో సుఖశాంతులతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ చిలుకూరి సుధా బాలకృష్ణ, వైస్ చైర్ పర్సన్ గుడిపాటి శిరీష నవీన్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్ రెడ్డి, కౌన్సిలర్లు నూకల కవిత, బూడిద సైదులు, దేశిడి శేఖర్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు,ప్రజాప్రతినిధులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

## అసంపూర్తిగా నిలిచిపోయిన రోడ్లను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్

నార్కట్ పల్లి, జూన్ 29 ( ప్రజా జ్యోతి): కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 30 నెలలు గడుస్తున్న ఇంతవరకు రోడ్డు పనులు నత్త నడకన జరుగుతున్నాయని అఖిలపక్ష కమిటీ ఆధ్వర్యంలో సోమవారం టిఆర్ఎస్, బిజెపి, సిపిఐఎం, సిపిఐ, టిడిపి, బి ఆర్మీ, బి ఆర్ ఎస్, మాల మహానాడు ఆధ్వర్యంలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. బ్రాహ్మణ వెల్లంల గ్రామానికి చెందిన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తన సొంత మండలంలో ఏ పని చేయకుండా కాలం కడుతున్నాడని, రెడ్డయ్య కంపెనీ నుండి లారీ యూనియన్ ఆఫీస్ వరకు ఉన్న రోడ్డుసైడు పక్క తవ్వి గుంతల మయం చేశారన్నారు. కామినేని జంక్షన్ నుండి సన్షైన్ కాలనీ వరకు రోడ్డును ఏర్పాటు చేయాలి అన్నారు. మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ ఎన్నికల సమయంలో రోడ్డు మధ్యలో కరెంటు స్తంభాలు వేసి లైట్లు ఏర్పాటు చేయలేదని, గత కొద్ది కాలంగా నల్గొండ చౌరస్తాలో ఎన్ని ప్రమాదాలు జరిగినప్పటికీ, ఈ సంవత్సరం ముగ్గురు మృతి చెందిన అధికారులు మాత్రం ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. ప్రతినిత్యం ప్రజలు దుమ్ము దూళిత వ్యాపారస్తులు అనారోగ్యం పాలవుతున్న, స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఈ రోడ్లపై తిరుగుతున్న వారికి కన పడటంలేద న్నారు ఈ రోడ్లు నిర్మాణం పూర్తి చేసే వరకు అన్ని



పార్టీ నాయకులు, మరియు కుల సంఘాలు, స్థానిక వ్యాపార వర్తకులతో కలిసి ధర్నాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి పార్టీ మండల అధ్యక్షులు మేడబోయిన శ్రీనివాస్ యాదవ్ సిపిఎం పార్టీ మండల కార్యదర్శి చింతపల్లి బయన్న, సిపిఐ మండల సహాయ కార్యదర్శి వెంపటి శ్రీనివాస్, టిడిపి జిల్లా నాయకులు లింగాల యాదయ్య, భీమ్ ఆర్మీ జిల్లా కన్వీనర్ వడ్డేపల్లి నాగరాజు, టిఆర్ఎస్ కవిత చిరుమర్తి ఉపేందర్, మాల మహానాడు జిల్లా అధ్యక్షులు అల్లే పరమేష్, మాజీ ఎంపిటిసి దుబ్బాక శ్రీధర్, కో ఆప్షన్ నెంబర్ వజిత్, ఎస్సీ సెల్ టిఆర్ఎస్ మండల అధ్యక్షుడు చిరుమర్తి సైదులు, పట్టణ సిపిఎం నాయకులు ఆమనగంటి ఐలయ్య, కొప్పు శ్రవణ్ కుమార్, జిల్లా మహిళా నాయకురాలు జాల యాదమ్మ, టిడిపి జిల్లా నాయకులు చింత లక్ష్మణ్, మండల నాయకులు బొబ్బలి మల్లేష్, బిజెపి నాయకులు పాలకుర్తి రమేష్, నోముల రాజు పాల్గొన్నారు.

# ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడాలి

-పాఠశాలలలో మౌలిక వసతులు కల్పించాలి

-సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి

నార్కట్ పల్లి, జూన్ 29 ( ప్రజా జ్యోతి ): మండల కేంద్రంలో జి.ఎస్.ఆర్ ఫంక్షన్ హాల్లో జిట్టా నాగేష్ అధ్యక్షతన జరిగిన సీపీఎం పార్టీ నార్కట్ పల్లి, చిట్యాల, కట్టంగూరు మండలాల సంయుక్త మండల కమిటీ సమావేశానికి పార్టీ జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి గారు హాజరై మాట్లాడుతూ... జిల్లా వ్యాప్తంగా ఉన్నటువంటి విద్యా వ్యవస్థలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు సంక్షేమ హాస్టల్ లు గురుకుల హాస్టల్స్ పూర్తిగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తున్నారని జిల్లా వ్యాప్తంగా 358 పాఠశాలలు 621 ప్రైమరీ స్కూల్ లు ఉన్నాయి. కానీ ఇప్పటి వరకు స్కూల్స్ ప్రారంభమయి 15 రోజులు గడుస్తున్నా ఎక్కడ కూడా విద్యార్థులకి యూనిఫాం,గానీ పాఠ్య పుస్తకాలు గానీ హాస్టల్స్ కి దుప్పట్లు గానీ ఇవ్వలేదు ప్రజా ప్రతినిధుల అండతో పోస్టింగులు డిప్టేషన్ లతో టీచర్ ల కొరత ఉండి పోస్టింగ్స్ లేక 438 పాఠశాలలు మూత పడ్డాయని అందుబాటులో స్కూల్స్ లేక ప్రైవేట్ విద్యా సంస్థల్లో విద్యార్థుల్ని చేర్చి తల్లిదండ్రులు వేల రూపాయల ఫీజులు కట్టలేక ఎస్సీ,ఎస్టీ మైనారిటీల తల్లిదండ్రులు అప్పుల ఊబిలోకి వెళ్లి కుటుంబ భారంగా మారుతున్నారు. అర కొరగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో సంక్షేమ హాస్టల్స్ లో మౌలిక సదుపాయాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు ,ఇంటిగ్రేటెడ్ స్కూల్ 9రకాల



కిట్స్ తో గొప్పలు చెప్పుకుంటున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం విద్య వ్యవస్థ ను పూర్తిగా నిర్వీర్యం చేస్తున్నారని,ఇతర ప్రైవేట్ అద్దె భవనాల్లో ప్రభుత్వ గురుకులాలు అద్దె కు నడుపుతూ... విద్యార్థులకు మెరుగైన వసతులు లేక ఇబ్బందులకు గురవుతు న్నారు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని ప్రభుత్వం తక్షణమే విద్యార్థులకు నోట్ బుక్లు పాఠ్య పుస్తకాలు సామగ్రి సమకూర్చాలని ఈ సందర్భంగా కోరారు. జిల్లా వ్యాప్తంగా సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో ప్రతీ గ్రామంలో స్కూల్స్ సంక్షేమ హాస్టల్స్ని క్షేత్ర స్థాయిలో మౌలిక వసతులు పర్యవేక్షించి ఆందోళనలు చేసి ప్రభుత్వం విద్యా వ్యవస్థ లను కాపాడుకుంటామని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు అవిశెట్టి శంకరయ్య, మండల కార్యదర్శులు చింతపల్లి బయన్న, పెంజర్ల సైదులు, అల్లూరి శీను, చెరుకు పెద్దులు కుమ్మరి శంకర్ జాల యాదమ,కొప్పు శ్రావణ్,దండు రవి, కత్తుల లింగస్వామి,మురారి మోహన్ రామకృష్ణ,జాలా ఆంజనేయులు, బొల్లెద్దు సైదులు, దండు నాగరాజు, శ్రీను, వెంకన్న, నన్నేసాబ్,లింగ స్వామి తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనలు ఉల్లంఘిస్తే... ఉపేక్షించేది లేదు..!

- జిల్లా వైద్యాధికారి రాహుల్

-30 ఆసుపత్రులకు షోకాజు నోటీసులు

మిర్యాలగూడ, జూన్ 29,( ప్రజాజ్యోతి ): నిబంధనలు ఉల్లంఘించే ఆసుపత్రులు, దయాగ్నస్టిక్ సెంటర్ లపై కఠిన చర్యలు తప్పవని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రాహుల్ హెచ్చరించారు. సోమవారం నల్గొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని



ప్రైవేట్ ఆసుపత్రులు, ల్యాబ్‌లపై వైద్యారోగ్య శాఖ అధికారులు ఉక్కుపాదం మోపారు.నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ప్రైవేట్ క్లినిక్‌లు, దయాగ్నస్టిక్ సెంటర్లే లక్ష్యంగా డీఎంహెచ్ఓ రాహుల్ నేతృత్వంలోని ప్రత్యేక బృందం ఆకస్మిక తనిఖీలు నిర్వహిం చారు. ఈ తనిఖీల్లో నిబంధనలఉల్లంఘించిన పలు ఆసుపత్రులపై అధికారులు కఠిన చర్యలు తీసుకున్నారు. సకాలంలో లైసెన్స్ రెన్యువల్ చేసుకోకుండానే వైద్య సేవలు అందిస్తున్న 30 ప్రైవేట్ ఆసుపత్రులను గుర్తించి,వారికి తక్షణమే షోకాజ్ నోటీసులు జారీ చేశారు.ప్రభుత్వ నిబంధనలను బేఖాతరు చేస్తూ, భద్రతా ప్రమాణాలుపాటించకుండా భవనాల సెల్లార్లలో నిర్వహిస్తున్న రెండు ప్రముఖ దయాగ్నస్టిక్ సెంటర్లను అధికారులు అక్కడికక్కడే సీజ్ చేశారు.సెల్లార్లలో ల్యాబ్‌లు నిర్వహించడం నిబంధనలకు విరుద్ధమని,రోగుల భద్రతకు ముప్పు కలిగించేలా వ్యవహరిస్తే సహించేది లేదని డిఎంహెచ్ఓ రాహుల్ స్పష్టం చేశారు. కొద్దిరోజుల క్రితమే మిర్యాలగూడలోని ఓ ప్రముఖ నర్సింగ్ హోమ్ లో నిబంధనలకు విరుద్ధంగా గర్భస్రావాలు చేస్తున్నారన్న సమాచారంతో జిల్లా వైద్యాధికారి రాహుల్ ఆకస్మిక తనిఖీ చేసిన సంగతి విధితమే కాగా మూడు రోజుల వ్యవధిలోనే తిరిగి ప్రైవేట్ ఆస్పత్రులపై దాడులు చేయటం తో డాక్టర్స్ కాలనీలో అలజడి చెలరేగింది. మెడికల్ మాఫియా కు అడ్డాగా మారిన మిర్యాలగూడలో గతంలో రాష్ట్ర మెడికల్ విజిలెన్స్ బృందం తనిఖీలు చేసి ఇలాంటి అనుమతులు, అర్హతలు లేకుండా వైద్యం చేస్తున్న దాదాపు 8 ఆసుపత్రులను గుర్తించి సీజ్ చేసిన పరిస్థితి ఉంది. అయినప్పటికీ కొంతమంది మెడికల్ షాప్ యజమానులు, ల్యాబ్ నిర్వాహకులు యదేచ్ఛగా అర్హతలు లేని వైద్యులతో ఆసుపత్రులు నిర్వహిస్తూ ప్రజల



ప్రాణాలతో చెలగాటమాడుతూ, ప్రజల జేబులు కొల్లగొడుతున్నారని ఆరోపణలు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి. గతంలో అప్పటి జిల్లా వైద్యాధికారి హడావిడి తనిఖీలు చేసి ఆ తర్వాత ఎలాంటి చర్యలు తీసుకోవడంతో కేవలం తనిఖీలు నెలవారి మామూళ్లు మాట్లాడుకునేందుకే అనే ఆరోపణలు ప్రజలు నుండి వ్యక్తమయ్యాయి. ఈసారైనా అక్రమాలను కట్టడి చేస్తూ, నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ఆసుపత్రులపై ఎలాంటి కఠిన చర్యలు తీసుకుంటారో అనేది కొద్ది రోజుల్లోనే స్పష్టం కానుంది. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డి ఎం హెచ్ ఓ , పలువురు వైద్యాధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## పెన్షనర్ల సంఘంలో పుట్టినరోజు వేడుకలు

మునగాల, జూన్ 29( ప్రజా జ్యోతి):- మునగాల మండల కేంద్రంలోని పెన్షనర్ల సంఘ భవనంలో జూన్ నెలలో పుట్టినరోజు జరుపుకున్న పెన్షనర్లకు ఘనంగా జన్మదిన



శుభాకాంక్షలు తెలియజేసి సన్మానించారు. ఈ సందర్భంగా తులసమ్మ, గోపాల్ రెడ్డి, రామ్ రెడ్డి, ఖాజా మోహినుద్దీన్, సంజీవరావు తదితరులను సంఘ ప్రతినిధులు అభినందించి శాలువాలతో సత్కరించారు.

ఈ కార్యక్రమంలో పెన్షనర్ల సంఘ అధ్యక్షుడు అప్పారావు, కార్యదర్శి బుచ్చిరెడ్డి, కృష్ణయ్య, శ్రీనివాసరావు, ఓరుగంటి రవి, కార్యవర్గ సభ్యులు, ఇతర పెన్షనర్లు పాల్గొన్నారు. జన్మదిన వేడుకలను ఆనందోత్సాహాల మధ్య నిర్వహించి, జన్మదినం జరుపుకున్న వారికి శుభాకాంక్షలు తెలియజేశారు.

## తెలంగాణ స్టేట్ చిల్డ్రన్ పార్లమెంట్‌లో ఆత్మకూర్ విద్యార్థిని ప్రతిభ

ఆత్మకూర్ (ఎం), జూన్ 29 (ప్రజా జ్యోతి): తెలంగాణ స్టేట్ చిల్డ్రన్ పార్లమెంట్ కార్యక్రమంలో ఆత్మకూర్ మండలానికి చెందిన విద్యార్థిని రచ్చ సిరి పాల్గొని ప్రతిభ కనబరిచింది. నల్లగొండ జిల్లా నుండి పార్లమెంట్ కార్యక్రమానికి ఎంపికైన రచ్చ సిరి తన నాయకత్వ లక్షణాలు, ప్రజాస్వామ్య విలువలు, సామాజిక బాధ్యతలపై తన ప్రతిభను చాటుకుంది. హైదరాబాద్‌లోని పబ్లిక్ గార్డెన్స్‌లో జూన్ 10, 11 తేదీలలో నిర్వహించిన కార్యక్రమంలో రచ్చ సిరి పాల్గొంది. ఈ సందర్భంగా విద్యార్థుల నైపుణ్యాలను గుర్తించి యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి చేతుల మీదుగా రచ్చ సిరికి సర్టిఫికెట్ అందజేశారు. ఈ కార్యక్రమంలో దేశవ్యాప్తంగా విద్యార్థుల భాగస్వామ్యం, నాయకత్వ లక్షణాలు, సమాజ అభివృద్ధిలో వారి పాత్రపై అవగాహన కల్పించారు. రచ్చ సిరి ప్రతిభ పట్ల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో విద్యార్థులు ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొని తమ ప్రతిభను వెలికితీయాలని సూచించారు.

## దళిత వార్డు అని చిన్న చూపా చైర్మన్ గారు

కాంగ్రెస్ పార్టీ వార్డు అని నిధులు పెట్టడం లేదా??

భువనగిరి,జూన్ 29 (ప్రజాజ్యోతి) భువనగిరి మున్సిపల్ పరిధిలోని 23వ వార్డు,అభివృద్ధిని,పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆ వార్డు కౌన్సిలర్ బర్రె పూజిత – జహంగీర్ ఆవేదన వ్యక్తం చేశారు.మొదటి కౌన్సిల్ సమావేశంలోనే ఎమ్మెల్యే కుంభ అనిల్ కుమార్ రెడ్డి కౌన్సిల్లో పెట్టమని ఎండార్స్ చేసిన,మున్సిపల్ చైర్మన్ దృష్టికి తీసుకెళ్లిన బాబు జగ్జీవన్ రామ్ భవన్ మరమ్మతులు,అభివృద్ధి పనులకు నిధులు కేటాయిం చాలని కోరినా,ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదని ఆమె విమర్శించారు. అదేవిధంగా,23వ వార్డులోని స్థలంలో,ఓంకార్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది ఏర్పాటు చేసే వినాయక మండపానికి శాశ్వత,భవనం నిర్మాణం కోసం ఎమ్మెల్యే నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారని,అయితే ఆ ప్రతిపాదనను,ఇప్పటి వరకు కౌన్సిల్‌లో ప్రవేశపెట్టకపోవడం బాధాకరమని



పేర్కొన్నారు. ప్రతి ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీకి అత్యధిక ఓట్లు అందించిన ఈ వార్డుకు నాలుగు,నెలలు గడిచినా ఒక్క రూపాయి అభివృద్ధి నిధులు కూడా కేటాయిం చకపోవడం,ప్రజలను తీవ్ర నిరాశకు గురిచేస్తోందన్నారు. ప్రజల తాగునీటి సమస్యలను పరిష్కరించేందుకు రెండు బోర్‌వెల్,ఫిల్లింగ్ పనులు చేపట్టాలని చైర్మన్, కమిషనర్,ఇంజనీరింగ్ అధికారులను పలుమార్లు కోరినా స్పందన లేకపోవడం విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ కౌన్సిల్ ఆమోదం కోసం ప్రతిపా దించిన బిల్లులు కోట్ల రూపాయల ప్రజాధనం ఏ విధంగా వృధా అవుతుందో కాంట్రాక్టర్లకు బిల్లులు ఇచ్చి కమిషన్లు,పొందాలని తాపత్రయం తప్ప వార్డుల అభివృద్ధికి నిధులు కేటాయించాలని ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు,అధికారులు స్పందించి 23వ వార్డు అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేసి పెండింగ్‌లో,ఉన్న పనులను వెంటనే ప్రారంభించాలని కౌన్సిలర్ బర్రె పూజిత – జహంగీర్ డిమాండ్ చేశారు.

## కబ్జాకు గురైన మునిసిపల్ పార్కు స్థలాన్ని కాపాడండి

కౌన్సిలర్ జాలిగం విఘ్నేష్

భువనగిరి జూన్ 29 (ప్రజాజ్యోతి) సోమవారం జరిగిన మునిసిపాల్ సాధారణ, సమావేశంలో మాట్లాడుతూ సుమారు 5 కోట్ల విలువ చేసే మునిసిపల్ పార్కు స్థలం,కబ్జాకు గురైందని, వెంటనే విచారణ జరిపి నకిలీ దస్తావేజులను రద్దుచేసి పార్కు స్థలాన్ని కాపాడాలని, గౌరవ ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి పార్కు నిర్మాణం కొరకు నిధులు మంజూరు చేయడానికి సిద్ధంగా ఉన్నారని కానీ ఈ సమస్య వల్ల అది ఆగిపోతుందని కమిషనరు మరియు చైర్ పర్సన్, వైస్ చైర్ పర్సన్ లకు వినతి పత్రం ఇవ్వడం జరిగింది.ఈ సందర్భంగా విగ్నేష్ మాట్లాడుతూ,22, 23 వ వార్డులకి సంబంధించిన ఓంకార్ యూత్ బిల్డింగ్ మరియు బాబు జగ్జీవన్,రాం భవనం రిపేర్లకు నిధులు ఈ సమావేశంలో కూడా మంజూరు చేయకపోవడం బాధాకరమని వెంటనే వాటిని మంజూరు చేయాలనీ కోరడం జరిగింది.దానితో పాటు నూతన డ్రైన్ నిర్మాణం, లో వోల్టేజి సమస్య పరిష్కారం కోసం కొత్త ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేయడంతో పాటు పలు సమస్యల పరిష్కారానికి నిధులు కేటాయించాలని అన్నారు



# సహకార సంఘాల అభివృద్ధికి ప్రభుత్వాలు కృషి చేయాలి

● సొసైటీ చైర్మన్ కన్నయ్య గారి హరికృష్ణ రెడ్డి



**తొగుట, జూన్ 29 (ప్రజాజ్యోతి):** సహకార సంఘాలు అభివృద్ధి సాధిస్తేనే రైతుల అభివృద్ధి జరుగుతుందని, అందుకు అనుగుణంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని సొసైటీ చైర్మన్ కన్నయ్య గారి హరికృష్ణ రెడ్డి సూచించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ కోపరేటివ్ వీక్ సందర్భంగా సోమవారం నుండి వచ్చే నెల ఆరవ తేదీ వరకు కో-ఆపరేటివ్ వీక్ నిర్వహించడం జరుగుతుందని, ఈ సందర్భంగా తొగుట మండలంలోని సొసైటీ కార్యాలయం ఎదుట సొసైటీ జెండాను చైర్మన్ కన్నయ్యగారి హరికృష్ణ రెడ్డి ఆవిష్కరించారు. సహకార సంఘాల ఎదుగుదలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని కోరారు. సహకార వ్యవస్థను బలోపేతం చేయడానికి రైతులందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. దేశంలో 70 శాతం మంది రైతులు వ్యవసాయం మీద ఆధారపడి జీవిస్తున్నారని, సహకార సంఘాలలో రైతులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి తిరిగి రుణాలను పొంది సహకార సంఘాల బలోపేతానికి సహకరించాలన్నారు. సహకార సంఘాలలో రైతులు డిపాజిట్లు చేసినట్లయితే సంఘాలు మరింత అభివృద్ధి చెందుతాయన్నారు. అనంతరం సొసైటీ బలోపేత ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ కుర్మ యాదగిరి, సీఈఓ గంగారెడ్డి, సిబ్బంది చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

### మహిళ భవనానికి భూమి పూజ చేసిన
# సర్పంచ్ ముచ్చమరి అనురాధ రమేష్





**దౌల్తాబాద్, జూన్ 29: (ప్రజా జ్యోతి)** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేస్తుందని సర్పంచ్ ముచ్చమర్రి అనురాధ రమేష్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని మహిళా భవనానికి భూమి పూజ చేశామన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు అన్ని విధాల పథకాలను మంజూరు చేస్తుందని తెలిపారు. తో పాటు మండల వ్యాప్తంగా మహిళలకు మహిళ భవనాలు మంజూరు చేసి వాటి పనులను ప్రారంభిస్తున్నామన్నారు. గ్రామ అభివృద్ధిలో భాగంగా మహిళా సంఘాలకు, గ్రామ ప్రజలకు ఉపయోగపడే విధంగా మహిళా భవనాల నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. భవన నిర్మాణం పూర్తయిన తర్వాత గ్రామంలోని మహిళా సంఘాల కార్యకలాపాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఆది బాలకృష్ణ, పి ఆర్ ఏ ఈ రామ్ కుమార్ , కాంట్రాక్టర్ దిలీప్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రాజగోపాల్ ,వార్డు సభ్యులు అల్వాల వంశీ, తూర్పు శ్రీకాంత్, పాపగొని ప్రవీణ్, కేంసారం నాగరాజు నాయకులు ముక్కెర నర్సింలు, కర్రోల్ల మల్లేశం గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సీఎం సహాయనిది నిరుపేదలకు వరం

● సర్పంచ్ పంజా స్వామి



**దౌల్తాబాద్, జూన్ 29: ( ప్రజా జ్యోతి )** నిరుపేద కుటుంబాలకు సీఎం సహాయనిది వరం లాంటిదని సర్పంచ్ పంజా స్వామి అన్నారు. సోమవారం మండల పరిధిలోని గాజులపల్లి గ్రామంలో ఎమ్మెల్సీ యాదవ రెడ్డి ఆదేశాల మేరకు పంజ లక్ష్మి భర్త దుబ్బయ్య కి 6000 రూపాయల సీఎం సహాయనిది చెక్కును అందజేశామన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపేద కుటుంబాలకు సీఎం సహాయ నిధి ఎంతో ఉపయోగపడుతుందని ఆయన అన్నారు. అలాగే గ్రామంలో ఉన్నటువంటి నర్సరీని పరిశీలించి



ఎప్పటికప్పుడు మొక్కలు పెంపొందించడానికి అన్ని విధాలా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. వర్షాకాలం సీజన్లో రోడ్లకు ఇరువైపులా చెట్లను నాటి వాటిని పెంపొందించాలని సూచించారు. కార్యక్రమంలో మారపాక నరసయ్య, పాశం కనుకయ్య ,పంజ దశరథం ,పి నరసయ్య ,మారపాక కనకయ్య, కొత్త కళావతి, పంజ మంజుల, దాసరి బిక్షపతి, కొత్త యాదగిరి ,దాసరి స్వామి ,పి కనకరాజు, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణాభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి

● ఏఎంసీ చైర్మన్ సంయుక్త శ్రీధర్



**మిరుదొడ్డి, జూన్ 29, (ప్రజాజ్యోతి) :** గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఏఎంసీ చైర్మన్ సంయుక్త శ్రీధర్ అన్నారు. సోమవారం అక్బర్‌పేట భూంపల్లి మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయ నిర్మాణానికి సంబంధించిన స్థలాన్ని అధికారులు,



కాంగ్రెస్ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సంయుక్త శ్రీధర్ మాట్లాడుతూ, తహసీల్దార్ కార్యాలయ నిర్మాణం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 2.25 కోట్ల నిధులు మంజూరు చేసిందని తెలిపారు. గత ప్రభుత్వం కొత్త మండలాలను ఏర్పాటు చేసినప్పటికీ శాశ్వత కార్యాలయాల నిర్మాణాన్ని విస్మరించడంతో ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని విమర్శించారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతంగా అమలు చేస్తోందన్నారు. దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి సహకారంతో తహసీల్దార్ కార్యాలయానికి నిధులు మంజూరయ్యాయని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి వివేక్, చెరుకు శ్రీనివాస్ రెడ్డి చిత్రపటాలకు కాంగ్రెస్ నాయకులు క్షీరాభిషేకం నిర్వహించి ఆనందం వ్యక్తం చేశారు. దుబ్బాక నియోజకవర్గ అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ నాయకులు సమష్టిగా కృషి చేస్తున్నారని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాతూరి వెంకటస్వామి గౌడ్, చంద్రశేఖర్, కమలాకర్, జగన్, ప్రతాప్ రెడ్డి, కుమార్, నర్సింలు, వెంకటేశం,శంకర్ తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# కాసులాబాద్‌లో 65 మంది విద్యార్థులకు బ్యాగుల పంపిణీ

**మిరుదొడ్డి, జూన్ 29,( ప్రజా జ్యోతి):** విద్యార్థులు చదువులో రాణించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని రిటైర్డ్ ఉపాధ్యాయులు ధనుంజయ్ ఆకాంక్షించారు. సోమవారం మండల పరిధిలోని కాసులాబాద్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రిటైర్డ్ ఉపాధ్యాయులు ధనుంజయ్ విద్యార్థులకు ప్రోత్సాహకంగా 65 మంది విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరూ విద్యాభివృద్ధికి తమవంతు సహకారం అందించాలని కోరారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ధనుంజయ్ సేవాభావాన్ని అభినందిస్తూ, విద్యార్థులకు అందించిన సహాయం స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. విద్యార్థులు బ్యాగులు అందుకున్నందుకు ఆనందం వ్యక్తం చేస్తూ ధన్యవాదాలు తెలిపారు.



# సబ్సిడీపై రైతులకు కంది విత్తనాల పంపిణీ

● తొగుట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చెరుకు విజయ్ రెడ్డి

**తొగుట, జూన్ 29 (ప్రజాజ్యోతి):** సబ్సిడీపై రైతులకు కంది విత్తనాల పంపిణీ చేయడం జరిగిందని తొగుట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చెరుకు విజయ్ రెడ్డి తెలిపారు. సోమవారం తొగుట మండల కేంద్రంలో గల రైతు వేదికలో దుబ్బాక నియోజకవర్గ ఆత్మా కమిటీ చైర్మన్ గాంధారి నరేందర్ రెడ్డి, సొసైటీ చైర్మన్ కన్నయ్యగారి హరికృష్ణ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి మోహన్ లతో కలిసి మార్కెట్ కమిటీ చైర్మన్ చెరుకు విజయ్ రెడ్డి రైతులకు సబ్సిడీపై కంది విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం రైతు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యతనిస్తోందని, రైతుల అభ్యున్నతి, వ్యవసాయాభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, రైతులకు నాణ్యమైన విత్తనాలను సబ్సిడీపై అందించడం ద్వారా సాగు వ్యయాన్ని తగ్గించి అధిక దిగుబడులు సాధించేలా ప్రభుత్వం కృషి



చేస్తోందన్నారు. రైతుల ఆర్థిక భారం తగ్గించడమే ప్రభుత్వ లక్ష్యమని, నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉంటేనే అధిక దిగుబడులు సాధించడం సాధ్యమవుతుందన్నారు. అందుకే అర్హత గల ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని వ్యవసాయంలో మరింత పురోగతి సాధించాలని పిలుపునిచ్చారు. రైతులు వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సరైన పంటలను ఎంపిక చేసుకోవడంతో పాటు వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటించాలని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న విత్తనాలు, ఎరువులు, ఇతర వ్యవసాయ సబ్సిడీలను సద్వినియోగం చేసుకోవడం ద్వారా వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవచ్చని పేర్కొన్నారు. వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేయడానికి ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని, రైతుల సంక్షేమం కోసం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ కుర్మ యాదగిరి, మండల వ్యవసాయ అధికారి మోహన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బక్కోళ్ళ నరసింహారెడ్డి, రైతులు లక్ష్మి, శ్రీనివాస్, యాదగిరి, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

# రైతుల ప్రయోజనాలే లక్ష్యంగా వ్యవసాయ మార్కెట్ కమిటీ నిర్ణయాలు

● గోదాం నిర్మాణం, మార్కెట్ స్థలాల పరిరక్షణపై దృష్టి ● మార్కెట్ కమిటీ చైర్మన్ ఐలాపురం కనకయ్య

**దౌల్తాబాద్, జూన్ 29 (ప్రజా జ్యోతి)** రైతుల ప్రయోజనాలే లక్ష్యంగా వ్యవసాయ మార్కెట్ కమిటీ నిర్ణయమని మార్కెట్ కమిటీ చైర్మన్ ఐలపురం కనకయ్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ సాధారణ సమావేశం మార్కెట్ కమిటీ పరిధిలో రైతులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించడం, మార్కెట్ ఆస్తులను పరిరక్షించడం లక్ష్యంగా పలు కీలక తీర్మానాలను సమావేశంలో ఆమోదించమన్నారు . ప్రస్తుతం రైతులు పండించిన ధాన్యాన్ని వర్షాలు, ఇతర ప్రకృతి పరిస్థితుల నుంచి రక్షించుకోవడానికి సరిపడా నిల్వ సదుపాయాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో ఆధునిక గోదాంల నిర్మాణానికి సమావేశం ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. గోదాం నిర్మాణం పూర్తయితే రైతులు తమ ధాన్యాన్ని భద్రంగా నిల్వ చేసుకునే అవకాశం లభిస్తుందని, దీనివల్ల నష్టాలు తగ్గడంతో పాటు మార్కెటింగ్ సౌకర్యాలు కూడా మెరుగుపడతాయని సభ్యులు అభిప్రాయపడ్డారు. అదేవిధంగా, దౌల్తాబాద్, దీపాయంపల్లి, ముబారస్పూర్ గ్రామాల్లో వ్యవసాయ మార్కెట్ కమిటీకి చెందిన స్థలాలను వెంటనే సర్వే చేయించాలని సమావేశంలో తీర్మానించారు. ప్రభుత్వ రికార్డుల ప్రకారం మార్కెట్ కమిటీకి చెందిన భూములను గుర్తించి, వాటిపై ఉన్న అక్రమ ఆక్రమణలను తొలగించి తిరిగి మార్కెట్ కమిటీ ఆధీనంలోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. మార్కెట్ కమిటీ ఆదాయ వనరులను పెంచడం, రైతులకు అవసరమైన మౌలిక సదుపాయాలను దశలవారీగా అభివృద్ధి చేయడం, అవసరమైన సౌకర్యాలను మెరుగుపరచడం వంటి అంశాలపై కూడా సమావేశంలో విస్తృతంగా చర్చించారు. చైర్మన్ ఐలాపురం కనకయ్య మాట్లాడుతూ, రైతుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ



మార్కెట్ కమిటీ ద్వారా అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తామని తెలిపారు. మార్కెట్ కమిటీకి చెందిన ప్రతి అంగుళం భూమిని పరిరక్షించి ప్రజాప్రయోజనాల కోసం వినియోగిస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మద్దెల స్వామి,కార్యదర్శి సుగ్రీవ్ తో పాటు స్థానిక సర్పంచ్ ముచ్చుమర్రి అనురాధ రమేష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# దుబ్బాకలో పెద్ద ఎత్తున చోరీ..

● డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు ● నిందితులను త్వరలోనే పట్టుకుంటాం ● ఘటనా స్థలాన్ని పరిశీలించిన సీపీ రష్మి పెరుమాళ్

**దుబ్బాక ప్రతినిధి, జూన్ 29( ప్రజా జ్యోతి)** దుబ్బాక పట్టణానికి చెందిన చింత రాజ్‌కుమార్ నివాసంలో గుర్తు తెలియని దుండగులు దోపిడీకి పాల్పడ్డారు. బాధితుడి ఇంట్లో ఎవరూ లేని సమయాన్ని ఆసరాగా చేసుకున్న దొంగలు, ఇంటి తాళాలు పగులగొట్టి లోపలికి ప్రవేశించారు. అనంతరం ఇంట్లోని లాకర్‌ను అత్యంత దారుణంగా ధ్వంసం చేసి, అందులో ఉన్న మొత్తంలో 8 లక్షల నగదు, 8 కేజీల వెండి, 1.5 కేజీల బంగారు ఆభరణాలను దోచుకెళ్లారు. ఈ ఘటనపై స్థానిక దుబ్బాక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తును వేగవంతం చేశారు. రంగంలోకి దిగిన పోలీస్ కమిషనర్ చోరీ తీవ్రత దృష్ట్యా సిద్దిపేట సిపి రష్మి పెరుమాళ్ స్వయంగా ఘటనా స్థలాన్ని సందర్శించారు. బాధితుడి నివాసానికి చేరుకున్న సీపీ చోరీ జరిగిన తీరును క్షుణ్ణంగా పరిశీలించారు. దుండగులు ఇంట్లోకి ఏ







మార్గం ద్వారా ప్రవేశించారు.? లాకర్‌ను ఏ విధంగా ధ్వంసం చేశారు.? అనే అంశాలను ఆమె నిశితంగా పరిశీలించి, అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ చోరీకి పాల్పడిన నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను రంగంలోకి



దించాం. క్లూస్ టీమ్ రంగంలోకి దిగి ఆధారాలు సేకరిస్తున్నాయి. త్వరలోనే దొంగలను పట్టుకుని చట్టపరమైన చర్యలు తీసుకుంటాం అని సిపి రష్మి పెరుమాళ్ తెలిపారు. ప్రజలు తమ గ్రామాల్లో, వ్యక్తిగత ఇళ్ల వద్ద సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఈ సీసీటీవీ కెమెరాలు అదనపు నిఘాగా ఉపయోగపడటమే కాకుండా, దొంగతనాలకు ఆస్కారం లేకుండా నమ్మకమైన రక్షణగా నిలుస్తాయని తెలియజేశారు. పోలీసులు రాత్రి వేళల్లో గస్తీని మరింత పెంచడం జరిగిందని ఏసిపి రవీందర్ తెలియజేశారు. బాధితులు తీర్థయాత్రలో ఉన్నట్లు సమాచారం .ఈ కార్యక్రమంలో సిఐలు, ఎస్సైలు, డాగ్ స్క్వాడ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# రైతు మెడకు ఉరితాళ్లు బిగిస్తున్న ప్రభుత్వాలు

● ఏఐకేఎంఎస్ జిల్లా మహాసభలో నేతల నిప్పులు

**కొత్తగూడ, జూన్ 29 ప్రజాజ్యోతి** వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు తాకట్టు పెట్టేలా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలను అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) తీవ్రంగా ఖండించింది. మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండల కేంద్రంలో పాలడుగుల కృష్ణా స్మారక భవనంలో జరిగిన ఏఐకేఎంఎస్ రెండవ జిల్లా మహాసభలో వక్తలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై మండిపడ్డారు. మహాసభకు ముందు స్థానిక సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ కామ్రేడ్ పాలడుగుల కృష్ణ స్మారక భవనం నుంచి ఇండియన్ బ్యాంక్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు బండారి ఐలయ్య అధ్యక్షతన జరిగిన ఈ సభలో ముందుగా జెండాను ఆవిష్కరించి, అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షులు మామిడాల బిక్షపతి మాట్లాడుతూ.. ప్రభుత్వాలు తెస్తున్న నూతన చట్టాలు రైతుల మెడకు ఉరితాళ్లుగా మారుతున్నాయి. వ్యవసాయాన్ని కార్పొరేట్ సంస్థల చేతుల్లో పెట్టి, రైతాంగాన్ని సంక్షోభంలోకి నెడుతున్నాయి. కేంద్రం అనుసరిస్తున్న సామ్రాజ్యవాద, బహుళజాతి సంస్థల విధానాలకు వ్యతిరేకంగా రైతులు పోరాటాలకు సిద్ధం కావాలి" అని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మండలం వెంకన్న మాట్లాడుతూ, ఎంఎస్ స్వామినాథన్ కమిషన్ సిఫారసులను తక్షణమే అమలు చేయాలని, పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య పాల్గొని మాట్లాడుతూ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. ఖరీఫ్, రబీ సీజన్లలో నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది. ఏజెన్సీ ప్రాంతాల్లో మొబైల్ యాప్ ద్వారా యూరియా బుకింగ్ విధానాన్ని రద్దు చేయాలి. పాత పద్ధతిలోనే ఎరువులు పంపిణీ చేయాలి. సన్న ధాన్యానికి బోనస్ చెల్లించి రైతులను ఆదుకోవాలి అని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మహాసభలో ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుజ్జు దేవేందర్, గౌరవ అధ్యక్షులు బూర్క వెంకటయ్య, జిల్లా నాయకులు జడ సత్యనారాయణ, నందగిరి వెంకటేశ్వర్లు, మోకాళ్ళ మురళీకృష్ణ, ఎస్కే బాబు, సక్రు, భూక్య పూర్ణచందర్, సువారపు శ్రీధర్, హెచ్. లింగయ్య, ఇడంపాక శ్రీశైలం, కామ్రేడ్ సూర్యం, పసునూరి రాజమల్లు, తాళ్లపెల్లి ప్రభాకర్, జక్కుల సమ్మయ్య, బుచ్చి రాములు, సోమయ్య, తోకల వెంకన్న, భగవాన్ తదితరులు పాల్గొన్నారు.






### వరంగల్ విజయ సంకల్ప సమ్మేళనానికి తరలివెళ్లిన నరసింహులపేట బిజెపి శ్రేణులు




**నరసింహులపేట, జూన్ 29 (ప్రజా జ్యోతి)** భారతీయ జనతా పార్టీ (బిజెపి) జాతీయ అధ్యక్షులు నితిన్ నబీన్ గారి ఆధ్వర్యంలో వరంగల్‌లో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న 'పోలింగ్ బూత్ అధ్యక్షుల విజయ సంకల్ప సమ్మేళనానికి' నరసింహులపేట మండలం నుండి పార్టీ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. మండల అధ్యక్షుడు సూరబోయిన సతీష్ నేతృత్వంలో మండల పరిధిలోని వివిధ పోలింగ్ బూత్ అధ్యక్షులు, సీనియర్ బిజెపి నాయకులు, కార్యకర్తలు ఒక సమూహంగా వరంగల్ మహాసభకు బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు సూరబోయిన సతీష్ మాట్లాడుతూ.. రాబోయే ఎన్నికల్లో పార్టీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేయడానికి, బూత్ స్థాయిలో పార్టీ విజయానికి తీసుకోవాల్సిన వ్యూహాలపై దిశానిర్దేశం చేయడానికి జాతీయ అధ్యక్షులు నితిన్ నబీన్ గారు వరంగల్ రావడం పార్టీ శ్రేణుల్లో సరికొత్త ఉత్సాహాన్ని నింపిందన్నారు. "బూత్ గెలిస్తేనే.. ఎన్నికల్లో విజయం లభిస్తుంది" అనే నినాదంతో ప్రతి కార్యకర్త సమిష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. వరంగల్ వెళ్తున్న వారిలో మండల పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన పోలింగ్ బూత్ అధ్యక్షులు, బిజెపి ముఖ్య నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

## సొసైటీ సర్వసభ సమావేశం నిర్వహణ

**– రూ 30 లక్షల దీర్ఘకాలిక రుణాలు పంపిణీ**

**– సొసైటీ చైర్మన్ వెంకటరామిరెడ్డి**





**బషీరాబాద్ జూన్ 29 ప్రజాజ్యోతి :** బషీరాబాద్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సొసైటీ సర్వసభ్య సమావేశం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ చైర్మన్ వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ సంఘం ద్వారా రైతులకు పంట రుణాలు 30 లక్షల విలువైన దీర్ఘకాలిక రుణాలు నూతన రైతులకు ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. రైతులు వ్యవసాయ అభివృద్ధికి అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకొని గడువులోగా తిరిగి చెల్లించాలని సూచించారు సహకార సంఘం బలపడాలని సభ్యులందరూ సహకరించాలని కోరారు.

**ఘనంగా సహకార వారోత్సవాలు ప్రారంభం :** బషీరాబాద్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో సోమవారం రోజు సహకార వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ కార్యాలయం ఆవరణలో సొసైటీ చైర్మన్ వెంకట్రామిరెడ్డి జాతీయ సహకార పతాకావిష్కరణ వారోత్సవాలు ప్రారంభించారు. ఈ సందర్భంలో సొసైటీ సీఈఓ వెంకటయ్య మాట్లాడుతూ సొసైటీ ద్వారా సంఘాలు ఏర్పడి నాబార్డ్ నిధులతో రైతులు పాల ఉత్పత్తి వంటి ఎన్నో ఏర్పాటు చేసుకోవచ్చని అన్నారు. మన సొసైటీ ద్వారా పెట్రోల్ బంక్ రైస్ మిల్, గిడ్డంగులు నిర్మించుకోవడం జరిగిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సొసైటీ చైర్మన్ వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ సహకార సంఘాలు రైతుల అభివృద్ధికి కీలక భూమిక పోషిస్తున్నాయని అన్నారు. 29వ తారీకు నుంచి ఏడవ తారీఖు వరకు ఈ వారోత్సవాలు నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. సహకార జాతీయ పథకం 6 రంగులూరా విభజించడం జరిగిందని అన్నారు. రైతులకు రుణాలు ఎరువులు విత్తనాలు తదితర సేవలను పారదర్శకంగా అందిస్తున్న సహకార రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకే కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రజలందరూ సహకార భవనంతో సంఘం అభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మాధవరెడ్డి, సొసైటీ వైస్ చైర్మన్ అజయ్ ప్రసాద్, సొసైటీ సీఈవో వెంకటయ్య, డైరెక్టర్లు శ్రీనివాస్ రెడ్డి, రంగారెడ్డి, హనుమంత్ రెడ్డి, అశోక్ గౌతం, గోపాల్, మాజీ జెడ్పీటీసి శ్రీనివాస్ రెడ్డి, సొసైటీ సిబ్బంది ఫారుక్, బందెప్ప, తుకారం,సురేష్,వ్యవసాయదారులు తదితరులు పాల్గొన్నారు.

## అమ్మ నాన్నల ఆర్థిక స్థితిగతులు మారేదెట్లా!

**- నేను కన్న కలలను నిజం చేయని పరమేశ్వరుడు!**

**- మనస్తాపానికి గురైన గిరిజన బాలిక ఆత్మహత్యాయత్నం**

**- భవనం పైనుంచి దూకడంతో రెండు కాళ్లకు బలమైన గాయాలు**

**- అర్థరాత్రి వేళ చికిత్స కోసం తరలించిన వసతి గృహ నిర్వాహకులు**

**- వివరాలు వెల్లడించిన రూరల్ సీఐ ప్రవీణ్ కుమార్ రెడ్డి**





**తాండూరు జూన్ 29 ప్రజా జ్యోతి :** అమ్మనాన్నల ఆర్థిక స్థితిగతులు మారేదెట్లా తాను కన్న కలలన్నీ నిజం చేయలేని పరమేశ్వరుడు అంటూ తీవ్ర మనస్తవానికి గురైన ఓ గిరిజన బాలిక ఆత్మహత్యయత్నానికి పాల్పడింది. తాండూరు రూరల్ సీఐ ప్రవీణ్ కుమార్ రెడ్డి,స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం వికారాబాద్ జిల్లా దారుర్ మండలం మైలారం తాండకు చెందిన పరమేశ్వరి అనే బాలిక తాండూర్ మండలం జినుగూర్తి గ్రామ సమీపంలోని గిరిజన సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయంలో ఎంపీసీ విభాగంలో 2026-2027 విద్యా సంవత్సరంలో ఇంటర్ సెకండియర్ చదువుతున్నది. అయితే రోజు తన తల్లిదండ్రుల బాగోగుల పైన ఆలోచిస్తూ కుటుంబ ఆర్థిక స్థితిగతులు బాగుపడాలని ఎన్ని సార్లు దేవుడికి విన్నవించిన కనికరించకపోవడం తన కలలు నిజం కావని భావించిన ఆ బాలిక ఆత్మహత్య చేసుకోవడమే సరైన మార్గమని నిర్ణయించుకున్నట్లు బాలిక ఇచ్చిన వాగ్మూలం ప్రకారం తెలుస్తుందన్నట్లు చెప్పారు. ఆదివారం రాత్రి తోటి విద్యార్థులతో కలిసి సరదాగా సంతోషంగా గడిపిన ఆ బాలిక మనసులో ఉన్న ఆ విషయాన్ని బయటికి రాకుండా లో లోన కుమిలిపోతూ చివరిసారిగా మీతో గోరింటాకు పెట్టుకుందాం అంటూ తోటి స్నేహితులతొ ఉన్నట్లు బాలిక రాసిన సూసైడ్ నోటు ద్వారా వెల్లడించారు. ఇందులో ముఖ్యంగా తన చావుకు ఎవరు కూడా కారణం కాదని పోలీసులకు దండం పెడుతున్నాను మా ఉపాధ్యాయులకు గాని మరెవరికి గాని ఎలాంటి సంబంధం లేదు అని కరకండిగా తెలియజేస్తూ ఎర్రటి పెన్నుతో లేఖ రాసినట్లు పోలీసులు వివరించారు. చివరిసారిగా తన ప్రాణ స్నేహితురాలు అయినా స్వప్న ప్రియ ను గుర్తు చేసుకుంటూ అమ్మ నాన్నలకు ఉన్న ఆర్థిక భారం అధిగమించ లేనిదని తాను కన్నా కళలు ఇప్పట్లో నిజం కావని ఎన్ని దేవుళ్లకు ప్రాదేయపడిన ఫలితం లేదని తెలియజేసినట్లు చెప్పారు. ఆదివారం అర్ధరాత్రి అందరూ గాడ నిద్రలో ఉండగా సుమారు 12 గంటల 15 నిమిషాల ప్రాంతంలో ఓ ఇద్దరు బాలికలు వాష్ రూమ్ కోసం అని బయటికి వచ్చిన సమయంలో పెద్ద శబ్దం రావడంతో ఏం జరిగిందని చూసేలోపు ఆ బాలిక కింద దూకినట్లు చెప్పారు. అప్పటికే తీవ్ర గాయాలతో రెండు కాళ్లు విరిగిపోవడంతో పాటు నడుములకు బలమైన గాయం కావడంతో తనను రక్షించండి రక్షించండి అంటూ కేకలు వేసినట్లు చెప్పారు. విషయం తెలుసుకున్న రూరల్ సీఐ ప్రవీణ్ కుమార్ రెడ్డి ఘటన స్థలానికి చేరుకొని బాలిక ఆత్మహత్యకు గల కారణాలను తెలుసుకున్నట్లు చెప్పారు. అక్కడి విద్యార్థులతో పాటు ఉపాధ్యాయ బృందం ద్వారా తెలుసుకున్న సమాచారం ప్రకారం పోలీసుల విచారణలో బాలిక ఆత్మహత్యకు ఎలాంటి అనుమానాలు లేవని ఎవరిపైనా కూడా ఏ విధమైన అనుమానం లేదని భావిస్తూ ఇందులో ఎవరి ప్రమేయం కూడా లేదని నిర్ధారించినట్లు పోలీసులు చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేయనున్నట్లు వివరించారు.

ఆత్మహత్యకు పాల్పడిన బాలికకు మెరుగైన వైద్యం అందించాలి. తాండూర్ ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి తాండూరు మండలం జినుగుర్తి గ్రామ సమీపంలోని గిరిజన బాలికల గురుకుల విద్యాలయంలో ఆత్మహత్యయత్నానికి ప్రయత్నించిన బాలిక మహేశ్వరికి మెరుగైన వైద్యం అందించడంతో పాటు సీఎం సహాయనిధి ద్వారా కూడా ఆర్థిక సహాయం చేసేందుకు చర్యలు తీసుకుంటారని హామీ ఇచ్చినట్లు చెప్పారు.

# ఏ గ్రేడ్ వడ్లను కామన్ గ్రేడ్‌గా మార్చాలని ఒత్తిడి..











**– రైతుల బిల్లులు నెల రోజులుగా పెండింగ్!**

**– 7-8 లారీల రైతులు ఆర్థిక ఇబ్బందుల్లో.. బస్తాల కోత, బిల్లుల నిలుపుదలపై సమగ్ర విచారణ జరపాలని హెచ్ఆర్‌పీఎస్ డిమాండ్**

**పరిగి, జూన్ 29 (ప్రజాజ్యోతి) :** వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండలం ముజాహిద్‌పూర్ ఐకేపీ కేంద్రం నుంచి రైస్ మిల్లులకు తరలించిన రైతుల వడ్ల విషయంలో తీవ్ర అవకతవకలు చోటుచేసుకుంటున్నాయని హ్యూమన్ రైట్స్ పబ్లిక్ ప్రొటెక్షన్ సర్వీస్ (హెచ్ఆర్‌పీఎస్) వికారాబాద్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సయ్యద్ షా మొహమ్మద్ హుస్సైని ఆరోపించారు. రైతుల వడ్లకు సంబంధించిన బిల్లులు నెలరోజులు దాటినా విడుదల కాకపోవడంతో వారు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. హుస్సైని తెలిపిన వివరాల ప్రకారం, ముజాహిద్‌పూర్ ఐకేపీ కేంద్రం నుంచి ఒక లారీలో మొత్తం 772 గ్రేడ్-ఏ వడ్ల బస్తాలను 308.80 క్వింటాళ్ల నికర బరువుతో రైస్ మిల్లులకు పంపించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతి బస్తాలో 40.4 కిలోల బరువు ఉండాల్సి ఉండగా, ఐకేపీ కేంద్రం సూచనల మేరకు రైతులు సుమారు 43 కిలోల చొప్పున వడ్లు నింపి పంపించినట్లు పేర్కొన్నారు. అయినప్పటికీ రైస్ మిల్లులో 772 బస్తాలను 749 బస్తాలుగా నమోదు చేసి, 23 బస్తాలను కోత విధించడం రైతులపై జరుగుతున్న అన్యాయానికి నిదర్శనమని ఆరోపించారు. అదేవిధంగా నారాయణపేట జిల్లాలోని ప్రజ్ఞా పారా బాయిల్డ్ ఇండస్ట్రీ, పెద్దపల్లి జిల్లాలోని శివశంకర ఆగ్రో ఇండస్ట్రీ, పద్మావతి ఇండస్ట్రీ, శ్రీ శ్రీనివాస ఇండస్ట్రీ తదితర రైస్ మిల్లుల్లో ఒక ట్రక్కుకు 18 నుంచి 25 బస్తాల వరకు తరుగు పేరుతో కోత విధిస్తున్నారని తెలిపారు. అంతేకాకుండా గ్రేడ్-ఏ వడ్లను కామన్ గ్రేడ్‌గా మార్చితేనే బిల్లులు చెల్లిస్తామని, లేకపోతే బిల్లులు విడుదల చేయబోమంటూ మిల్లుల యజమానులు రైతులపై ఒత్తిడి తెస్తున్నారని ఆరోపించారు. ఈ సమస్యపై సంబంధిత జిల్లాల సివిల్ సప్లై అధికారులను సంప్రదించినప్పటికీ ఎవరూ స్పష్టమైన సమాధానం ఇవ్వడం లేదని హుస్సైని పేర్కొన్నారు. ఒక శాఖ మరో శాఖపై బాధ్యత నెట్టివేస్తూ రైతులను కార్యాలయాల చుట్టూ తిప్పుతోందని విమర్శించారు. వికారాబాద్ జిల్లా సివిల్ సప్లై అధికారులు తమ పరిధి వికారాబాద్ జిల్లా వరకు మాత్రమేనని, విషయాన్ని సంబంధిత జిల్లాలకు పంపించామని చెప్పారని తెలిపారు. జిల్లా కలెక్టర్‌ను పలుమార్లు సంప్రదించినా సమస్య పరిష్కారానికి చర్యలు కనిపించడం లేదని, రాష్ట్ర సివిల్ సప్లై కమిషనర్‌ను సంప్రదించగా సంబంధిత డీసీఎస్‌ఓలతో మాట్లాడుతానని మాత్రమే హామీ ఇచ్చారని వెల్లడించారు. అయితే ఇప్పటివరకు రైతులకు న్యాయం జరిగేలా ఎలాంటి చర్యలు కనిపించడం లేదన్నారు. ఇది ఒక్క లారీకి సంబంధించిన సమస్య కాదని, దాదాపు 7 నుంచి 8 లారీల రైతుల వడ్లకు ఇదే పరిస్థితి కొనసాగుతోందని తెలిపారు. నెలరోజులుగా బిల్లులు విడుదల కాకపోవడంతో అప్పులు చేసి వ్యవసాయం చేసిన రైతులు తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.

గ్రేడ్-ఏ వడ్లను కామన్ గ్రేడ్‌గా మార్చాలని రైతులపై ఒత్తిడి తెచ్చే అధికారం రైస్ మిల్లులకు ఎవరు ఇచ్చారని, బస్తాల కోతకు బాధ్యులు ఎవరో ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. రైతుల బిల్లులు ఎందుకు నిలిపివేశారో వెల్లడించి, ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని పెండింగ్ బిల్లులను తక్షణమే విడుదల చేయడంతో పాటు, బస్తాల కోతలు, గ్రేడ్ మార్పులు, రైతులపై ఒత్తిడి, అధికారుల నిర్లక్ష్యంపై సమగ్ర విచారణ జరిపి రైతులకు న్యాయం చేయాలని హెచ్ఆర్‌పీఎస్ తరఫున సయ్యద్ షా మొహమ్మద్ హుస్సైని డిమాండ్ చేశారు.

# జులై 1న కొడంగల్‌లో జరిగే 30వ ఆవిర్భావ సభకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆహ్వానం





**గిరిజన హక్కుల అంశాలపై వినతిపత్రం సమర్పించిన ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు**

**పరిగి, జూన్ 29 (ప్రజాజ్యోతి) :** హైదరాబాద్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో సోమవారం లంబాడి హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌పీఎస్) రాష్ట్ర నాయకులు తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ని కలిసి, జులై 1న వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గంలోని మురారి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్న ఎల్‌హెచ్‌పీఎస్ 30వ ఆవిర్భావ దినోత్సవ సభకు ముఖ్య అతిథిగా హాజరుకావాలని ఆహ్వాన పత్రిక అందజేశారు.

ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలోని లంబాడి (గిరిజన) ప్రజల సమస్యలు, హక్కుల పరిరక్షణకు సంబంధించిన పలు అంశాలతో కూడిన వినతిపత్రాన్ని ముఖ్యమంత్రికి సమర్పించారు. తండాల గ్రామపంచాయతీలను రెవెన్యూ గ్రామాలుగా ఏర్పాటు చేయడం, తండాల అభివృద్ధి బోర్డు ఏర్పాటు, లావణి, సీలింగ్, పోడు భూములకు పూర్తి హక్కులతో పట్టాలు ఇవ్వడం, ఐదవ షెడ్యూల్ అమలుతో ఎస్టీలకు రిజర్వేషన్లు కల్పించడం వంటి అంశాలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లారు. అలాగే కేంద్ర ప్రభుత్వం పరిధిలో ఉన్న ఎస్టీ రిజర్వేషన్ల పెంపు, గోర్బోలి భాషను ఎనిమిదవ షెడ్యూల్‌లో చేర్చడం, దేశవ్యాప్తంగా బంజారాలను ఎస్టీ జాబితాలో చేర్చడం వంటి డిమాండ్లపై కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. వినతిపత్రాన్ని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాజేష్ నాయక్, కొడంగల్ మున్సిపల్ వైస్ చైర్మన్ శంకర్ నాయక్, బాపల్లి సంతోష్ నాయక్, ప్రకాష్ రాథోడ్, గోవింద్ నాయక్, నేనవత్ రవి నాయక్, రాథోడ్ సూర్య నాయక్, గణేష్ నాయక్ తదితరులు ముఖ్యమంత్రికి అందజేశారు. వినతిపత్రంపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందిస్తూ, గిరిజనుల హక్కుల పరిరక్షణకు కాంగ్రెస్ ప్రజాపాలన ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు.

# మాటలు చెప్పే మనిషిని కాదు పనిచేసి చూపిస్తా

**-జూనియర్ కాలేజీకి మౌలిక సదుపాయాలు కల్పించాం -30 పడకల ఆసుపత్రిని మంజూరు చేయించా**

**-సంక్షేమ పథకాలు అమలు చేయడమే కాంగ్రెస్ పార్టీకి సాధ్యం -150 కోట్లతో లక్ష్మీనారాయణపూర్ మైల్వార్ వరకు రోడ్ల పనులు ప్రారంభం**

**-ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి బలమైన పునాది -ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్ రెడ్డి**







**బషీరాబాద్ జూన్ 29 ప్రజా జ్యోతి :** బషీరాబాద్ మండలంలోని మైల్వార్, ఎక్మాయ్, నవల్గా, మంతటి గ్రామాల్లో మండల కేంద్రంలో స్పెషల్ ఇంటన్సివ్ రివిజన్ (ఎస్ఆర్ఐ) కార్యక్రమంలో భాగంగా మైల్వార్ గ్రామంలోని బూత్ నంబర్ 237--239, ఎక్మాయ్ గ్రామంలోని బూత్ నంబర్ 241--243, అలాగే మండల కేంద్రంలోని బూత్ నంబర్ 250--256 బూత్‌లలో ఓటరు జాబితా సవరణ ప్రక్రియను సందర్శించి సంబంధిత అధికారుల ద్వారా ఎన్యూమరేషన్ ఫారాలు ఓటర్లకు స్వయంగా అందజేసి తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి ప్రాణాధారం. అర్హత కలిగిన ప్రతి పౌరుడు తన ఓటరు వివరాలనుసరిచూసుకుని, అవసరమైన మార్పులు, చేర్పులు లేదా తొలగింపులకుసంబంధించిన ఫారాలను సక్రమంగా నింపి అధికారులకు అందించాలని కోరారు. బీజేపీ ప్రభుత్వం చెబుతున్నట్లు ఎస్ఆర్ఐ ప్రక్రియ అనేది ప్రజాస్వామ్యం బలపడేట్లు జరగడం లేదు, ఈ సారి జరిగే ఎస్ ఆర్ ఐ ప్రక్రియ బీజేపీ ప్రభుత్వం కనుసైగలో ప్రజాస్వామ్యంకు ముప్పు తేచ్చే విధంగా కొనసాగుతుంది.ఈ నెల రోజుల వ్యవది అనేది మనకి చాల ముఖ్యమైనది. ఈ సమయంలో మన పార్టీ తరుపుననియమించిన బిఎల్ఏలు వారితో కలిసి పని చేయాల్సిన అవసరం ఉంటుంది. మీ పై పూర్తి నమ్మకం ఉంచి పార్టీ బిఎల్ఏలుగా మీకు అవకాశం కల్పించింది, కావున ఓటరు జాబితా పరిశీలనడూప్లికేట్ ఓట్ల గుర్తింపు, అర్హులైన ఓటర్ల నమోదు, చిరునామా మార్పు అనేది పూర్తిగా పార్టీ పరంగా మీరు భాద్యత తీసుకోవాలి. ప్రతి ఓటరు సమగ్రంగా నమోదు కావడం వల్ల ప్రజాస్వామ్య వ్యవస్థ మరింత బలపడుతుందని తెలిపారు..

**సంక్షేమ పథకాలు అమలు చేయడం కాంగ్రెస్ పార్టీకే సాధ్యం :** రాష్ట్రంలో పేదోడు సన్నబువ్వ తినాలనే సంకల్పంతో, రేషన్ కార్డు ద్వారా సన్నబియ్యం అందిస్తున్నాం. లక్ష్మీనారాయణపు మైల్ వార్ వరకు 150 కోట్లతో రోడ్ల పనులు ప్రారంభమయ్యాయి, 50 కోట్లతో జుంటుపల్లి కమాన్ నుంచి మైల్వార్ వరకు డబుల్ రోడ్డు పనులు ప్రారంభించామని పేర్కొన్నారు. బషీరాబాద్‌లో ప్రజలు, ప్రజారోగ్యం బాగుండాలని 30 పడకల ఆస్పత్రిని మంజూరు చేయించాను.నేను మాటలు చెప్పే మనిషిని కాదు, పని చేసి చూపిస్తా.జూనియర్ కాలేజీకి మౌలిక సదుపాయాలు కల్పించాం, తరగతులు ప్రారంభం అయ్యాయి. అలాగే కాంగ్రెస్ ప్రభుత్వ అభివృద్ధి విధానాల ప్రకారం గ్రామ స్థాయి నుంచి ప్రతి పౌరుడికి సంక్షేమ ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. పార్టీలకు అతీతంగా గ్రామాలను అభివృద్ధి చేసుకుందాం, ప్రజల అవసరాలే ప్రాధాన్యంగా అభివృద్ధి పనులు కొనసాగించాలని పిలుపునిచ్చారు. మైల్వార్ గ్రామంలో ఏరువాక పండగ వేడుకలో పాల్గొనడం జరిగింది. బషీరాబాద్ మండల కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే నారాయణరావు మహారాజు నివాసానికి వెళ్లి ఎన్యూమరేషన్ పారాలు అందజేసిన ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్ రెడ్డి, ఈ కార్యక్రమంలో ఎస్ ఆర్ ఐ నియోజకవర్గ కన్వీనర్ పురుషోత్తం రావు,మండల కాంగ్రెస్ అధ్యక్షులు రాజవర్ధన్ రెడ్డి, సొసైటీ చైర్మన్ వెంకటరామిరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ మాధవరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింలు, సొసైటీ వైస్ చైర్మన్ అజయ్ ప్రసాద్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చందర్ నాయక్, తాసిల్దార్ షాహిద బేగం, ఎంపీడీవో సంపత్ కుమార్, బషీరాబాద్ సర్పంచ్ వెంకటేష్ మహారాజ్, మైల్వార్ సర్పంచ్ సీమ సుల్తాన్, ఎక్మాయి శశికళ మధు, నవలగా సర్పంచ్ వెంకటమ్మ, మంతటి సర్పంచ్ గిరిజమ్మ, సర్పంచ్ నరేష్, మైల్వార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సతీష్ కుమార్, శంకరప్ప, బుచ్చిరెడ్డి,కాశప్ప, మాణిక్ రావు, బషీరాబాద్ మాజీ జెడ్పీటీసి శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, నర్సిరెడ్డి, నరేష్, పవన్ ఠాకూర్, ఖాలీద్, శ్రీకాంత్, రాములు, బిఎల్ వో లు గోవింద్ అంజయ్య, బుగ్గప్ప,మండల ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామ నాయకులు,స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## తహసిల్దార్ కార్యాలయాలకు నూతన భవనాల నిర్మాణ మంజూరుకు ట్రెసా హర్షం ..

**– ప్రభుత్వానికి ట్రెసా జిల్లా అధ్యక్షుడు జి.విజయేందర్ కృతజ్ఞతలు – కొత్త మండలాలకు కూడా నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి**



**పరిగి, జూన్ 29 (ప్రజా జ్యోతి) :** పరిగి, దోమ, వికారాబాద్ మండలాల తహసిల్దార్ కార్యాలయాల నూతన భవనాల నిర్మాణానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఒక్కో భవనానికి రూ.2.25 కోట్ల చొప్పున నిధులు మంజూరు చేయడంపై తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ (ట్రెసా) వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు జి విజయేందర్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర శాసనసభ స్పీకర్, పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి, తాండూర్ ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్ రెడ్డి కి.ట్రెసా జిల్లా శాఖ తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వికారాబాద్ జిల్లాలో ఇటీవల నూతన మండలాలుగా ఏర్పాటైన కోట్‌పల్లి, చౌడాపూర్, దుద్యాల్ మండలాలకు కూడా తహసిల్దార్ కార్యాలయాల నూతన భవనాల నిర్మాణం కోసం ప్రభుత్వం త్వరితగతిన నిధులు మంజూరు చేయాలని ఆయన కోరారు. ప్రభుత్వ నిర్ణయంతో రెవెన్యూ సేవలు మరింత సమర్థవంతంగా ప్రజలకు అందుబాటులోకి వస్తాయని విజయేందర్ అన్నారు.

## శ్రీశ్రీశ్రీ బంగారు మైసమ్మ దేవాలయ నవదశ వార్షికోత్సవ పూజలు

**- ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్‌ఎస్ ప్రభాకర్**

**- మాజీ కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకటరావు**





**ఉప్పల్, జూన్ 29, (ప్రజాజ్యోతి):** రామంతాపూర్ డివిజన్ పరిధిలోని శ్రీశ్రీశ్రీ బంగారు మైసమ్మ దేవాలయంలో నిర్వహించిన నవదశ వార్షికోత్సవ మహోత్సవ పూజల్లో మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్‌ఎస్ ప్రభాకర్, మాజీ కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకటరావు లు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌వీఎస్‌ఎస్ ప్రభాకర్ మాట్లాడుతూ గ్రామ దేవతలు మన భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని అన్నారు. గ్రామ దేవతలను భక్తిశ్రద్ధలతో ఆరాధించడం వల్ల ప్రజలు ఆయురారోగ్యాలు, సుఖశాంతులు, ఐశ్వర్యాలతో జీవిస్తారని తెలిపారు. గ్రామ దేవతల ఆశీస్సులతో గ్రామాలు సుభిక్షంగా ఉండి, ప్రజలందరూ సంతోషంగా జీవించాలని ఆకాంక్షించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ప్రభాకర్ కు బండారు శ్రీవాణి వెంకటరావు కు ఘనంగా సత్కారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గౌరవ అధ్యక్షులు పసుల ప్రభాకర్ రెడ్డి, సురేష్ బాబు దయాకర్ రెడ్డి చంద్రశేఖర్ జ్ఞానేశ్వర్ కృష్ణమోహన్ జగదీష్ ప్రజాప్రతినిధులు, భక్తులు, స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బృందావన్ కాలనీలో డ్రైనేజ్ సమస్యను పరిశీలన

**పరిశీలిస్తున్న మాజీ కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్ - వాటర్ వర్క్స్ ఇంజనీర్ నవీన్, కాలనీవాసులు**



**బోయిన్ పల్లి, జూన్ 29 (ప్రజాజ్యోతి) :** ఓల్డ్ బోయిన్ పల్లి డివిజన్ పరిధిలోని బృందావన్ కాలనీలో డ్రైనేజ్ లైన్ బ్లాక్ కావడంతో మురుగునీరు రోడ్డుపైకి వచ్చి స్థానికులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. ఈ సమస్యపై కాలనీవాసులు మాజీ కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై వెంటనే స్పందించిన ముద్దం నర్సింహ యాదవ్, వాటర్ వర్క్స్ ఇంజనీర్ నవీన్‌తో కలిసి సమస్య ఉన్న ప్రాంతాన్ని పరిశీలించారు. డ్రైనేజ్ బ్లాకేజీని అత్యవసరంగా తొలగించి, మురుగునీరు రోడ్డుపైకి రాకుండా శాశ్వత పరిష్కారం చేపట్టాలని అధికారులకు సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరిన ముద్దం నర్సింహ యాదవ్, ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మనోహర్, శ్రీనివాస్, రవికుమార్, కిరణ్, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.





## శివపంచాయతన హనుమాన్ ఆలయంలో ఘనంగా అన్నదాన కార్యక్రమం

**పౌర్ణమి పర్వదినాన భక్తులకు అన్నసేవ.. జంపన ప్రతాప్**

**బోయిన్ పల్లి, జూన్ 29.(ప్రజా జ్యోతి) :** పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని కంటోన్మెంట్ బోర్డు ఆరవ వార్డు సీతారాంపురంలోని శ్రీ శివపంచాయతన హనుమాన్ ఆలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జంపన ప్రతాప్ ముఖ్య అతిథిగా పాల్గొని భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. పౌర్ణమి సందర్భంగా నిర్వ హించే ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను, సేవా భావాన్ని పెంపొందిస్తాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు సాయిబాబా యాదవ్, విజయరాజు, పాండు గోవర్ధన్, సత్యనారాయణ, శ్రీకాంత్ రెడ్డి, ప్రకాశ్, రాజేందర్, చారీ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించి నిర్వాహకులను అభినందించారు.





# ప్రజావాణి' దరఖాస్తులను సత్వరం పరిష్కరించాలి

కరీంనగర్ బ్యూరో, జూన్ 29( ప్రజాజ్యోతి )
ప్రజావాణికి వచ్చే దరఖాస్తులను పెండింగ్ లో ఉంచకుండా క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ చిత్రా మిశ్రా.. అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ప్రజావాణి నిర్వహించగా.. అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, శ్రీనివాస్ రెడ్డి, డీఆర్ఓ స్వామి, వివిధ శాఖల



అధికారులతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రజావాణి కి మొత్తం 225 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో అత్యధికంగా గృహ నిర్మాణ శాఖకు 102, కరీంనగర్ నగరపాలికకు 62 దరఖాస్తులు వచ్చాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వివిధ శాఖలలో పెండింగ్ లో ఉన్న కోర్టు కేసులు, ప్రజావాణి దరఖాస్తులను ఆరోహణ క్రమంలో పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలోని హాస్టళ్ల లో ఏర్పాటుచేసిన ఆర్వో ప్లాంట్ల వివరాలు, విద్యార్థుల సంఖ్య, గతంలో ప్లాంట్లను మరమ్మత్తు చేసిన ఏజెన్సీల వివరాలతో గూగుల్ షీట్ లో నమోదు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రెడ్ క్రాస్ లో సభ్యత్వం తీసుకోవాలి సమాజ సేవ, ఆపదలో ఉన్నవారికి సాయం అందించేందుకు రెడ్ క్రాస్ లో సభ్యత్వం తీసుకోవాలని కలెక్టర్ చిత్రా మిశ్రా పిలుపునిచ్చారు. రాష్ట్రంలోనే మన జిల్లా సభ్యత్వ నమోదులో ముందు ఉండేలా ఉద్యోగులు భాగస్వాములు కావాలని పేర్కొన్నారు.

# మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం.

కరీంనగర్ టౌన్, జూన్ 29 (ప్రజాజ్యోతి )
కరీంనగర్ మెడికవర్ ఆస్పత్రి, సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ ఆధ్వర్యంలో సోమవారం విద్యారణ్యపురి కాలనీలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సింగరేణి ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు మరియు స్థానిక ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి, నిపుణులైన వైద్యులు



ఉచితంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో సాధారణ వైద్యంతో పాటు ఎముకలు–కీళ్ల సమస్యలు, జనరల్ సర్జరీ, స్త్రీ–ప్రసూతి వ్యాధులకు సంబంధించిన పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందచేశారు. రక్తపోటు, మధుమేహం, ఈసీజీ, బీఎంఐ తదితర పరీక్షలను కూడా ఉచితంగా చేశారు. శిబిరంలో డా. లోకేష్ (జనరల్ మెడిసిన్), డా. రాకేష్ (ఆర్థోపెడిక్ & జాయింట్ రీప్లేస్‌మెంట్ నిపుణుడు), డా. అబ్దుల్ వారిస్ ఉస్మానీ (జనరల్ సర్జన్), డా. నయన (స్త్రీ, ప్రసూతి వైద్య నిపుణురాలు) పాల్గొని రోగులను పరీక్షించి వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ మాట్లాడుతూ, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను వారి ప్రాంతానికే తీసుకెళ్లాలనే ఉద్దేశంతో ఇటువంటి ఉచిత వైద్య శిబిరాలను నిరంతరం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ శిబిరంలో ఆసుపత్రి మార్కెటింగ్ మేనేజర్ కోట కరుణాకర్, సంతోష్, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అమ్మ మాట అంగన్‌వాడీ బాట'లో చిన్నారులకు యూనిఫాంల పంపిణీ

రాయికల్, జూన్ 29 (ప్రజా జ్యోతి)
రాయికల్ మండలంలోని రామాజీపేట గ్రామంలో సోమవారం 'అమ్మ మాట అంగన్‌వాడీ బాట' కార్యక్రమాన్ని నిర్వహించారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా రెండున్నర సంవత్సరాల నుంచి ఐదు



సంవత్సరాల వయస్సు గల చిన్నారులకు గ్రామ సర్పంచ్ బెజ్జంకి మోహన్ ఆధ్వర్యంలో యూనిఫాంలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ బెజ్జంకి మోహన్ మాట్లాడుతూ, రెండున్నర నుంచి ఐదు సంవత్సరాల వయస్సు గల పిల్లలను తప్పనిసరిగా అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని తల్లిదండ్రులకు సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలు శారీరకంగా, మానసికంగా అభివృద్ధి చెందడంతో పాటు ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారం, పూర్వ ప్రాథమిక విద్య ద్వారా వారి భవిష్యత్తుకు బలమైన పునాది ఏర్పడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ ఇద్దం సుధీర్ రెడ్డి, వార్డు సభ్యులు కంటే భూమేష్, మర్రి కళ్యాణి తిరుపతి, చిలువేరి జలజ, అంగన్‌వాడీ టీచర్లు జుంబర్తి జమున, నాగెల్లి రమాదేవి, మండల నిషిత, ఆయాలు, తల్లులు తదితరులు పాల్గొన్నారు.

# రాజనగర్, అల్లీపూర్ గ్రామాల్లో అభివృద్ధి పనులకు శ్రీకారం - ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాల్లో పాల్గొన్న డాక్టర్ సంజయ్ కుమార్

రాయికల్, జూన్ 29 (ప్రజా జ్యోతి)
రాయికల్ మండలం రాజనగర్ గ్రామంలో ఉపాధి హామీ పథకం నిధులతో రూ.15 లక్షల





వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు, మురుగు కాలువ నిర్మాణ పనులకు జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్ భూమిపూజ నిర్వహించారు.
అనంతరం గ్రామానికి చెందిన గంగు నర్సయ్య, బలుసు మధు, శ్రీ రంజిత్‌లకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలియజేసి చీరలను కానుకగా అందజేశారు. అలాగే అల్లీపూర్ గ్రామానికి చెందిన బర్ల సరిత–కిరణ్, మిట్టపల్లి సుజాత–గంగాధర్‌ల ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాలకు హాజరై వారికి శుభాకాంక్షలు తెలియజేసి చీరలను కానుకగా అందజేశారు.ఈ కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ కాటిపెల్లి గంగారెడ్డి, పాక్స్ చైర్మన్లు ధీటి రాజిరెడ్డి, ఏనుగు మల్లారెడ్డి, రాజలింగం, సర్పంచులు రాజేష్, గౌతమి వెంకటేష్, ఉప సర్పంచ్ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ రాజన్న, మాజీ ఎంపీటీసీ విజయలక్ష్మి వెంకటేష్, వార్డు సభ్యుడు రవి, నాయకులు స్వామి, ప్రసాద్, రామస్వామి, రవీందర్ రావు, కోల శ్రీనివాస్, రాజిరెడ్డి, స్వామిరెడ్డి, ప్రసాద్, సాగర్ రావు, ముఖీద్,
రామ్ రెడ్డి, రమేష్, తిరుపతి గౌడ్, అజాజ్, సత్తన్న, సతీష్, రోజా, శ్రీనివాస్, సంజీవ్ రావు, లవన్, నరేష్, వేణు, మహిళలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అత్యవసర సమయంలో రక్తదానం చేసిన రిపోర్టర్ ఓంకారి శ్రీనివాస్

మెట్‌పల్లి, జూన్ 29, ప్రజా జ్యోతి:
మానవత్వానికి నిలువెత్తు నిదర్శనంగా ప్రజాజ్యోతి డివిజన్ రిపోర్టర్, సామాజిక సేవకుడు ఓంకారి శ్రీనివాస్ అత్యవసర సమయంలో స్పందించి రక్తదానం చేసి మరోసారి తన సేవాభావాన్ని చాటుకున్నారు. మెట్‌పల్లి పట్టణంలోని వెంకట అలేఖ్య నర్సింగ్ హోమ్లో చికిత్స పొందుతున్న స్వప్న అనే మహిళకు అత్యవసరంగా ఓ పాజిటివ్ రక్తం అవసరమైంది. దీంతో రక్తదాత కోసం వెతికిన బాధిత కుటుంబ సభ్యులు రక్తదాతల అనుసంధానకర్త ఉదయ్ కుమార్ ను సంప్రదించారు. విషయం తెలుసుకున్న ఉదయ్ కుమార్ వెంటనే ఓంకారి శ్రీనివాస్‌కు సమాచారం అందించగా, ఆయన ఎలాంటి ఆలస్యం చేయకుండా బ్లడ్ బ్యాంక్‌కు చేరుకుని రక్తదానం చేశారు.
కాగా, రెండు రోజుల క్రితమే తనది ఓ పాజిటివ్ రక్తగ్రూప్ అని, ఎవరికైనా ఎప్పుడైనా అత్యవసరంగా రక్తం అవసరమైతే తనను సంప్రదించాలని ఉదయ్ కుమార్‌కు శ్రీనివాస్ ముందుగానే తెలియజేయడం ఆయన సేవా దృక్పథానికి నిదర్శనంగా నిలిచింది.అత్యవసర సమయంలో వెంటనే స్పందించి రక్తదానం చేసి బాధితురాలి చికిత్సకు తోడ్పడిన ఓంకారి శ్రీనివాస్‌ను బ్లడ్ బ్యాంక్ సిబ్బంది, రక్తదాతల అనుసంధానకర్త ఉదయ్ కుమార్, ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, రోగి కుటుంబ సభ్యులు, స్నేహితులు అభినందించారు. సమాజంలో ప్రతి



ఒక్కరూ స్వచ్ఛంద రక్తదానానికి ముందుకు రావాలని వారు ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

# రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

## ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు

సుల్తానాబాద్, జూన్ 29: (ప్రజా జ్యోతి)
రైతులకు నాణ్యమైన సేవలు అందించడంతో పాటు వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఆధ్వర్యంలో పెట్రోల్, డీజిల్



పంపులను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణా రావు తెలిపారు. సహకార వారోత్సవాల సందర్భంగా సోమవారం సుల్తానాబాద్ మండలం నీరుకుల గ్రామంలో సహకార సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన పెట్రోల్, డీజిల్ బంకును ఆయన ప్రారంభించారు. అంతకుముందు గ్రామంలో సుమారు రూ.50 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్లు, డ్రైనేజీలు తదితర అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు.అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, నియోజకవర్గం లోని 14 సహకార సంఘాల్లో 11 సంఘాలను ఏకం చేసి ఎలిగేడు మండల శివారులో 15 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో ఆధునిక గోదాముల నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల కోసం భారీ స్థాయిలో గోదాముల నిర్మాణానికి శ్రీకారం చుట్టిందన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని



గోదాములు నిర్మించి రైతులకు నిల్వ సౌకర్యాలు అందుబాటులోకి తీసుకువస్తామని పేర్కొన్నారు.నీరుకుల, కోమండ్లపల్లి, రంగంపల్లి, వేగురుపల్లి గ్రామాల ప్రజలకు ఈ పెట్రోల్ బంకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. గర్రెపల్లి నుంచి పెగడపల్లి వరకు రూ.100 కోట్లతో డబుల్ రోడ్డు నిర్మాణ పనులు త్వరలో ప్రారంభమవుతాయని, అలాగే నీరుకుల గ్రామానికి మానేరు తాగునీరు, బస్సు సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కాంపల్లి సతీష్ కుమార్, ఏఎంసీ చైర్మన్ ప్రకాష్ రావు, సింగిల్ విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, సుల్తానాబాద్ మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ, డీసీఓ శ్రీమాల, ఉప సర్పంచ్ దాసరి సతీష్, సీఈవో బూర్గు సంతోష్ కుమార్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దన్నాయక్ దామోదర్ రావు, రైతు సెల్ మండల అధ్యక్షుడు పి. రామన్న, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిలుక సతీష్, మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు అబ్బయ్య గౌడ్, మాజీ సర్పంచుల పురం మండల అధ్యక్షుడు పడాల అజయ్ గౌడ్, పొన్నం చంద్రయ్య గౌడ్, కోటగిరి రమేష్ గౌడ్, గుండేటి దేవేందర్, శ్రీరంగారావు, మున్సిపల్ కౌన్సిలర్లు వర ప్రదీప్, గాజుల రాజమల్లు, చింతల రాజు, సింగిల్ విండో డైరెక్టర్లు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, మండలంలోని పలు గ్రామాల సర్పంచులు, పాలకవర్గ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు, మహిళలు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# దళారులను నివారించడానికే యూరియా యాప్

## చొప్పదండి నియోజకవర్గం లో రైతులకు అందుబాటులో యూరియా బస్తాలు
## రైతులను మభ్యపెట్టి రాజకీయ ఉనికిని చాటుకోవడానికి బిఆర్ఎస్ పార్టీ నాయకుల ప్రయత్నం

గంగాధర జూన్ 29: (ప్రజా జ్యోతి):
తెలంగాణ రాష్ట్రంలో దళారీ వ్యవస్థను నివారించి, రైతులకు సరిపడా యూరియా సరఫరా చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం యూరియా యాప్ ను తీసుకువచ్చిందని,



చొప్పదండి నియోజకవర్గం లో రైతులకు సరిపడా యూరియా అందుబాటులో ఉందని, రైతులను మభ్యపెట్టి తమ రాజకీయ ఉనికిని కాపాడుకోవడానికి బిఆర్ఎస్ పార్టీ నాయకులు ప్రయత్నిస్తున్నారని గంగాధర మండలం కురిక్యాల సింగిల్ విండో చైర్మన్ వెలిచాల తిర్మల్ రావు, చొప్పదండి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తూరి మహేష్ అన్నారు. సోమవారం గంగాధర లోని ప్రజా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ యూరియా యాప్ పనిచేయడం లేదని, యూరియా స్టాక్ లేదని, రైతులు ఇబ్బంది పడుతున్నారని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు అనవసర రాద్ధాంతం చేస్తూ రైతులను మభ్యపెడుతున్నారని దుయ్యబట్టారు. చొప్పదండి నియోజకవర్గం లో సరిపడా యూరియా ఉందని, మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు వస్తే వారికి యూరియా ఇప్పిస్తామని పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో 95% ఇండ్లలో స్మార్ట్ ఫోన్లు వినియోగిస్తున్నారని, మారుతున్న కాలానికి అనుగుణంగా రైతులు కూడా అప్డేట్ అవుతున్నారని, యాప్ లో పేర్లను నమోదు చేసుకుని, సకాలంలో యూరియా తీసుకెళుతున్నారని పేర్కొన్నారు. కెసిఆర్ పదేళ్ల కాలంలో పెద్ద రైతులకు మాత్రమే యూరియా దక్కిందని, చిన్న సన్నకారు రైతులు యూరియా దొరకక ఇబ్బంది పడ్డారని గుర్తు చేశారు. రైతు సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పనిచేస్తున్నారని తెలిపారు. రైతులకు ఏ కష్టం వచ్చినా స్పందించి సమస్యను పరిష్కరిస్తున్న గొప్ప నాయకుడు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అని కొనియాడారు. అకాల వర్షాలు కురిసిన సమయంలో కూడా అర్ధరాత్రి సమయంలో కూడా వరికుప్పల వద్దకు వచ్చి రైతులకు భరోసా కల్పించింది ఎమ్మెల్యే సత్యం అని గుర్తు చేశారు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చేస్తున్న అభివృద్ధి లో తాను ఎక్కడ కనుమరుగవుతానోనని మాజీ ఎమ్మెల్యే రవిశంకర్ కు భయం పట్టుకుందని పేర్కొన్నారు. రవిశంకర్ శాశ్వత మాజీ ఎమ్మెల్యే అవుతాడని జోష్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో నాలుగు మండలాల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మంత్రి మహేందర్, బత్తిని శ్రీనివాస్ గౌడ్, కొమ్మనబోయిన సువిన్ యాదవ్, గోగురి నాగభూషణం రెడ్డి, సర్పంచ్ల సంఘం మండల అధ్యక్షుడు ముద్దం నగేష్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు పురుమల్ల మనోహర్,జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి బైరి సంపత్, రాచమల్ల భాస్కర్,మాజీ జెడ్పిటిసి సత్తు కనకయ్య, గుజ్జుల బాపురెడ్డి,గుడి ప్రవీణ్ రెడ్డి,మేర్గ కొండయ్య, నక్క అనిల్, మల్లయ్య ,అదిపల్లి శ్రీనివాస్ , తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తూ బీఆర్ఎస్ యూత్ నాయకులు

ముస్తాబాద్, జూన్ 29 ( ప్రజా జ్యోతి ):
ముస్తాబాద్ పట్టణంలోని 253 పోలింగ్ స్టేషన్ పరిధి పోతుగల్ రోడ్డు ప్రాంతంలో సోమవారం రోజు బీఎల్ఓ నర్సింలుతో కలిసి ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేస్తూ ఎస్ఐఆర్ (ప్రత్యేక సమగ్ర సవరణ) ప్రక్రియపై బీఆర్ఎస్ పార్టీ యూత్ మండల అధ్యక్షుడు శీలం స్వామి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్యుమరేషన్ ఫారం పూర్తిగా అర్థం కాకపోతే వెంటనే నింపకుండా బీఎల్ఓ మళ్లీ ఇంటికి వచ్చే వరకు వేచి ఉండాలని సూచించారు. ఫారంలో పొరపాట్లు చేస్తే ఎన్నికల నిబంధనల ప్రకారం మరో ఫారం ఇవ్వకపోవచ్చని తెలిపారు. అలాగే ఫారంలో వైట్‌నర్ ఉపయోగించకూడదని, అన్ని వివరాలను జాగ్రత్తగా నమోదు చేయాలని ప్రజలకు సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియను సక్రమంగా పూర్తి చేయడానికి బీఎల్ఓలకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు.



# ఏరువాక పౌర్ణమి సందర్భంగా ఇటిక్యాల సాయిబాబా దేవాలయంలో ఘనంగా ప్రత్యేక పూజలు - అన్నదాన కార్యక్రమం

రాయికల్, జూన్ 29 (ప్రజా జ్యోతి)
రాయికల్ మండలంలోని ఇటిక్యాల గ్రామ సాయిబాబా దేవాలయంలో సోమవారం ఏరువాక పౌర్ణమి సందర్భంగా సాయప్ప ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పండితులు శివశంకర్ శర్మ





ఆధ్వర్యంలో నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులు తమ మొక్కులు చెల్లించుకొని, పిల్లలు, కుటుంబ సభ్యులు సుఖసంతోషాలతో, క్షేమంగా ఉండాలని సాయిబాబా, దత్తాత్రేయ స్వామిని ప్రార్థించారు. అనంతరం భక్తులందరికీ తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. తదుపరి సాయప్ప ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సాయప్ప ట్రస్ట్ వైస్ చైర్మన్ చెన్నమనేని హిమవంతరావు, గ్రామ సర్పంచ్ నీరటి శ్రీనివాస్, గ్రామ సేవా సమితి అధ్యక్షుడు అనుపురం చిన్న లింబాద్రిగౌడ్, ఉప సర్పంచ్ నాగిరెడ్డి సాయిరెడ్డి, మాజీ సర్పంచ్ మరిపెల్లి నారాయణ గౌడ్, ఎలగందుల రమేష్, మహిపాల్ రెడ్డి, పుటుకం రాజారెడ్డి, పోతవేణి రాజేందర్ గౌడ్, సురకంటి నాగిరెడ్డి, చంద్రకంటి రవీందర్, రాజేశం, లక్ష్మయ్య, రమేష్, లింబాద్రిగౌడ్‌తో పాటు మహిళలు, యువకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఉద్యమకారుల భూహక్కుల సాధన కుజూలై 2 నమహాపోరాటం

వేములవాడ,జూన్,29:ప్రజాజ్యో తి.
సోమవారం రోజున వేములవాడ పట్టణం లోని తెలంగాణ రక్షణ సేనపార్టీకార్యాలయంలోతెలంగాణరక్షణసేనవేములవాడమండలం అధ్యక్షులు తోట.కనకయ్య అధ్యక్షతన,సమావేశం జరిగింది తెలంగాణరక్షణసేననియోజకవర్గంఇంచార్జి,సతీష్ మాట్లాడుతు తొలి దశ 1969లో తెలంగాణ ఉద్యమంలోఎంతోమందితెలంగాణఅమరులుఅయ్యారని,మలిదశతెలంగాణరాష్ట్రఉద్యమకారులు1410మందిఅసువులుబాసారని,సబ్బండావర్గాలుఉద్యమంలోపాలుగోన్నారనిఉద్యమములోఅశువులుబసినవారికుటుంబంలకు 250గజాలు జగఇచ్చిడబులు బెడ్రూమ్ఇండ్లుకట్టియ్యాలనిజులై2వతారీకున,భూ,పోరాట,చైర్మన్,బోగే.పద్మఆధ్వర్యంలోతెలంగాణరక్షణసేనరాష్ట్రఅధ్యక్షురాలు,కల్వకుంట్ల.



కవిత అక్క ఆదేశాలు మేరకుఉప్పల్,లో,భగాయత్‌లోజరిగేసమావ ేశంకుభూపోరాటం,ఉద్యమకారులు హాజరు కావాలి అని కోరారు. ఈ సమావేశంలో బోగే పద్మ మా ట్లాడుచు,కవితక్కఆదేశాలుమేర కు,ఉద్యమంనుచేస్తున్నామనిఉద్యమకారులుకు భూమి ఇచ్చేవ రకు పోరాటం ఆగదని, గత ప్రభుత్వంతెలంగాణఉద్యమకారులను మోసం చేసింది అని, రేవంత్ రెడ్డి ప్రభుత్వం వచ్చిన తర్వాత న్యాయం జరుగుతుంది అని ఆశించమని, న్యాయం చే యుటలేదు కాబట్టి ఉద్యమం మొదలు పెట్టమని అని అన్నారు
రేవంత్ రెడ్డి ప్రభుత్వంకేశవ్,రావు
అధ్యక్షతన కమిటీ వేశారని, కేశవ రావు ఉద్యమం లో ఏనాడూ తెలంగాణ ఉద్యమం లో పాల్గొనలే దని, అతని ఉద్యమకారుల బాధలు ఎలాతెలుస్తాయికాలయాపన
కొరకే కమిటీ వేశారని అన్నారు. ఉద్యమం మరోమిలియన్,మార్చ్ తలిపించేల ఉద్యమకారులు హా జరు అయ్యి విజయవంతం చెయ్యాలిఅన్నారు.ఈకార్యక్రమంలో తెలంగాణ రక్షణ సేన నాయ కులు పాలుగోన్నారు.

# వాసంతి దేవి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా విద్యార్థులకు ఆర్థిక సహాయం

ఇల్లంతకుంట జూన్ 29(ప్రజజ్యోతి)
రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలోని దాచారం ఉన్నత పాఠశాలలో సోమవారం రోజు వాసంతి చారిటబుల్ ట్రస్ట్ ఎస్ వెంకట రామారావు రావు ఎడ్యుకేషనల్ స్కాలర్షిప్ వారి ద్వారా పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు రాణి అధ్యక్షతన గత సంవత్సరం




2025--26 పదవ తరగతి లో ఉత్తమ మార్కులతో ఉత్తీర్ణులైన ముగ్గురికి విద్యార్థులకు ఒక లక్ష రూపాయలు(100000) ప్రథమ స్థానం పొందిన విద్యార్థికి 50.000 వేల రూపాయల బహుమతి .రెండవ స్థానం 30.000 రూపాయలు.మూడవ స్థానం పొందిన విద్యార్థికి గాను 20.000 రూపాయలను అందించిన వాసంతి చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు భారత్ రావు శరత్ రావు ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కుడుముల రేణుక నాగరాజు మాట్లాడుతూ ఈ ట్రస్ట్ ద్వారా గత ఐదు సంవత్సరాలుగా విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించడం ఎంతో గర్వంగా ఉంది అని మీకు గ్రామస్తుల అందరితరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను అన్నారు ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ మీరు విద్యార్థులను ప్రోత్సహించే తీరుతో పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరిగిందని తెలిపారు ట్రస్ట్ నిర్వాహకులు భారత్ శరత్ రావు లు మాట్లాడుతూ విద్యార్థులు ఇంకా శ్రమించి చదివి ఎక్కువ మార్కులు సాధించాలని కోరారు ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రాణి విద్యాకమి టి చైర్మన్ ముత్యాలు ఉప సర్పంచ్ అనిత ఉపాధ్యాయులు తుంకుంట నరేందర్ రెడ్డి దావీదు శ్రీను ఆనంద్ శ్రీనివాస్ సంజీవ్ సురేష్ శ్రవణ్ విద్యార్థులు పాల్గొన్నారు

## ఉద్యమకారులను మోసం చేసిన కాంగ్రెస్

● టిఆర్ఎస్ నేత జగదీష్

వైరా 29 ప్రజా జ్యోతి కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులను నిలువునా మోసం చేసిందని తెలంగాణ రక్షణ సేన (టిఆర్ఎస్) వైరా నియోజకవర్గ ఇన్చార్జ్ గౌరవరపు జగదీష్ అన్నారు. ఎన్నికలకు ముందు ఎనుముల రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే, ఉద్యమకారులకు ఇళ్ళ స్థలాలు, ఇండ్లు, పెన్షన్లు, అమరుల కుటుంబాలకు ఉద్యోగాలు ఇస్తామని బూటకపు వాగ్దానాలు చేశారని గద్దెనెక్కిన తర్వాత, ఉద్యమకారులను ఈగలను తీసి పక్కన పెట్టినట్టు పెట్టారని విమర్శించారు. ఉద్యమకారులు త్యాగాలు చేసి నిర్బంధాలను ఎదుర్కొని జైలు జీవితాలు గడిపి కుటుంబాలకు దూరమై కష్ట, నష్టాలను తట్టుకొని తెలంగాణ సాధించే వరకు పోరాడారని, వారి పోరాట ఫలితంగా తెలంగాణ వస్తే తెలంగాణ ఉద్యమంతో సంబంధంలేని రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి సీట్లో కూర్చొని ఎంజాయ్ చేస్తున్నాడని ఎద్దేవ చేశారు. కెసిఆర్ పదేళ్ల పాలనలో ఉద్యమకారులకు ద్రోహం జరిగిందని, అదే ద్రోహాన్ని రేవంత్ రెడ్డి కొనసాగిస్తున్నాడని అన్నారు. ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉద్యమకారులు పోరాడుతారని తెలిపారు. టిఆర్ఎస్ అధినేత్రి కలవకుంట్ల కవితమ్మ ఇచ్చిన పిలుపుమేరకు జూలై 2న హైదరాబాదు ఉప్పల్ బాగాయత్ లో ఉద్యమకారులతో నిరసన దీక్ష కొనసాగుతున్నట్టు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న తెలంగాణ సాధన ఉద్యమకారులు వేలాదిగా తరలివచ్చి హక్కుల పోరాట ధర్నాలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. రాబోవు దసార్వత్రిక ఎన్నికల్లో టిఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తే, ఉద్యమకారులకు ప్రతి నెల గౌరవ వేతనాలు ఇచ్చి, ప్రతి ఉద్యమకారుడుకి సమరయోధ తామరపత్రాన్ని అందించి వారి ఆత్మ గౌరవాన్ని కాపాడుతామని తెలిపారు.

## చేనేత సంఘ మండల అధ్యక్షునిగా పర్వతం వేణుగోపాలరావు



ఎరుపాలెం ప్రజాజ్యోతి. మండల చేనేత సంఘ అధ్యక్షునిగా సఖినవీడుకు చెందిన పర్వతం వేణుగోపాలరావు సోమవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంఘ వైస్ చైర్మన్‌గా ఆదయ్య, సెక్రటరీగా రావిలాల శ్రీను ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. నూతన కమిటీ చేనేత కార్మికుల సంక్షేమం, వారి సమస్యల పరిష్కారం, చేనేత రంగ అభివృద్ధికి కృషి చేయాలని ఈ సందర్భంగా పలువురు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ రామ కోటేశ్వరరావు, ఉప సర్పంచ్ల సంఘం ఎరుపాలెం మండల అధ్యక్షుడు యరమల విజయభాస్కర్ రెడ్డి, మాజీ సర్పంచ్ పవన్ కుమార్, నాలుగో వార్డు సభ్యుడు వేమిరెడ్డి కృష్ణారెడ్డి, కుప్పాల లక్ష్మి తదితరులు పాల్గొని నూతనంగా ఎన్నికైన నాయకత్వానికి శుభాకాంక్షలు తెలిపారు.

## పేద విద్యార్థులకు చేయూతగా కొనకళ్ళ సుధ

● గంగారం ప్రాథమిక పాఠశాలలో, విద్యార్థుల నోట్స్‌లు పంపిణీ




సత్తుపల్లి జూన్29(ప్రజాజ్యోతి) పేద విద్యార్థులకు చేయూత అందించాలని, సత్తుపల్లి పట్టణానికి చెందిన సుధా హెర్బల్ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ కొనకళ్ల సుధారాణి అన్నారు. సోమవారం ఆమె గంగారం లోని ప్రాథమిక పాఠశాలలో 50 మంది విద్యార్థులకు నోట్స్ లు పంపిణీ చేశారు. అలాగే పాఠశాలలో ఔషధ మొక్కలు నాటి,మొక్కల ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద విద్యార్థులకు తగిన ప్రోత్సాహం ఇవ్వాలని, అప్పుడే వారు చదువులో రాణింగలుగుతారని సుధారాణి అన్నారు. విద్యను మించింది ఏదీ లేదని, పేదరికం వల్ల ఏ ఒక్కరూ చదువుకు దూరం కావొద్దన్నారు .ఈ కార్యక్రమంలో పాఠశాలలోని ఉపాధ్యాయులు, చిన్నారులు పాల్గొన్నారు.

## నూతన ఎంపీడీఓ శ్రీదేవిని మర్యాదపూర్వకంగా కలిసిన కాంగ్రెస్ పార్టీ సర్పంచులు



టేకులపల్లి,జూన్ 29, ప్రజాజ్యోతి: టేకులపల్లి మండల నూతన ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించిన శ్రీదేవిని సోమవారం కాంగ్రెస్ పార్టీ సర్పంచులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.ఇల్లందు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకుడు కోరం సురేందర్ సమక్షంలో మండలంలోని సర్పంచులను నూతన ఎంపీడీఓకు పరిచయం చేశారు.ఈ సందర్భంగా సర్పంచులు శాలువాతో శ్రీదేవిని ఘనంగా సన్మానించి, మండల అభివృద్ధి కార్యక్రమాల్లో తమ



పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.అనంతరం ఎంపీడీఓ శ్రీదేవి మాట్లాడుతూ గ్రామాల సమగ్ర అభివృద్ధికి ప్రజాప్రతినిధులు,అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ, స్థానిక పరిపాలన బలోపేతం, ప్రభుత్వ సంక్షేమ పథకాల సమర్థ అమలు,ప్రజలకు వేగవంతమైన, మెరుగైన సేవలు అందించేందుకు సర్పంచులు చొరవ చూపాలని కోరారు.గ్రామీణాభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని,ప్రజల సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని ఆమె పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు లక్కినేని శ్యామ్,ఆత్మ కమిటీ చైర్మన్ మంగీలాల్,కాంగ్రెస్ పార్టీనాయకులుఈది గణేష్, పోశాలు, భద్రు,సుధాకర్, నగేష్, సుఖ్య, బన్సీలాల్, కోటి,శంకర్‌తో పాటు పలువురు సర్పంచులు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రతిభకు నగదు పురస్కారాలు

మధిర ప్రజాజ్యోతి స్థానిక రిక్రియేషన్ క్లబ్ లో సోమవారం క్లబ్ అధ్యక్షులు చావా రామకృష్ణ అధ్యక్షతన 2025-26 విద్యా సంవత్సరంలో మధిర, ఎర్రుపాలెం మండలాల ప్రభుత్వ పాఠశాలలలో, కళాశాలలలో చదివి మండల ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన విద్యార్థులు మరియు ట్రిపుల్ ఐటీ బాసర లో సీట్లు సాధించిన విద్యార్థులకు నగదు పురస్కారాలు అందజేసే కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతిభగల విద్యార్థులను ప్రోత్సహించడం, ఆర్థిక చేయూతనందించటం లో మన క్లబ్ సభ్యులు ముందున్నారని క్లబ్ ఎన్నో సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలు నిర్వహిస్తోందని భవిష్యత్తులో ఇంకా ఎన్నో కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు.ఈ





కార్యక్రమంలో మధిర మండల ప్రథమ ద్వితీయ స్థానాలు సాధించిన మర్లపాడు ఉన్నత పాఠశాల విద్యార్థులు కుమారి నరేడ్ల లక్ష్మీ తిరుష, వడ్డెరపు ఉమాదేవిలతో పాటు త్రిబుల్ ఐటీ బాసర లో సీటు సాధించిన కుమారి పోలారెడ్డి జీవిత రెడ్డి ని నగదు బహుమతులు 10,000/-, 5000/-, 3000/- రూపాయలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మర్లపాడు ప్రధానోపాధ్యాయులు భీమరాజు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల లోని ప్రతిభగల విద్యార్థులను అభినందించడం, నగదు బహుమతులతో సత్కరించడం వారికి ఎంతో స్ఫూర్తినిస్తుందని, ఇంత గొప్ప ఆలోచన చేసిన మధిర రీక్రియేషన్ క్లబ్ వారి సేవలను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు శ్రీ కోటారెడ్డి విద్యార్థుల తల్లిదండ్రులు నరెడ్ల స్వాతి రామకృష్ణారెడ్డి వడ్డెరపు యశోద లు పాల్గొన్నారు.

## ఎఫ్‌పీవో ద్వారా అధునిక వ్యవసాయ పద్ధతుల పరిచయం

● సింగరేణి మండల రైతులకు డ్రోన్ సేవలు ● సొసైటీ చైర్మన్ దుగ్గినేని శ్రీనివాసరావు

కారేపల్లి, జూన్ 29, ప్రజా జ్యోతి: రైతు ఉత్పత్తిదారుల సంస్థ (ఎఫ్.పీ.వో) ద్వారా రైతులకు అధునిక వ్యవసాయ పద్ధతులను పరిచయం చేయనున్నట్లు కారేపల్లి సొసైటీ చైర్మన్ దుగ్గినేని శ్రీనివాసరావు, ఎఫ్.పీ.వో డొమైన్ ఎక్స్ పర్ట్ చావా అరుంధతి లు అన్నారు. సహకార వారోత్సవాలలో భాగంగా రైతు ఉత్పత్తిదారుల సంస్థ, కారేపల్లి సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో వారు మాట్లాడుతూ రైతులకు అధునిక వ్యవసాయ పద్ధతులు పరిచయం చేయటానికి రైతు ఉత్పత్తిదారుల సంస్థ (ఫీూ) ను ప్రభుత్వం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎఫ్ పీవో లో రూ.2 వేలు కట్టి సభ్యత్వం చేరిన రైతులకు అనేక లాభాలు ఉన్నాయన్నారు. రూ. 2వేలు కట్టి సభ్యత్వం చేరిన రైతులకు కేంద్ర ప్రభుత్వం మరో రూ.2వేల అందజేస్తుందని తెలిపారు. 750 మంది సభ్యులుగా చేరే అవకాశం ఉందని 750 మంది రూ.2వేలు చొప్పున రూ.15 లక్షలు కట్టితే కేంద్ర ప్రభుత్వం మరో రూ. 15 లక్షలు ఇస్తుందని దీంతో 30 లక్షలతో ఎఫ్.పీ.వో ద్వారా రైతులకు అవసరమైన అధునిక పరికరాలు, విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అందుబాటులో ఉంచవచ్చున్నారు. రైతులకు పురుగుమందులు పిచికారి చేయటానికి డ్రోన్, హార్వెస్టర్, ట్రాక్టర్ పరికరాలు తక్కువ ధరలో కిరాయి ఇవ్వటం చేయటం ద్వారా రైతు ఉత్పత్తిదారుల సంస్థకు ఆర్థికంగా బలోపేతం అవుతుందన్నారు. వచ్చిన లాభాల పైకంలో సభ్యులుగా ఉన్న వారికి పంచటం జరుగుతుందని తెలిపారు. రైతు ఉత్పత్తిదారుల సంస్థ ద్వారా పెద్ద పరిశ్రమలు సైతం స్థాపించవచ్చని దానికి కేంద్రప్రభుత్వం




7 శాతం వడ్డీకి రుణ సౌకర్యం మరియు 50శాతం సబ్సీడీ సైతం అందజేస్తుందని తెలిపారు. రైతులు తప్పని సరిగా ఎఫ్.పీ.వో ను వినియోగించుకోవాలని దానికి రూ.2వేలు కట్టి సభ్యులుగా చేరాలని సంస్థ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి బొల్లు హనుమంతరావు, డైరక్టర్లు అడ్డగొడ ఐలయ్య, మర్సకట్ల రోషయ్య, దేగల ఉపేందర్, టేకులగూడెం సర్పంచ్ గుమ్మడి సందీఫ్, ఉపసర్పంచ్ నాగేశ్వరరావు లు పాల్గొన్నారు.

## యూరియా యాప్ రద్దయ్యేంత వరకు ఉద్యమిద్దాం: ఏఐకేఎంఎస్ పిలుపు

టేకులపల్లి, జూన్ 29,ప్రజాజ్యోతి: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న యూరియా కొనుగోలు మొబైల్ యాప్ విధానాన్ని వెంటనే రద్దు చేసేంత వరకు రైతాంగం ఉద్యమించాలని అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) జిల్లా కార్యదర్శి ఏనుగు చంద్రారెడ్డి, జిల్లా అధ్యక్షుడు కల్తీ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. సోమవారం ఏఐకేఎంఎస్ టేకులపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో యూరియా మొబైల్ యాప్ విధానాన్ని రద్దు చేయాలని, ఎరువుల ధరలను తగ్గించాలని, ప్రభుత్వం కొనుగోలు చేసిన మొక్కజొన్నకు సంబంధించిన బకాయిలను రైతుల ఖాతాల్లో వెంటనే జమ చేయాలని డిమాండ్ చేస్తూ టేకులపల్లి గ్రామ పంచా యతీ సెంటర్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు.అనంతరం మండల అధ్యక్షుడు గుగులోతు రామచంద్ అధ్యక్షతన జరిగిన సభలో నాయకులు మాట్లాడాతు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, యూరియా కొనుగోలుకు ప్రవేశపెట్టిన మొబైల్ యాప్ రైతులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోందని





అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నెట్‌వర్క్ సమస్యల కారణంగా యాప్ పనిచేయక రైతులు గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోందని తెలిపారు. ప్రస్తుతం ఎకరానికి రెండున్నర యూరియా బస్తాలు మాత్రమే ఇస్తున్నారని, కనీసం 10 బస్తాలైనా అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.మొబైల్ యాప్ విధానాన్ని పూర్తిగా రద్దు చేసి, సబ్సిడీపై ఎరువులను రైతులకు అందుబాటులో ఉంచాలని కోరారు. అలాగే రోలపాడు చెరువుకు సీతారామ ప్రాజెక్టు నీటిని మళ్లించాలని, ప్రభుత్వం కొనుగోలు చేసిన మొక్కజొన్నకు సంబంధించిన బకాయిలను వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు.రైతుల సమస్యలు పరిష్కరించకపోతే ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని, అవసరమైతే జిల్లా కలెక్టరేట్‌ను ముట్టడించేందుకు కూడా వెనుకాడబోమని నాయకులు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ మండల కార్యదర్శి భూక్య హర్జ, సహాయ కార్యదర్శి భూక్య నర్సింగ్, మేకల పొట్టయ్య, బానోతు వెంకట్రాం, ధరావత్ బిక్యా, అనంతోజు చంద్రచారి, భూక్య రామకోటి, ఆంగోతు బిక్యా, కల్తీ బుచ్చిరాములు, మాజీ ఎంపీటీసీ పూనం బోర్రయ్య, మాజీ సర్పంచ్ భూక్య కిర్యతో పాటు పలువురు రైతులు, సంఘం నాయకులు పాల్గొన్నారు.

## ఏజెన్సీ చట్టాలకు పాతర..
# మాంటిస్సోరీ పాఠశాలపై ప్రజావాణిలో ఫిర్యాదు

● జేసీకి వినతిపత్రం అందజేసిన సేవాలాల్ సేన

● నిబంధనలు ఉల్లంఘిస్తున్న ప్రైవేట్ స్కూల్‌ను సీజ్ చేయాలని డిమాండ్

టేకులపల్లి, జూన్ 29,ప్రజాజ్యోతి: టేకులపల్లి మండల కేంద్రంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ఓ ప్రైవేట్ మాంటిస్సోరీ పాఠశాలపై సేవాలాల్ సేన జిల్లా కమిటీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. గిరిజన ప్రాంతాల రక్షణ కోసం అమల్లో ఉన్న ఏజెన్సీ చట్టాలు, విద్యాశాఖ నిబంధనలను ఉల్లంఘిస్తూ పాఠశాల నిర్వహిస్తున్నారని ఆరోపిస్తూ సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్‌కు సేవాలాల్ సేన జిల్లా కార్యదర్శి బాదావత్ సురేష్ నాయక్ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మాంటిస్సోరీ యజమాని ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ పాఠశాలకు జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) అనుమతి తప్ప ఇతర సంబంధిత ప్రభుత్వశాఖల నుంచి చట్టబద్ధమైన అనుమతు లు లేవని ఆరోపించారు. ప్రభుత్వ టేకులపల్లి యూపీఎస్



పాఠశాలకు కేవలం 200 మీటర్ల దూరంలోనే ఈ ప్రైవేట్ పాఠశాల ఏర్పాటు చేయడం విద్యాశాఖ నిబంధనలకు విరుద్ధమని పేర్కొన్నారు. విద్యార్థులకు కనీస ఆటస్థలం కూడా లేకపోవడం,ఫైర్ డిపార్ట్‌మెంట్ నుంచి ఎన్‌వోసీ, భవన దృఢత్వానికి సంబంధించిన ఆర్అండ్బీ ఫిట్‌నెస్ సర్టిఫికేట్, గ్రామ పంచాయతీ అనుమతి, తాగునీరు,పారిశుధ్యానికి సంబంధించిన హెల్త్ అండ్ సానిటేషన్ సర్టిఫికెట్లు లేకుండానే పాఠశాల కొనసాగుతోందని ఆరోపించారు.గిరిజన ప్రాంతాల్లో అమలులో ఉన్న1/70 చట్టానికి సంబంధించిన నిబంధనలను కూడా పట్టించుకోలేదని విమర్శించారు. ఇలాంటి పరిస్థితుల్లో నిరుపేద తల్లిదండ్రుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థుల భద్రతతో చెలగాట మాడుతున్నారని మండిపడ్డారు.సంబంధిత అధికారులు వెంటనే ఉన్నతస్థాయి విచారణ జరిపి, అన్ని నిబంధనలను పరిశీలించి చట్టప్రకారం పాఠశాలను సీజ్ చేయాలని జాయింట్ కలెక్టర్‌ను కోరారు.అధికారులు తక్షణ చర్యలు తీసుకోకపోతే సేవాలాల్ సేన ఆధ్వర్యంలో గిరిజన సంఘాలు, తల్లిదండ్రులను కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సేవాలాల్ సేన టేకులపల్లి మండల అధ్యక్షుడు భానోత్ కిషన్ నాయక్, నాయకులు పవన్ కళ్యాణ్ నాయక్,నరేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## యూరియా కొరత లేదు.. రైతులు ఆందోళన చెందొద్దు

● వ్యవసాయ అధికారి అరుణ్ బాబు

ములకలపల్లి, జూన్ 29 (ప్రజాజ్యోతి): వానాకాలం పంటల సాగుకు అవసరమైన యూరియా మండలంలో సమృద్ధిగా అందుబాటులో ఉందని మండల వ్యవసాయ అధికారి బి. అరుణ్ బాబు తెలిపారు. సోమవారం మండలంలోని జగన్నాథపురం, పొగళ్ళపల్లి రైతు వేదికలో ఏర్పటు చేసిన విత్తన మేళా లో యూరియా బుక్ చేసుకున్న రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు 3,154 బస్తాల యూరియాను ఫెర్టిలైజర్ యాప్ ద్వారా పంపిణీ చేయగా, ప్రస్తుతం సొసైటీలో 984 బస్తాలు నిల్వ ఉన్నాయని చెప్పారు. జగన్నాథపురం, పొగళ్లపల్లి, పూసగూడెం రైతు వేదికల ద్వారా కూడా యూరియా అందుబాటులో ఉంచుతున్నట్లు పేర్కొన్నారు. రైతులు ఫెర్టిలైజర్ యాప్ ద్వారానే యూరియా బుక్ చేసుకోవాలని, ఇప్పటికే యాప్ ఉపయోగిస్తున్న వారు తప్పనిసరిగా అప్డేట్ చేసుకోవాలని సూచించారు. పంటల అవసరాలకు అనుగుణంగా ప్రతి రెండు రోజులకు ఒకసారి కొత్త యూరియా నిల్వలు అందుబాటులోకి వస్తాయని, రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.





## ఈరి పార్థివదేహానికి నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే రాములు నాయక్



కారేపల్లి, జూన్ 29, ప్రజా జ్యోతి: సింగరేణి మండల పరధిలోని అప్పాయిగూడెం పంచాయితీ భిక్య తండా గ్రామానికి చెందిన మండల బిఆర్ఎస్ పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి అజ్మీర వీరన్న తల్లి అజ్మీర ఈరి అనారోగ్యంతో మరణించడంతో సోమవారం వైరా మాజీ ఎమ్మెల్యే లావుడియా రాములు నాయక్ ఆమె పార్థివదేహానికి పూల మాల వేసి నివాళు లార్పించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈకార్యక్రమంలో మాజీ ఆత్మకమిటి చైర్మన్ ముత్యాల సత్యనారాయణ, మాజీ ఎంపీపీ మాలోత్ శకుంతల, మాజీ జెడ్పిటిసి ఉన్న వీరేందర్ ,మాజీ వైస్ ఎంపీపీ రావూరి శ్రీనివాసరావు, మాజీ సొసైటీ వైస్ చైర్మన్ దారావత్ మంగీలాల్, ఏఎంసి డైరెక్టర్ వాంకుడోత్ నరేష్, నాయకులు భూక్య రాంకిషోర్, జర్పుల ప్రసాద్, బానోతు కోటి, గుగులోత్ హారు, వాంకుడోత్ కరణ్ సింగ్, వాంకుడోత్ విజయ్, జూపల్లి రాము, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణిలో ప్రజల నుండి వచ్చిన సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

● ప్రజా సమస్యలను పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యం

● జిల్లా కలెక్టర్ అంకిత్





కొత్తగూడెం కలెక్టరేట్, జూన్ 29,(ప్రజాజ్యోతి) ప్రజల సమస్యలను పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుంచి జిల్లా కలెక్టర్ అంకిత్ అదనపు కలెక్టర్ వేణుగోపాల్ తో కలిసి వినతులు, ఫిర్యాదులను స్వీకరించారు. భూ సమస్యలు, రెవెన్యూ అంశాలు, సంక్షేమ పథకాల అమలు, ఉపాధి, మౌలిక సదుపాయాలు, గృహ నిర్మాణం తదితర శాఖలకు సంబంధించిన సమస్యలను ప్రజలు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రజలు నుండి వచ్చిన సమస్యలను పరిశీలించిన కలెక్టర్ వాటిని పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజల సమస్యల పరిష్కారానికి సమర్థవంతమైన వేదికగా వినియోగించుకోవాలని తెలిపారు. ప్రజల వినతులను కేవలం నమోదు చేయడం కాకుండా వాటి పరిష్కారానికి కార్యాచరణ రూపొందించి ఫలితాలు సాధించేలా అధికారులు పనిచేయాలని సూచించారు. శాఖల మధ్య సమన్వయంతో పనిచేస్తే సమస్యల పరిష్కారం మరింత వేగవంతమవుతుందని , ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యానికి తావు లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

**ప్రజావాణిలో అందిన కొన్ని దరఖాస్తులు:**

చంద్రుగొండ మండలం రుద్రంపూర్ గ్రామపంచాయతీ ప్రజలు గ్రామపంచాయతీ ఏర్పాటైనప్పటి నుంచి ఇప్పటివరకు డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు, ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాలేదని, ప్రత్యేక గ్రామసభ నిర్వహించి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సమర్పించిన దరఖాస్తును పరిశీలించిన జిల్లా కలెక్టర్ తగు చర్యల కోసం చంద్రుగొండ ఎంపీడీవోకు ఎండార్స్ చేశారు. పాల్వంచ మండలం సీతారాంపేటకు చెందిన యానబోయిన మౌనిక తాను 2017లో డిప్లొమా ఇన్ ఫార్మసీ పూర్తి చేశానని, కుటుంబ ఆర్థిక పరిస్థితులు బాగోలేక ప్రభుత్వ వైద్యశాలలో ఫార్మసిస్ట్ ఉద్యోగం కల్పించాలని కోరుతూ సమర్పించిన దరఖాస్తును పరిశీలించి తగు చర్యల నిమిత్తం జిల్లా ఉపాధి కల్పనాధికారికి ఎండార్స్ చేశారు. అశ్వాపురం మండలం కోండికుంట గ్రామపంచాయతీ పరిధిలోని మొండికుంట గ్రామంలో రూ.1.50 కోట్ల వ్యయంతో 2023లో ప్రారంభించిన డ్రైనేజీ నిర్మాణ పనులు ఇప్పటికీ పూర్తి కాకపోవడంతో మురుగునీరు నిల్వ ఉండి దోమల వ్యాప్తి పెరిగి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని గ్రామ సర్పంచ్ సమర్పించిన దరఖాస్తును పరిశీలించిన జిల్లా కలెక్టర్, పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆర్ అండ్ బి శాఖ అధికారులకు ఎండార్స్ చేశారు. బూర్గంపహాడ్ మండలం లక్ష్మీపురం గ్రామంలో తన తండ్రి జక్కం కృష్ణమూర్తి పేరుపై ఉన్న సర్వే నెం. 440/20/అ లోని 4 ఎకరల 27 కుంటల భూమిని వారసత్వంగా తన పేరుపై మార్చి పట్టాదారు పాస్‌బుక్ మంజూరు చేయాలని బూర్గంపహాడ్‌కు చెందిన జక్కం శ్యామ్ సమర్పించిన దరఖాస్తును పరిశీలించి తగు చర్యల కోసం బూర్గంపహాడ్ తహసీల్దార్‌కు ఎండార్స్ చేశారు. మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని చట్టపల్లి ప్రాంతంలో అనుమతులు లేకుండా బహుళ అంతస్తుల భవనాలు నిర్మిస్తున్నారని, వాటిపై తగిన చర్యలు తీసుకోవాలని లింగాల సాయికుమార్ సమర్పించిన దరఖాస్తును పరిశీలించిన జిల్లా కలెక్టర్ తగు చర్యల కోసం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారికి ఎండార్స్ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అత్యవసర సమయంలో రక్తదానం చేసిన రిపోర్టర్ ఓంకారి శ్రీనివాస్

మెట్‌పల్లి, జూన్ 29, ప్రజా జ్యోతి: మానవత్వానికి నిలువెత్తు నిదర్శనంగా ప్రజాజ్యోతి డివిజన్ రిపోర్టర్, సామాజిక సేవకుడు ఓంకారి శ్రీనివాస్ అత్యవసర సమయంలో స్పందించి రక్తదానం చేసి మరోసారి తన సేవాభావాన్ని చాటుకున్నారు. మెట్‌పల్లి పట్టణంలోని వెంకట అలేఖ్య నర్సింగ్ హోమ్లో చికిత్స పొందుతున్న స్వప్న అనే మహిళకు అత్యవసరంగా ఓ పాజిటివ్ రక్తం అవసరమైంది. దీంతో రక్తదాత కోసం వెతికిన బాధిత కుటుంబ సభ్యులు రక్తదాతల అనుసంధాన కర్త ఉదయ్ కుమార్ ను సంప్రదించారు. విషయం తెలుసుకున్న ఉదయ్ కుమార్ వెంటనే ఓంకారి శ్రీనివాస్‌కు సమాచారం అందించగా, ఆయన ఎలాంటి ఆలస్యం చేయకుండా బ్లడ్ బ్యాంక్‌కు చేరుకుని రక్తదానం చేశారు. కాగా, రెండు రోజుల క్రితమే తనది ఓ పాజిటివ్ రక్తగ్రూప్ అని, ఎవరికైనా ఎప్పుడైనా అత్యవసరంగా రక్తం అవసరమైతే తనను సంప్రదించాలని ఉదయ్ కుమార్‌కు శ్రీనివాస్ ముందుగానే తెలియజేయడం ఆయన సేవా దృక్పథానికి నిదర్శనంగా నిలిచింది. అత్యవసర సమయంలో వెంటనే స్పందించి రక్తదానం చేసి బాధితురాలి చికిత్సకు తోడ్పడిన ఓంకారి శ్రీనివాస్‌ను బ్లడ్ బ్యాంక్ సిబ్బంది, రక్తదాతల అనుసంధానకర్త ఉదయ్ కుమార్, ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, రోగి కుటుంబ సభ్యులు, స్నేహితులు అభినందించారు. సమాజంలో ప్రతి ఒక్కరూ స్వచ్ఛంద రక్తదానానికి ముందుకు రావాలని వారు ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.



# ఎస్ఐఆర్ ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ ప్రక్రియ గడువులోగా పూర్తి చేయాలి

రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి
అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష
హాజరైన జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి: ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ ప్రక్రియ గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన




అధికారి సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి, ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించి ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించగా,కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్,స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పై. శ్రీజ,ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య లతో కలిసి హాజరయ్యారు.ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి మాట్లాడుతూ,నిర్ణీత గడువులోగా ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ పూర్తి చేయాలని అన్నారు. జిల్లాల వారీగా ఇప్పటివరకు పూర్తి చేసిన ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ వివరాలు సమీక్షించారు. బూత్ లెవెల్ అధికారులు (బీఎల్ఓలు) తప్పనిసరిగా ఇంటింటికీ వెళ్లి ఫారాలు అందివ్వాలని ఆదేశించారు . బీఎల్ఓ లు మాత్రమే ఫారాలు పంపిణీ చేయాలని స్పష్టం చేశారు. బీఎల్ఓ లు తప్పనిసరిగా టీ షర్ట్, క్యాప్, బ్యాగ్, ఐడీ కార్డులు ధరించాలని తెలిపారు.ప్రజలకు ఎస్ఐఆర్ ప్రక్రియపై సందేహాలు నివృత్తి చేయడానికి 'హెల్ప్ డెస్క్' లు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు.ఎన్యుమరేషన్ యాప్ వినియోగించేందుకు అధికారం కేవలం బీఎల్ఓ లకు మాత్రమే ఉందని స్పష్టం చేశారు.ప్రజలకు ఎస్ఐఆర్ ప్రక్రియపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని తెలిపారు.మీడియా, సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారం కల్పించాలని పేర్కొన్నారు. ఓటర్ల నుంచి తప్పనిసరిగా ఎన్యూమరేషన్ ఫారాలు తిరిగి తీసుకోవాలని తెలిపారు.వీడియో కాన్ఫరెన్స్‌లో ఎన్నికల విభాగం డిటి అన్సారీ,అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బ్యాంకు నుంచి రుణాలు ఇప్పిస్తామని చెప్పి మోసం

## అవర్ ఫుడ్ కంపెనీ సీఈఓ అ రెస్ట్

ఆదిలాబాద్ బ్యూరో, జూన్ 29, (ప్రజా జ్యోతి) రుణాలు ఇప్పిస్తామని చెప్పి బ్యాంకు నుంచి రుణం తీసు కొని తమ ఖాతాలో జమ చే సుకుని లబ్ధిదారుల ను మో సం చేసిన అవర్ ఫుడ్ ప్రైవే ట్ లిమిటెడ్ కంపెనీ సీఈఓ బాలా రెడ్డి ని అరెస్ట్ చేసి రి మాండ్ కు తరలించినట్లు ఉ ట్నూర్ ఏఎస్పి రిత్విక్ సాయి ఐపిఎస్ తెలిపారు. సిరికొండ మండలం సోన్ పల్లి గ్రామాని కి చెందిన జాదవ్ మారుతి S/o పండరి గత 16.01.2023 రోజున అవర్ ఫుడ్ ప్రైవే ట్ లిమిటెడ్ కంపెనీవారు దాల్ మిల్లు మిషిన్ ఎస్ బి ఐ బ్యాంకు లోన్ ద్వారా ఇప్పిస్తా నని చెప్పగా తన కూతురి పేరు మీద ఎస్ బి ఐ బ్యాంకు లోన్ తీసుకొని 3,54,000/ రూపాయలు అవర్ ఫుడ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ అకౌంట్ లో డబ్బులు ట్రాన్స్ఫర్ చేశా రు. కానీ రెండు సంవత్సరాల వరకు కూడా దాల్ మిల్లు మి షిన్ లబ్ధి దారునికి ఇవ్వకుం డా, రుణం డబ్బులు కూడా తిరిగి ఇవ్వకపోవడం వల్ల సిరి కొండ పోలీస్ స్టేషన్ వచ్చి ఫి ర్యాదు చేయగా గత 16-10- 2025 న సిరికొండ ఎస్ ఐ అ వర్ ఫుడ్ ప్రైవేట్ లిమిటెడ్ ఏజెంట్, కంపెనీ సీఈఓ లపై చీటింగ్ కేసు నమోదు చేసి ద ర్యాప్తు చేపట్టి 28 న అవర్ పుడ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపె నీ సీఈఓ అయిన సంగారెడ్డి గ్రామానికి చెందిన బాలారెడ్డి s/o వీరారెడ్డిని అరెస్టు చేసి రి మాండ్ కు తరలించడం జరిగిందని ఏఎస్ పి వివరిం చారు. ఇంకా ఎవరైనా వ్యక్తు లు నిరుద్యోగులను , లేదా సా మాన్య ప్రజలను పథకాల పేరి ట మాయ మాటలు చెప్పి మోసం చేసినట్లు అయితే వారిపై కఠిన చర్యలు తీసు కుంటామని, ఇంకా ఎవరైనా పైన అవర్ ఫుడ్ ప్రైవేట్ లిమి టెడ్ కంపెనీ ద్వారా మోస పో యి నట్లయితే బాధితులు త మ పరిధిలో వచ్చే పోలీస్ స్టే షన్ ను సంప్రదించాలని రిత్వి క్ సాయి తెలిపారు.

# కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు పేదింటి ఆడబిడ్డలకు వరం

## సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలి: రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

రాజేంద్రనగర్,జూన్ 29 (ప్రజా జ్యోతి) కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకాలు పేదింటి



ఆడబిడ్డలకు వరం లాంటివని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ అన్నారు. రంగారెడ్డి జిల్లా గండిపేట మండలానికి చెందిన ప్రభుత్వం ద్వారా మంజూరైన 29 మందికి కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను సోమవారం రాజేంద్ర నగర్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ పథకాలు పేద ప్రజల ఆడబిడ్డలకు వరం లాంటివి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతి ఒక్కరూ సంతోషంగా ఉండాలని ఉద్దేశంతో పేదల కొరకు అనేక సంక్షేమ పథకాలు తీసుకువచ్చారన్నారు. ప్రభుత్వం



ఏర్పడ్డ వెంటనే మహాలక్ష్మి పథకం ద్వారా ప్రతి మహిళకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడం జరిగింది అన్నారు. ప్రతి పేదవాడికి 200 యూనిట్ల ఉచిత కరెంటు ₹500 గ్యాస్ సిలిండర్ లాంటి పథకాలు ప్రవేశపెట్టి నేరుగా పేదలకు అందించడం జరుగుతుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రేషన్ కార్డులు, రైతు భరోసా ఇందిరమ్మ ఇండ్లు, ఆత్మీయ భరోసా పథకాలు తీసుకొచ్చి పేదవారికి అందించడం జరుగుతుందన్నారు. తెల్ల రాయిషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ సన్నబియ్యం పథకాన్ని కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించి ఇవ్వడం జరిగింది అన్నారు. పేదవారు తమ కూతురు పెళ్లిలు చేయాలంటే ఎంతో ఇబ్బందులు పడుతున్నారని గమనించి వారి పెళ్లిలకు ప్రభుత్వం తరఫున ఆదుకోవాలని ఉద్దేశంతోనే కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు తీసుకువచ్చి వారికి అందించడం జరుగుతుందన్నారు. ఈ పథకం ద్వారా పేద మహిళలకు ఎంతో తోడ్పాటు కల్పించిందన్నారు. ఇంకా కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కులు రానివారు నిరాశపడుద్దని విడతలవారీగా వాటిని అధికారులు పరిశీలించి అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణాభివృద్ధి పథకాల్లో తెలంగాణ వెనుకబాటు



మొదటిపేజీ తరువాయి..

వెంటనే భర్తీ చేయాలని వారికి ఈ సందర్భంగా కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ స్పష్టం చేశారు. అలాగే గ్రామాల అభివృద్ధే వికసిత్ భారత్‌కు పునాది కావాలని ఆకాంక్షించారు. రాజకీయాలకు అతీతంగా కలిసి పనిచేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వాలకు ఆయన సూచించారు. జులై 1వ తేదీ నుంచి వికసిత్ భారత్ గ్రామీణ యోజన అమలు చేస్తున్నట్లు చెప్పారు. నిధుల వాటా సమయానికి విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాలను కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ కోరారు. గ్రామీణాభివృద్ధి పథకాల అమలులో ముందంజలో ఉందంటూ ఆంధ్రప్రదేశ్‌పై కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ ప్రశంసలు కురిపించారు. వీబీజీఆర్ఎంఏజీఐకి నోటిఫికేషన్ పూర్తి చేసిన రాష్ట్రాల జాబితాలో ఏపీ ఉ ఒదన్నారు. జులై 2వ తేదీన తిరుపతిలో వీబీజీఆర్ఎంఏజీఐ ప్రారంభిస్తామని ప్రకటించారు. ఈ జాతీయ కార్యక్రమం ప్రారంభోత్సవానికి ఆతిథ్య రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను ఎంపిక చేశామన్నారు. ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన నాణ్యతలో దేశంలోనే అత్యుత్తమ రాష్ట్రాల్లో ఏపీకి స్థానం దక్కిందని మంత్రి శివరాజ్‌సింగ్ పేర్కొన్నారు.

# కేంద్రం సహకరిస్తేనే రాష్ట్రాల అభివృద్ధి సాధ్యం

మొదటిపేజీ తరువాయి..

కొనసాగించాలా లేక ఆ స్థానంలో రాష్ట్ర ప్రభుత్వం కొత్త పథకం ప్రవేశపెట్టాలా అనే దానిపై ఆలోచన చేస్తామన్నారు. వీబీ జీ రామ్ జీ పథకం 60:40 నిధుల విధానంపై తెలంగాణకు తీవ్ర అభ్యంతరాలు ఉ న్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్త పథకం పెడితే కేంద్రం నిధులు ఇవ్వదని..100శాతం ఆర్థిక భారం రాష్ట్రంపై పడుతోందని వివరించారు. ఈ సందర్భంగా కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు పలు కీలక సమస్యలు, నిధుల విడుదల అంశాలపై వినతిపత్రం సమర్పించారు. 'వికసిత్ గ్రామాలు-2047' అనే గొప్ప ఆశయం నెరవేరాలన్నా, గ్రామీణ ప్రాంతాలు స్వయంసమృద్ధి సాధించాలన్నా రాష్ట్రాలపై కేంద్రం అదనపు ఆర్థిక భారం మోపకూడదని ఆమె ఈ సందర్భంగా స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం కొత్తగా ప్రతిపాదించిన విబిజి రామ్ పథకంలో ప్రవేశపెడుతున్న కొత్త 60:40 నిధుల విధానంపై తెలంగాణ ప్రభుత్వం తన తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేసింది. ఈ నూతన ఆర్థిక సమీకరణ వల్ల రాష్ట్రాలపై ఊహించని రీతిలో భారీ ఆర్థిక భారం పడుతుందని మంత్రి సీతక్క పేర్కొన్నారు. ఈ నిబంధనలపై జూలై 2న జరగబోయే రాష్ట్ర కేబినెట్ సమావేశంలో తెలంగాణ ప్రభుత్వం ఒక తుది నిర్ణయం తీసుకోనుందని వెల్లడించారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో గతంలో ఉన్నట్లుగానే 100 శాతం వేతనాల విధానాన్ని యథాతథంగా కొనసాగించాలని కేంద్రానికి డిమాండ్ చేశారు. అలాగే మెటీరియల్ కాంపోనెంట్‌కు సంబంధించి కూడా గతంలో ఉన్న 75 శాతం కేంద్ర వాటాను అలాగే ఉంచాలని ఆమె విజ్ఞప్తి చేశారు. కేంద్ర నిధులు కోల్పోకుండానే, రాష్ట్ర ప్రయోజనాలను పూర్తిస్థాయిలో కాపాడేలా తమ ప్రభుత్వం ముందడుగు వేస్తుందని స్పష్టం చేశారు.

ప్రధానమంత్రి గ్రామ్ సడక్ యోజన కింద రాష్ట్రంలో చేపట్టే గ్రామీణ రోడ్ల నిర్మాణానికి అటవీ శాఖ అనుమతులు ప్రధాన అడ్డంకిగా మారాయని మంత్రి సీతక్క కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా ఆదిలాబాద్, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, నల్లమల అటవీ ప్రాంతాల్లో అనేక రోడ్డు పనులు పూర్తిగా నిలిచి పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం రోడ్లే కాకుండా, అటవీ అనుమతులు సకాలంలో రాకపోవడం వల్ల ఏజెన్సీ ప్రాంతాల్లోని పేదలకు ఇళ్లు, బోర్‌వెల్లు, అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలు కూడా అర్ధాంతరంగా ఆగిపోయాయని వివరించారు. ఈ క్లియరెన్స్ పక్రియను వేగవంతం చేయడంతో పాటు, రాష్ట్రానికి రావాల్సిన పీఎం




ఆవాస్ యోజన గృహాల కేటాయింపులను కేంద్రం వెంటనే విడుదల చేయాలని కోరారు. కేంద్రం నుండి నిధుల విడుదలలో జరుగుతున్న జాప్యం వల్ల పనులు మందగిస్తున్నాయని, రాష్ట్రంలో అధికారుల తరచూ బదిలీల వల్ల కూడా కేంద్రానికి నివేదికలు సమర్పించడంలో కొంత ఆలస్యం జరిగిందని ఆమె అంగీకరించారు. ఇన్ని సవాళ్లు ఉన్నప్పటికీ గ్రామీణాభివృద్ధిలో తెలంగాణ అద్భుతమైన ప్రదర్శన కనబరుస్తోందని మంత్రి సీతక్క గర్వంగా ప్రకటించారు. జల్ సంచార్ విభాగంలో తెలంగాణ రాష్ట్రానికి ఏకంగా 13 జాతీయ అవార్డులు రావడం తమ ప్రభుత్వ సమర్థవంతమైన పనితీరుకు నిదర్శనమన్నారు. అలాగే, దేశవ్యాప్తంగా 100 రోజుల ఉపాధి కల్పనను అమలు చేయడంలో తెలంగాణ దేశంలోనే రెండో స్థానంలో నిలిచిందని ఆమె ఈ సందర్భంగా గుర్తుచేశారు. రాష్ట్రాలపై ఆర్థిక భారాన్ని తగ్గిస్తేనే గ్రామాల అభివృద్ధి మరింత వేగంగా సాధ్యమవుతుందని కేంద్రమంత్రికి వివరించారు. 100 రోజుల ఉపాధి కల్పనలో తెలంగాణ.. దేశంలో రెండో స్థానంలో ఉందని చెప్పారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం వద్దనడంతో పీఎం ఆవాస్ గృహాల కేటాయింపులు లేవని.. ఇప్పుడు వెంటనే ఇవ్వాలని కేంద్రాన్ని తెలంగాణ ప్రభుత్వం కోరుతోందన్నారు. తెలంగాణ నుంచి పన్నుల వాటా తీసుకుంటున్నప్పుడు కేంద్ర పథకాలు రాష్ట్రంలో అమలు చేయాలని తెలిపారు. కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు అటవీ క్లియరెన్స్‌పై వినతిపత్రం అందజేసినట్లు మంత్రి తెలిపారు. కేంద్రం నుంచి నిధుల విడుదలలో కూడా జాప్యం జరుగుతోందన్నారు. తరచూ అధికారుల బదిలీలతో నివేదికల సమర్పణలో ఆలస్యం జరిగిందని అన్నారు.

# అయోధ్య రామాలయ నిధుల దుర్వినియోగం

మొదటిపేజీ తరువాయి..

నిరాకరించింది. అయోధ్య రామమందిర విరాళాల నిధుల దుర్వినియోగం జరిగిందంటూ దాఖలైన పిటిషన్‌పై తక్షణ విచారణ చేపట్టేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ఈ వ్యవహారంపై సీబీఐతో స్వతంత్ర దర్యాప్తు జరిపించాలని కోరుతూ పిటిషనర్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అయితే ఈ కేసులో వెంటనే విచారణ చేపట్టాల్సిన అత్యవసర పరిస్థితులు లేవని జస్టిస్ ఎం.ఎం. సుందరేశ్, జస్టిస్ షీల్ నాగు ధర్మాసనం స్పష్టం చేసింది. అయితే, పిటిషనర్ తరఫు న్యాయవాది వాదిస్తూ, రామమందిర విరాళాల నిధుల వినియోగంలో అవకతవకలు జరిగాయని, ఈ వ్యవహారంపై సీబీఐతో స్వతంత్ర విచారణ జరిపించాలని కోర్టును కోరారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు అనుమానాలకు తావిస్తోందని, అందుకే స్వతంత్ర దర్యాప్తు అవసరమని ఆయన వాదించారు. ఇక, కేసు ఆలస్యమైతే ఎలక్ట్రానిక్ ఆధారాలు చెరిపివేసే అవకాశం ఉందని పిటిషనర్ తరఫు న్యాయవాది ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన కోర్టు, మెన్షన్ స్లిప్ సర్క్యులేట్ చేయాలని సూచించింది. అయితే ఈ కేసులో వెంటనే విచారణ చేపట్టాల్సిన అత్యవసర పరిస్థితులు లేవని జస్టిస్ ఎం.ఎం. సుందరేశ్, జస్టిస్ షీల్ నాగు ధర్మాసనం స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు తిరిగి ప్రారంభమైన వెంటనే ఈ కేసును లిస్ట్ చేసి విచారణ చేపడతామని జస్టిస్ ఎం.ఎం. సుందరేశ్ నేతృత్వంలోని ధర్మాసనం తెలిపింది. ప్రస్తుతం ఈ అంశంపై అత్యవసర విచారణ అవసరం లేదని స్పష్టం చేసింది. ఈలోపే మిన్ను విరిగి మీద పడదు.. అంత తొందరెందుక'ని పిటిషనర్‌ను ప్రశ్నించింది. మరోవైపు, ఈ కేసులో నిందితుల పక్షాన ఎవరూ వాదించొద్దన్ని ÷జాబాద్ బార్ అసోసియేషన్ నిర్ణయించింది. 'ఈ కేసులో నిందితుల తరఫున ఎవరూ వాదించరు. ఒకవేళ ఎవరైనా అలా చేస్తే.. క్రమశిక్షణా చర్యలు ఎదుర్కోవలసి వస్తుంది. వారికి రూ.5లక్షలు జరిమానా విధిస్తాం' అని అసోసియేషన్ అధ్యక్షుడు కలికా ప్రసాద్ మిశ్రా మీడియాకు వెల్లడించారు. 2005లో కూడా అక్కడి న్యాయవాదులు ఇలాంటి నిర్ణయమే తీసుకున్నారు. ఆ ఏడాది రామ మందిరంపై దాడికి పాల్పడిన నిందితులను ఫైజాబాద్ కోర్టు ముందు హాజరుపర్చగా.. వారి పక్షాన వాదించేందుకు ఎవరూ ముందుకురాలేదు.

కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో అరెస్టయిన ఎనిమిది మంది నిందితులకు ప్రత్యేక అవినీతి నిరోధక న్యాయస్థానం 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించింది. దీంతో వారు జులై 13 వరకు జైలులోనే ఉండనున్నారు. దర్యాప్తు ఇంకా కొనసాగుతున్నందున నిందితులను జ్యుడీషియల్ కస్టడీలో ఉంచాల్సిన అవసరముందని పోలీసులు కోర్టుకు వివరించడంతో.. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది న్యాయస్థానం. ఈ కేసులో రామశంకర్ అలియాస్ తిన్నూ యాదవ్ సహా అవినాశ్ శుక్లా, అనుకల్ప్ మిశ్రా, లవ్‌కుశ్ మిశ్రా, మనీశ్ కుమార్ యాదవ్, కరుణెశ్ పాండే, రామ్‌శంకర్ మిశ్రా, సుభాశ్ శ్రీవాస్తవ్‌లు నిందితులుగా ఉన్నారు. వీరంతా రామాలయానికి వచ్చిన విరాళాల నగదు, విలువైన వస్తువుల లెక్కింపు, నిర్వహణ బాధ్యతల్లో పనిచేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఇప్పటికే నిందితుల ఇళ్లలో సోదాలు నిర్వహించిన స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్(ఎస్ఐటీ).. సుమారు రూ.79.85 లక్షల నగదును స్వాధీనం చేసుకుంది. నిందితులు ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో వారి ఆర్థిక లావాదేవీలు, బ్యాంకు అకౌంట్లు, ఆస్తుల వివరాలను అధికారులు తనిఖీ చేస్తున్నారు. ఈ కేసులో కొందరు బ్యాంకు ఉద్యోగుల పాత్ర కూడా ఉ ఒదనే అనుమానంతో ఆ కోణంలోనూ దర్యాప్తు చేపట్టినట్టు తెలుస్తోంది. దీంతో మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

# ముఖం చాటేసిన నైరుతి



మొదటిపేజీ తరువాయి..

గుజరాత్ 86 శాతం వర్షపాతలోటుతో ఉండగా, మహారాష్ట్రలో 60 శాతం లోటు నమోదైంది. మధ్యప్రదేశ్ లో 42 శాతం, యూపీలో 59 శాతం, బీహార్‌లో 52 శాతం, ఒడిశాలో 53 శాతం, తెలంగాణలో 32 శాతం, కర్ణాటకలో 47 శాతం వర్షపాత లోటు రికార్డయ్యింది. తెలంగాణ రాష్ట్రంలో వర్షాకాలం ప్రారంభమైనప్పటికీ.. ఎల్ నినో ప్రభావం వల్ల చాలాప్రాంతాల్లో చినుకుజాడ కరువైంది. వానకాలం సాగుపై రైతుల్లో ఆందోళన పెరుగుతున్నది. జూన్ 15 నాటికి దేశంలోని దక్షిణ, తూర్పు, ఈశాన్య ప్రాంతాలకు విస్తరించిన రుతుపవనాలు, తర్వాత స్తంభించిపోయాయి. దేశంలోని చాలాప్రాంతాల్లో 40 శాతం తకువ వర్షపాతం నమోదయ్యింది. జూన్ నెల లోటును భర్తీ చేయడానికి కొంతసమయం పడుతుందని నిపుణులు పేర్కొంటున్నారు. వాతావరణంలో తేమ శాతం పెరుగడం వల్ల, సుదీర్ఘ పొడికాలం తర్వాత అకస్మాత్తుగా కురిసే భారీవర్షాలు, వరదలు వంటి తీవ్ర వాతావరణ పరిస్థితులు భవిష్యత్తులో పెరిగే అవకాశం ఉన్నదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. తెలంగాణకు హైదరాబాద్ వాతావరణశాఖ రెయిన్ అలర్ట్ జారీ చేసింది. ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, కామారెడ్డి, మెదక్, రాజన్న సిరిసిల్ల, నల్లగొండ, సూర్యాపేట, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో విస్తారంగా వర్షాలు కురిసేందుకు అనుకూల పరిస్థితులు ఏర్పడ్డాయని వెల్లడించారు.

# నేటి నుంచి రైతుభరోసా నిధుల విడుదల

మొదటిపేజీ తరువాయి..

మంగళవారం సాయంత్రం 4 గంటలకు ఈ కార్యక్రమం జరగనుంది. అన్నదాతలకు పెట్టుబడి సాయం కింద తొలి విడతలో 2 ఎకరాల వరకు నిధులు విడుదల చేస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రేపు 41.37 లక్షల మంది రైతుల కోసం, రూ.2,482 కోట్లు విడుదల చేస్తామన్నారు. మిగతా వారికి దశలవారీగా నిధులు జమచేస్తామని చెప్పారు. మొత్తంగా 10 రోజుల్లో అర్హులందరికీ పెట్టుబడి సాయం అందజేయనున్నారు. కొత్తగా పాసుబుక్‌లు వచ్చిన వారు జులై 5 లోపు రైతు భరోసా కోసం దరఖాస్తు చేసుకోవచ్చని మంత్రి తుమ్మల చెప్పారు. వర్షాల వల్లనే రైతు ఆశీర్వాద సభ వేదికను మార్చినట్లు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడించారు. ఈనెల 4 వరకు వర్షాలు ఉన్నాయని వాతావరణశాఖ చెప్పిందన్నారు. ఖమ్మం జిల్లా మధిరలో కచ్చితంగా సభ నిర్వహిస్తామని భట్టి చెప్పారు. రైతుభరోసా ముగింపు వేడుకగా సభ నిర్వహించే ఆలోచన చేస్తున్నామన్నారు. అనుకూల వాతావరణం చూసి మధిర సభ తేదీని మళ్లీ ప్రకటిస్తామని భట్టి వెల్లడించారు.

# మరోసారి రాజ్యసభ ప్రతిపక్ష నేతగా ఖర్గే

మొదటిపేజీ తరువాయి..

ఈనెల 26నుంచి ప్రతిపక్ష నేతగా ఆయన నియామకం అమల్లోకి వస్తుందని రాజ్యసభ సెక్రటరీ జనరల్ రాజ మోదీ బులెటిన్ విడుదల చేశారు. అంతకుముందు రాజ్యసభ ఛైర్మన్ ఛాంబర్‌లో సోమవారం మల్లికార్జున ఖర్గే ప్రమాణం చేశారు. ఖర్గే చేత రాజ్యసభ ఛైర్మన్ ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఖర్గే తన చేతిలో రాజ్యాంగ ప్రతిని పట్టుకుని హిందీలో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఛైర్‌పర్సన్ సోనియా గాంధీ, వయనాడ్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా హాజరయ్యారు. రాజ్యసభ సభ్యుడిగా మరోసారి ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం, ప్రతిపక్ష నాయకుడిగా తన సేవలను కొనసాగిస్తానని ఖర్గే అన్నారు. రాజ్యసభకు తన పునఃనియమించడాన్ని, ప్రతిపక్ష నాయకుడిగా తనను కొనసాగించడాన్ని అపారమైన గర్వకారణంగా అభివర్ణించారు. అటు అధికారులు, పార్టీ నాయకత్వం, రాజకీయ సహచరులు అందించిన మద్దతుకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. జ్యసభ సభ్యుడిగా మరోసారి ప్రమాణ స్వీకారం చేసే గౌరవం నాకు లభించింది. రాజ్యసభకు ప్రతిపక్ష నాయకుడిగా సేవలు కొనసాగించడం అపారమైన గర్వకారణం, బాధ్యత. నాకు నిరంతరం మద్దతు అందించిన భారత ఉపరాష్ట్రపతి, రాజ్యసభ ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్‌కు, డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్‌కు హృదయపూర్వక కృతజ్ఞతలు.

Printed and Published by V. SRINIVAS REDDY on behalf of M/S SAI KRISHNA PUBLICATIONS Owned by M/S SAI KRISHNA PUBLICATIONS Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at H.No. 1-2-79/4/A, Shanthi Nagar, Adilabad, Adilabad Dist, Telangana. Editor: V. SRINIVAS REDDY, RNI No. TELTEL/2008/24799, Ph No: 9440231967